



# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక — ప్రశ్నించడం మన హక్కు






సంపుటి : 1 సంచిక : 245 పేజీలు : 12 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : హైదరాబాద్ మంగళవారం 14 జూలై 2026 వెల : 1/-రూ ॥

VOLUME :1 ISSUE : 245 PAGES : 12 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : HYDERABAD TUE 14 JULY 2026 PRICE : 1/- RS

Simultaneously Published form : Hyderabad, Thadepalligudem, Dr. B.R. Ambedkar Konasema Dist, Narasarao Peta,Bapatla,Visakhapatnam,Kakinada,Ongole, Kadapa,,SPSR Nellore, Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur, Tirupati,Chittor,Kurnool,Anantapur


# కేంద్ర-రాష్ట్ర సహకారంతోనే తెలంగాణ అభివృద్ధి

## రీజనల్ రింగ్ రోడ్డుపై అఖిల పక్ష సమావేశంలో సీఎం కీలక ప్రకటన

- రాష్ట్ర అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి పనిచేయాలని సీఎం రేవంత్ రెడ్డి పిలుపు.
- హైదరాబాద్‌కు ఐటీఐఆర్ మెట్రో విస్తరణకు కేంద్రం సహకారం అందించాలని బీజేపీ ఎంపీలను కోరిన సీఎం.
- రీజనల్ రింగ్ రోడ్ భూసేకరణ పూర్తిదశకు చేరిందని, కేంద్ర నిధులతో ప్రాజెక్టును వేగంగా పూర్తి చేయాలని సూచన.
- మూసీ పునరుజ్జీవం, తుమ్మిడిహట్టి, పోర్ట్ కనెక్టివిటీ, బుల్లెట్ ట్రైన్, ఆదిలాబాద్-వరంగల్ ఎయిర్‌పోర్టుల అనుమతులు త్వరితగతిన పూర్తి చేయాలని విజ్ఞప్తి.
- డిండి (30 టీఎంసీలు), పాలమూరు-రంగారెడ్డి (90 టీఎంసీలు) ప్రాజెక్టులకు ఆంధ్రప్రదేశ్ ఎన్ఓసీ ఇవ్వాల్సి ఉందని, ఈ విషయంలో కేంద్రం చొరవ చూపాలని కోరారు.
- గోదావరి-కావేరి అనుసంధానం రాష్ట్రానికి ప్రయోజనకరమని, కేంద్రం సహకరిస్తే బహిరంగంగానే అభినందిస్తామని సీఎం స్పష్టం చేశారు.




హైదరాబాద్ పెన్ పవర్:కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య పరస్పర సహకారం ఉంటేనే తెలంగాణను అభివృద్ధి పథం వైపు నడిపించగలమని సీఎం రేవంత్ అన్నారు. సోమవారం (జులై 13) ఎంపీలతో అఖిల పక్ష సమావేశం నిర్వహించిన సీఎం.. రాజకీయాలకు అతీతంగా రాష్ట్రాన్ని అభివృద్ధి చేసుకోవాలని అన్నారు. హైదరాబాద్ కు ఐటీఐఆర్ ను తీసుకురావాలని అందుకు బీజేపీ ఎంపీలు చొరవ చూపాలని కోరారు. మెట్రో విస్తరణకు కేంద్ర ప్రభుత్వ సహకారం అవసరం, మెట్రో విస్తరణకు సంబంధించి రుణాల ప్రక్రియను వీలైనంత త్వరగా పూర్తి చేసేలా చూడాలని చెప్పారు. రీజనల్ రింగ్ రోడ్ భూసేకరణ ఒక కొలిక్కి వచ్చింది.. కేంద్రం నుంచి నిధులు తెచ్చుకుని రీజనల్ రింగ్ రోడ్ ను పూర్తి చేసుకోవాలని అన్నారు. మూసీ పునరుజ్జీవానికి సంబంధించి కేంద్రం నుంచి అర్బన్ ఛాలెంజ్ ఫండ్ కోసం అనుమతులు వచ్చేలా కృషి చేయాలని సూచించారు. సాగునీటికి సంబంధించి తుంగభద్ర గేట్ల ప్రాంభోత్సవం సందర్భంగా సీఆర్ పాటిల్ తో చర్చించాం.. ఉమ్మడి రాష్ట్రంలో మంజూరైన ప్రాజెక్టులకు ఆంధ్రప్రదేశ్ నుంచి ఎన్ఓసీ ఇవ్వాల్సి ఉంది.. డిండి-30 టీఎంసీలకు, పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టు-90 టీఎంసీలకు చీఓజ ఇవ్వాల్సి ఉంది.. చీఓజ అంశం చర్చల దశలో ఉందని.. ఈ విషయంలో కేంద్రం కూడా చొరవ చూపాలి అన్నారు.

- మిగతా 2లో



ఇంజనీర్లకు సీఎం వెంటనే

## క్షమాపణ చెప్పాలి

## ఎంపీ ఈటల రాజేందర్ డిమాండ్

హైదరాబాద్ పెన్ పవర్: కాళేశ్వరం ప్రాజెక్టు వివాదంలో బీఆర్ఎస్ నేతలు, రిటైర్డ్ ఇంజినీర్లను ఉద్దేశించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు పూర్తిగా అవాస్తవమని, అహంకారంతో నోటికి ఏది వస్తే అది మాట్లాడటం మానుకోవాలని ఎంపీ ఈటల రాజేందర్ హెచ్చరించారు. సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో తెలంగాణ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ ఫోరమ్ ఆధ్వర్యంలో జరిగిన రౌండ్? టేబుల్? సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... 'ఖబర్దార్ రేవంత్ రెడ్డి! పదవి ఉందనే అహంకారంతో మాట్లాడితే చూస్తూ ఊరుకోం. ప్రాజెక్టుల నిర్మాణం కోసం రాత్రింబగళ్లు కష్టపడిన ఇంజనీర్లను కించపరిచేలా చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని, వారికి బహిరంగ క్షమాపణ చెప్పాల'ని డిమాండ్ చేశారు. 2023లో లక్ష్మీ బ్యారేజ్ వద్ద రెండు పిల్లర్లు కుంగిపోయాయి. డిజైన్ల తప్పుంటే విచారణ చేసి ఇంజినీర్లను, క్వాలిటీలో లోపాలు ఉంటే ఆ కాంట్రాక్టర్లను, అలాగే ఎవరి సలహా పట్టించుకోకుండా నాటి

- మిగతా 2లో

## 'సింగరేణి భరోసా యాత్ర' ప్రారంభించిన తెలంగాణ బీజేపీ

- తాడిచెర్ల-2 బొగ్గు బ్లాక్ కేటాయించిన నిర్ణయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడమే లక్ష్యం
- హైదరాబాద్‌లోని పార్టీ రాష్ట్ర కార్యాలయం నుంచి ప్రారంభం
- కిషన్ రెడ్డి, రాంచందర్ రావు సహా పలువురు నేతలతో 2 రోజుల యాత్రకు శ్రీకారం
- బీఆర్ఎస్, కాంగ్రెస్ రెండూ సింగరేణిని నిర్లక్ష్యం చేశాయని ఆరోపణ
- మోదీ ప్రత్యేకంగా ఈ బ్లాక్‌ను సింగరేణికి కేటాయించారని వెల్లడి



హైదరాబాద్ పెన్ పవర్:సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ (ఎస్‌సీసీఎల్)కు కేంద్ర ప్రభుత్వం తాడిచెర్ల-2 బొగ్గు బ్లాక్ కేటాయించిన నిర్ణయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు తెలంగాణ బీజేపీ సోమవారం 'సింగరేణి భరోసా యాత్ర'ను ప్రారంభించింది. హైదరాబాద్‌లోని పార్టీ రాష్ట్ర కార్యాలయం నుంచి కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు తదితర నేతలు ఈ రెండు రోజుల యాత్రకు శ్రీకారం చుట్టారు. అనంతరం ఖమ్మం

- మిగతా 2లో



# నులిపురుగులకు చెక్.. 1-19 ఏళ్ల వారందరికీ తప్పనిసరి ఆల్బెండజోల్

## మంత్రి కీలక హెచ్చరిక

హైదరాబాద్ పెన్ పవర్: పిల్లల్లో నులిపురుగులు (నట్టలు) చేరితే అవి కంటికి కనిపించకుండానే వారి ఆరోగ్యాన్ని గుల్ల చేస్తాయని, మాత్రలు వేయించకపోతే రక్తహీనత, తీవ్ర పోషకాహార లోపంతో పాటు ఎదుగుదల పూర్తిగా మందగిస్తుందని రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహా హెచ్చరించారు. ఈ సమస్యల కారణంగా చిన్నారుల్లో ఏకాగ్రత

- మిగతా 2లో

## హైడ్రాకు 12.50 కోట్ల నిధులు విడుదల చేసిన రాష్ట్ర ప్రభుత్వం




హైదరాబాద్ పెన్ పవర్:: హైడ్రాకు రూ.12.50 కోట్ల నిధులను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది. మెట్రోపాలిటన్ ఒ అర్బన్ డెవలప్‌మెంట్ శాఖ నుంచి జీవో విడుదలైంది. హైడ్రా కార్యకలాపాల కోసం ప్రభుత్వం ఈ నిధులు విడుదల చేసింది. ఆర్థిక శాఖ విడుదల ఉత్తర్వుల మేరకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. నిధులు డ్రా చేసుకోవాలని

- మిగతా 2లో

## షాబాద్ నరహంతకుడు రాజ్‌కుమార్ మృతి



హైదరాబాద్ పెన్ పవర్: తెలుగు రాష్ట్రాల్లో సంచలనం రేపిన షాబాద్ ఆరు హత్యల కేసులో నరహంతకుడు రాజ్‌కుమార్ (29) మృతిచెందాడు. రంగారెడ్డి జిల్లా కొత్తూరు మండలం పెంజర్లలోని ఓ వెంచర్‌లో అతడి మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. డయల్ 100కు సమాచారం ఇవ్వడంతో పోలీసులు అక్కడికి చేరుకుని పరిశీలించారు. మృతుడిని రాజ్‌కుమార్‌గా నిర్ధరించారు. మృతదేహం పక్కన

- మిగతా 2లో

## ఒమర్ అబ్దుల్లాకు బీజేపీ షాక్.. రూ.100 కోట్ల పరువు నష్టం నోటీసు!

- ఎమ్మెల్యేల కొనుగోలుకు బీజేపీ యత్నించిందని ఒమర్ ఆరోపణ
- ఏడు రోజుల్లో బహిరంగ క్షమాపణ చెప్పాలని నోటీసులో బీజేపీ డిమాండ్
- లేదంటే సివిల్, క్రిమినల్ చర్యలు తప్పవని హెచ్చరిక
- ఆరోపణలు నిరాధారమైనవని కొట్టిపారేసిన కాషాయదళం

పెన్ పవర్ డెస్క్:జమ్మూకశ్మీర్‌లో రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి. తమ ప్రభుత్వాన్ని కూల్చేందుకు ఎమ్మెల్యేలను కొనుగోలు చేసేందుకు బీజేపీ ప్రయత్నిస్తోందంటూ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపాయి. ఈ ఆరోపణలను తీవ్రంగా పరిగణించిన బీజేపీ, ఒమర్ అబ్దుల్లాకు రూ.100 కోట్ల పరువు నష్టం నోటీసును జారీ చేసింది. ఏడు రోజుల్లోగా తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని, బేషరతుగా బహిరంగ క్షమాపణ

- మిగతా 2లో



## పోలవరం, బనకచర్లపై పిటిషన్.. తెలంగాణకు సుప్రీంకోర్టులో ఎదురుదెబ్బ

- ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా తెలంగాణ పిటిషన్
- పోలవరం, కృష్ణా జలాల వినియోగం, బనకచర్ల అంశాలపై దాఖలైన వ్యాజ్యం
- ఏపీ చేపడుతున్న పనులపై స్టే విధిస్తూ నోటీసులు జారీ చేయాలని కోరిన తెలంగాణ
- పిటిషన్‌లో తీవ్ర సాంకేతిక లోపాలున్నాయన్న ధర్మాసనం
- వాటిని సరిదిద్దకుముందే ఏపీకి నోటీసులు జారీ చేయడం కుదరదని స్పష్టీకరణ

హైదరాబాద్ పెన్ పవర్:అంతర్రాష్ట్ర జల వివాదాలకు సంబంధించిన అంశాల్లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా తెలంగాణ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. పోలవరం ప్రాజెక్టు, కృష్ణా నదీ జలాల వినియోగం, బనకచర్ల క్రాస్ రెగ్యులేటర్ అంశాలపై దాఖలైన పిటిషన్‌ను జస్టిస్ విక్రమ్‌నాథ్ నేతృత్వంలోని ధర్మాసనం విచారించింది. ఈ కేసులో

- మిగతా 2లో



## బంకిపూర్ లో నాదే గెలుపు...

### నామినేషన్ వేసిన ప్రశాంత్ కిశోర్



- బంకిపూర్ అసెంబ్లీ ఉపఎన్నిక బరిలో ప్రశాంత్ కిశోర్
- తొలిసారి ప్రత్యక్ష ఎన్నికల బరిలో జన సురాజ్ పార్టీ అధినేత
- ప్రజలు కొత్త రాజకీయ ప్రత్యామ్నాయం కోరుకుంటున్నారని వ్యాఖ్య
- బీజేపీ, ఆర్జేడీలతో త్రిముఖ పోటీ నెలకొన్న ఉపఎన్నిక
- అభివృద్ధి, పారదర్శక పాలనే తమ ఎజెండా అని స్పష్టీకరణ

- మిగతా 2లో

## గెలిపించిన యువతే ఇప్పుడు రోడ్డెక్కింది.. నేపాల్ ప్రభుత్వంపై జెన్‌జీ ఆగ్రహం

- 25 ఏళ్ల యువకుడి ఆత్మహత్యతో నేపాల్‌లో భారీ నిరసనలు
- బాలేంద్ర షా ప్రభుత్వాన్ని నిలదీస్తున్న జెన్‌జీ యువత
- పేదలపై దౌర్జన్యాలు, అక్రమ అరెస్టులు ఆపాలని డిమాండ్
- మున్సిపల్ పోలీసుల అధికార దుర్వినియోగంపై తీవ్ర విమర్శలు
- చట్టం ఇచ్చిన అధికారాలను వినియోగిస్తున్నామని న్యాయ నిపుణుల ఆరోపణలు



- మిగతా 2లో

## ఆ వార్తలన్నీ అవాస్తవం.. శేఖర్ మాస్టర్‌కు నాకూ గొడవలు లేవు

హైదరాబాద్ పెన్ పవర్: నృత్య దర్శకుడు శేఖర్ మాస్టర్ తో తమకు ఎలాంటి గొడవలు లేవని, తమ మధ్య యుద్ధం అంటూ వస్తున్న వార్తలు అవాస్తవమని జానీ మాస్టర్ ) అన్నారు. డ్యాన్సర్ల అసోసియేషన్ ఎన్నికలు, సభ్యత్వాల విషయంలో ఇరు వర్గాల మధ్య విభేదాలు



- మిగతా 2లో

# ఎడిటర్ వ్యూ

## రేవంత్ లో ఆ ధీమా అందుకేనా? కాన్ఫిడెన్స్ పెరిగిందా?

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈసారి కూడా కాంగ్రెస్ గెలుస్తుందన్న ధీమాతో ఉన్నారు. ఆయన తొలి నుంచి అదే చెబుతున్నారు. ఏ ప్రభుత్వం తెలంగాణలోనైనా పదేళ్ల పాటు కొనసాగుతుందని చెబుతూ వస్తున్నారు. మరొకవైపు తనకు అందిన సమాచారం మేరకు 2029లోనే తెలంగాణ శాసనసభ ఎన్నికలు జరుగుతాయని చెబుతున్నారు. ఆయనకు బహుశ ఢిల్లీ నుంచి వచ్చిన సమాచారం కావచ్చు. అలాగే నియోజకవర్గాల సంఖ్య కూడా పెరుగుతుందని అంటున్నారు. 26 పార్లమెంటు స్థానాలు, 182 వరకూ పెరుగుతాయని అంటున్నారు. ప్రస్తుతం 119 శాసనసభ స్థానాలు మాత్రమే ఉన్నాయి. నియోజకవర్గాల పునర్విభజన జరిగితే శాసనసభ స్థానాలు పెరుగుతాయని చెబుతున్నారు.

**నియోజకవర్గాల పెంపుతో...**

అయితే 182 అసెంబ్లీ స్థానాల్లో 117 స్థానాల్లో కాంగ్రెస్ ఖచ్చితంగా విజయం సాధిస్తుందన్న ధీమాలో రేవంత్ రెడ్డి ఉన్నారు. అందుకు ఆయన అంచనాలు కూడా అలాగే ఉన్నాయి. తమ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో పాటు అభివృద్ధి కూడా తమకు మరోసారి అధికారంలోకి తెచ్చేలా చేస్తుందని రేవంత్ రెడ్డి నమ్ముతున్నారు. దీంతో పాటు గత ప్రభుత్వానికి, ఈ ప్రభుత్వానికి మధ్య పోలిక ను కూడా జనం చూస్తారంటున్నారు. దీంతో పాటు గత ప్రభుత్వం ప్రజలకు చేరువగా లేకపోవడం కూడా తమకు కలసి వస్తుందని అన్నారు. తమది ప్రజా ప్రభుత్వంగా ప్రజలు ఇప్పటికే గుర్తించారని అదే తమకు వరంగా మారుతుందని రేవంత్ రెడ్డి భావిస్తున్నారు. గత ప్రభుత్వం నియంతలా వ్యవహరించడం కూడా తమకు దోహదపడుతుందని అంటున్నారు.

**అంచనాలు ఇవే...**

మరొకవైపు మహిళల్లో ఎక్కువ మంది తమకు అనుకూలంగా ఓట్లు వేస్తారని, మహిళలకు ప్రయోజనం చేకూర్చేలా ఉచిత బస్సు పథకంతో పాటు డ్వాక్రా రుణాలు, ఇందిరమ్మ చీరలు, మహిళలకు రుణాలు, గ్యాస్ సిలిండర్లు, ఉచిత కరెంట్ వంటివి తమకు అధికారాన్ని తెచ్చిపెడతాయని రేవంత్ రెడ్డి నమ్ముతున్నారు. మహిళలు ఎటు మొగ్గు చూపితే వారిదే అధికారమని, అందుకే ఈసారి ఖచ్చితంగా విజయం ఖాయమన్న ధీమాతో ఉన్నారు. మరొకవైపు నియోజకవర్గాల సంఖ్య పెరగడం కూడా తమకు లాభమని అంచనాలో రేవంత్ రెడ్డి ఉన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ లు ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీల్చుకుంటే అది కాంగ్రెస్ కు అధికారాన్ని తెచ్చి పెడుతుందని రేవంత్ రెడ్డి గట్టిగా విశ్వసిస్తున్నారు. మరి రేవంత్ రెడ్డి అంచనాలు ఎంత వరకూ నిజమవుతాయన్నది చూడాలి.

## ఆ వార్తలన్నీ అవాస్తవం.. శేఖర్ మాస్టర్‌కు నాకూ గొడవలు లేవు

- మొదటి పేజి తరువాయి

వచ్చినట్లు వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే. ఆదివారం ఇరు వర్గాల మధ్య వాగ్వాదం చోటు చేసుకున్నట్లు వీడియోలు బయటకు వచ్చాయి. యూనియన్ పెద్దల జోక్యంతో ఆ వివాదం సద్దుమణిగింది. "ఇక్కడ ఎవరికి ఎవరూ శత్రువులు లేరు. మా యూనియన్, డ్యాన్సర్ల కోసం మేము ముందు నిలబడి పనిచేస్తాం. నేను, శేఖర్ మాస్టర్ ఈ రోజు మధ్యాహ్నం అగ్ర కథానాయకుడు చిరంజీవితో కలిసి భోజనం కూడా చేశాం. ఇద్దరం సినిమాలు, పాటలు, డ్యాన్స్ స్టెప్‌లు సహా ఎన్నో విషయాలు మాట్లాడుకున్నాం. (అందుకు సంబంధించిన వీడియోను చూపించారు) మేమెప్పుడూ ఇలా అన్యోన్యంగా ఉంటాం. మాకు చిరంజీవిగారు ఎప్పుడూ మద్దతుగా నిలుస్తారు. ఆయనే కాదు, ఇండస్ట్రీలో ఉన్న హీరోలు, టెక్నీషియన్స్ మా ప్రతిభను ప్రోత్సహిస్తున్నారు. ఈ సందర్భంగా చిరంజీవిగారికి ధన్యవాదాలు చెబుతున్నా. సినీ పరిశ్రమలో డ్యాన్స్ మాస్టర్లు, డ్యాన్సర్లకు మంచి గుర్తింపు, స్థానం ఉందంటే అందుకు కారణం చిరంజీవిగారే. ఇది యూనియన్‌లో జరుగుతున్న చిన్న సమస్య. మళ్లీ చెబుతున్నా, మా డ్యాన్స్ మాస్టర్‌ల మధ్య ఎలాంటి యుద్ధాలు లేవు. చిన్న చిన్న విషయాల్లో అభిప్రాయభేదాలు మాత్రమే. ఇలాంటివి ప్రతి ఇంట్లోనూ ఉంటాయి" అని అన్నారు.

**ప్రశ్నించిన మాపై దుష్ప్రచారం చేస్తున్నారు: సుమలత**

డ్యాన్సర్స్ అసోసియేషన్‌లో తాజా పరిణామాలపై అధ్యక్షురాలు సుమలత వివరణ ఇచ్చారు. "అసోసియేషన్‌లో గత కొన్ని సంవత్సరాలుగా చిన్నవో, పెద్దవో ఏవో తప్పులు జరుగుతూనే ఉన్నాయి. ఒక ప్రెసిడెంట్‌గా బాధ్యత తీసుకుని అసోసియేషన్‌ను ముందుకు నడిపించడం మామూలు విషయం కాదు. ఏది జరిగినా ప్రెసిడెంట్‌నే తప్పు బడతారు. అలా మాట రాకూడదనే నేను ప్రతి దానిని ప్రశ్నిస్తా. ముఖ్యంగా కొందరు డ్యాన్సర్ల దగ్గర డబ్బు దోచుకుంటున్నారు. నిర్మాతల దగ్గర ఒక అమౌంట్ తీసుకుని, అసోసియేషన్‌లో తక్కువ ఇస్తున్నారు. ప్రశ్నించిన మాపై దుష్ప్రచారం చేస్తున్నారు. ఇలా చేసిన వారిని సస్పెండ్ చేశాం. ఆ తర్వాత వాళ్లు రాజీనామా చేశారు. ఇది చాలా మందికి నచ్చడం లేదు. గత పాలనలో నిధుల అవకతవకలు జరిగాయి. గతేడాది ఎన్నికల్లో మేము గెలిచిన దగ్గరి నుంచి ఎన్ని మంచి పనులు చేసినా ప్రతి దానిలోనూ వేలెత్తి చూపుతున్నారు. అందుకే ఈ సమస్యలు వస్తున్నాయి" అని తెలిపారు.

## ఒమర్ అబ్దుల్లాకు బీజేపీ షాక్.. రూ.100 కోట్ల పరువు నష్టం నోటీసు!

- మొదటి పేజి తరువాయి

చెప్పాలని, లేదంటే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించింది.

**అసలేం జరిగింది?**

ఈ నెల 11న తన నాయనమ్మ, 'మదర్-ఎ-మెహర్బాన్'గా పేరుగాంచిన బేగం అక్బర్ జహాన్ 26వ వర్ధంతి సందర్భంగా జరిగిన పార్టీ సమావేశంలో ఒమర్ అబ్దుల్లా బీజేపీపై సంచలన ఆరోపణలు చేశారు. తన నేషనల్ కాన్ఫరెన్స్ (ఎన్‌సీ) ప్రభుత్వాన్ని పడగొట్టేందుకు బీజేపీ కుట్ర చేస్తోందని అన్నారు. ఇందులో భాగంగా జమ్మూ డివిజన్‌కు చెందిన తమ పార్టీ ఎమ్మెల్యేను ఒక సీనియర్ బీజేపీ నేత సంప్రదించారని, పార్టీ మారితే రూ.20 కోట్ల నుంచి రూ.30 కోట్లు, మంత్రి పదవి, జమ్మూకశ్మీర్‌కు తిరిగి రాష్ట్ర హోదా ఇస్తామని ఆఫర్ చేశారని ఆరోపించారు. సుప్రీంకోర్టులో న్యాయవాదిగా పనిచేస్తున్న ఒక సీనియర్ బీజేపీ నేత ఈ వ్యవహారంలో కీలక పాత్ర పోషించారని కూడా ఆయన పేర్కొన్నారు.

**నోటీసులో బీజేపీ డిమాండ్లు**

ఒమర్ వ్యాఖ్యలతో తమ పార్టీ ప్రతిష్ఠకు తీవ్ర భంగం కలిగిందని బీజేపీ పేర్కొంది. జమ్మూకశ్మీర్ బీజేపీ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు సత్ పాల్ శర్మ ఆదేశాల మేరకు అడ్వకేట్ పరిమోక్ష్ సేథ్ ద్వారా ఈ లీగల్ నోటీసును పంపింది. ఒమర్ చేసిన ఆరోపణలు పూర్తిగా అవాస్తవమని, నిరాధారమైనవని, దురుద్దేశపూర్వకమైనవని నోటీసులో స్పష్టం చేసింది. ఎలాంటి ఆధారాలు లేకుండా కేవలం రాజకీయంగా దెబ్బతీసేందుకే ఈ వ్యాఖ్యలు చేశారని పేర్కొంది. ఈ నేపథ్యంలో ఒమర్ అబ్దుల్లా ఏడు రోజుల్లోగా ఈ ఆరోపణలను లిఖితపూర్వకంగా ఉపసంహరించుకోవాలని, బేషరతుగా బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేసింది. భవిష్యత్తులో ఇలాంటి వ్యాఖ్యలు పునరావృతం చేయవద్దని కూడా సూచించింది.

**చర్యలకు సిద్ధమన్న బీజేపీ**

గడువులోగా ఒమర్ స్పందించకపోతే రూ.100 కోట్ల నష్టపరిహారం కోరుతూ సివిల్ పరువు నష్టం దావా వేస్తామని బీజేపీ హెచ్చరించింది. దీంతోపాటు చట్టంలోని సంబంధిత సెక్షన్ల కింద క్రిమినల్ చర్యలు కూడా ప్రారంభిస్తామని నోటీసులో స్పష్టం చేసింది. ఈ ఆరోపణలను బీజేపీ మొదటి నుంచి ఖండిస్తోంది. రాజకీయంగా ప్రేరేపితమైన ఈ వ్యాఖ్యల వెనుక తమ పార్టీ ప్రతిష్ఠను దెబ్బతీసే కుట్ర ఉందని ఆ పార్టీ నేతలు విమర్శిస్తున్నారు. ఈ నోటీసుతో జమ్మూకశ్మీర్ రాజకీయాలు మరింత వేడెక్కాయి. ఒమర్ అబ్దుల్లా దీనిపై ఎలా స్పందిస్తారన్నది ఆసక్తికరంగా మారింది.

## బంకిపూర్ లో నాదే గెలుపు...

బీహార్ రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి. ప్రముఖ రాజకీయ వ్యూహకర్త, జన్ సురాజ్ పార్టీ వ్యవస్థాపకుడు ప్రశాంత్ కిశోర్ (పీకే) తొలిసారి ప్రత్యక్ష ఎన్నికల బరిలోకి దిగుతుండడం తెలిసిందే. బంకిపూర్ అసెంబ్లీ స్థానానికి జరగనున్న ఉపఎన్నికల్లో ఆయన పోటీ చేస్తున్నారు. ఈ క్రమంలో ఆయన సోమవారం నాడు పాట్నా కలెక్టరేట్‌లో నామినేషన్ దాఖలు చేశారు. పార్టీ సీనియర్ నాయకులు, మద్దతుదారులతో కలిసి వచ్చి ఆయన తన నామినేషన్ పత్రాలను సమర్పించారు. ఈ సందర్భంగా ప్రశాంత్ కిశోర్ మీడియాతో మాట్లాడుతూ, ఉపఎన్నిక ఫలితంపై ధీమా వ్యక్తం చేశారు. తమ ప్రచారానికి ప్రజల నుంచి అద్భుతమైన స్పందన వస్తోందని, ఓటర్లు కొత్త రాజకీయ ప్రత్యామ్నాయం కోసం ఎదురుచూస్తున్నారని అన్నారు. సంప్రదాయ రాజకీయాలకు విసిగిపోయిన ప్రజలు మార్పు కోరుకుంటున్నారని, అందువల్ల ఈ పోటీ తమకు ఏమాత్రం కష్టం కాదని తెలిపారు. ఈ ఎన్నికల తీర్పు రాష్ట్రంలో రాజకీయ మార్పుకు నాంది పలుకుతుందని, జన్ సురాజ్ విజన్ పట్ల పెరుగుతున్న మద్దతుకు ఇది నిదర్శనంగా నిలుస్తుందని ప్రశాంత్ కిశోర్ విశ్వాసం వ్యక్తం చేశారు.

# నులిపురుగులకు చెక్.. 1-19 ఏళ్ల వారందరికీ తప్పనిసరి ఆల్బెండజోల్

- మొదటి పేజి తరువాయి

దెబ్బతిని చదువుపై శ్రద్ధ తగ్గిపోయే ప్రమాదం ఉందన్నారు. పిల్లల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని 1 నుంచి 19 సంవత్సరాల వయస్సున్న ప్రతి ఒక్కరికీ ఆల్బెండజోల్ మాత్రను తప్పనిసరిగా వేయించాలని ఆయన తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు. సోమవారం హైదరాబాద్‌లోని రాజ్‌భవన్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో రాష్ట్రస్థాయి ఆల్బెండజోల్ టాబ్లెట్లు పంపిణీ కార్యక్రమాన్ని మంత్రి స్వయంగా విద్యార్థులకు మాత్రలు వేసి ప్రారంభించారు. ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో విద్యాశాఖ, మహిళా-శిశు సంక్షేమ శాఖల సమన్వయంతో ఈ భారీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, జూనియర్ కళాశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా మొత్తం 96,81,855 మంది చిన్నారులు, విద్యార్థులకు ఈ మాత్రలను అందజేస్తున్నట్లు మంత్రి వివరించారు.

**మాత్రలతో పెరగనున్న రోగనిరోధక శక్తి..**

ఆల్బెండజోల్ మాత్రలు వేయడం వల్ల పిల్లల్లో నులిపురుగుల సమస్య పూర్తిగా తొలగిపోతుందని, వారు తిన్న ఆహారంలోని పోషకాలు శరీరానికి అబ్బి ఆరోగ్యం మెరుగుపడుతుందని మంత్రి తెలిపారు. దీనివల్ల పిల్లల్లో రోగనిరోధక శక్తి పెరగడంతో పాటు పాఠశాలల్లో నేర్చుకునే సామర్థ్యం, ఏకాగ్రత కూడా పెరుగుతుందన్నారు. ఈ బృహత్తర కార్యక్రమానికి తల్లిదండ్రులందరూ పూర్తి స్థాయిలో సహకరించాలని కోరారు. కేవలం మాత్రలు వేయడమే కాకుండా వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పై పిల్లలకు అవగాహన కల్పించాలన్నారు. చేతులను సబ్బుతో శుభ్రంగా కడుక్కోవడం, రక్షిత తాగునీరు తాగడం, పండ్లు, కూరగాయలను కడిగి తినడం వంటి మంచి అలవాట్లను అలవర్చాలని ఆరోగ్యశాఖ అధికారులకు సూచించారు. సోమవారం బడికి రాకపోవడం వల్లనో లేదా ఇతర కారణాల చేతనో మాత్ర వేయించుకో లేకపోయిన పిల్లల కోసం జూలై 20వ తేదీన ప్రత్యేకంగా మాప్-అప్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు మంత్రి ప్రకటించారు. ఆ రోజు విడిచిపెట్టిన విద్యార్థులందరికీ తప్పనిసరిగా ఆల్బెండజోల్ మాత్ర వేస్తామని స్పష్టం చేశారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్, ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్, ఆరోగ్య శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ డాక్టర్ క్రిస్టినా జడ్ చొంగ్తు, హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్ డాక్టర్ సంగీత సత్యనారాయణ, హైదరాబాద్ డీఎంహెచ్‌వో డాక్టర్ పి.శ్రీనివాస్ తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## ఇంజినీర్లకు సీఎం వెంటనే క్షమాపణ చెప్పాలి

- మొదటి పేజి తరువాయి

పాలకులు ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకుని ఉంటే నాటి పాలకులను బాధ్యులను చేసి శిక్ష వేయాలన్నారు. కాగితాలకే పరిమితమైన ఎస్సారెస్పీ ఆయకట్టులో రెండు పంటలు పండాయి. మేడిగడ్డ కూలిపోయింది, అన్నారం, సుందిళ్ల పనికిరావని సీఎం రేవంత్‌రెడ్డి అనడం సరికాదన్నారు. ఎన్డీఎస్ఏ పేరు చెప్పి తప్పించుకుంటున్న ముఖ్యమంత్రి ఇక్కడి రిటైర్డ్ ఇంజినీర్లు, సాగునీటి నిపుణుల సూచనలను ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. బ్యారేజీతో సంబంధం లేకుండా కన్నెపల్లి నుంచి నీళ్లు తీసుకోవచ్చని ఇంజినీర్లు సూచిస్తున్నా, ముఖ్యమంత్రి భేషజాలకు పోతూ తెలంగాణ రైతాంగం నోట్లో మట్టికొట్టే ప్రయత్నం చేస్తున్నారని మండిపారు. అనంతరం రిటైర్డ్ ఇంజనీర్లు దామోదర్ రెడ్డి, వెంకటేశం, శ్రీధర్ దేశ్ పాండే, వెంకట రామారావులు మాట్లాడుతూ... ప్రస్తుతం ఎల్‌నినో ప్రభావంతో కరువు పరిస్థితులు నెలకొన్నాయన్నారు. ప్రాజెక్టుల్లో నిల్వ ఉన్న నీళ్లు డెడ్ స్టోరేజీకి చేరాయన్నారు. రాబోయే రోజుల్లో తాగునీటికి, పరిశ్రమలకు నీళ్లు కావాలంటే ముఖ్యమంత్రి తాము చేసిన సూచనలే కాదు, కేంద్ర ప్రభుత్వ నిపుణుల సలహాలు తీసుకుని అయినా నీళ్లను ఎత్తిపోయాలన్నారు. రోజుకు 3 టీఎంసీలు ఎత్తిపోసుకునే వెసులుబాటు, అందుకు కావాల్సిన యంత్రాంగం అంతా సిద్ధంగా ఉందన్నారు. గోదావరిలో ప్రాణహిత వద్దనే నీటి లభ్యత ఉంటుందని సీడబ్ల్యూసీ కూడా పేర్కొన్నదని వారు గుర్తు చేశారు. మేడిగడ్డ నింపితే కూలిపోతుందని, భద్రాచలం మునిగిపోతుందని ముఖ్యమంత్రి భయపెట్టే ప్రకటనలు చేస్తున్నారని, ఆ వాదనలు తప్పన్నారు. ప్రస్తుతం వస్తున్న వరదల కంటే రెట్టింపు స్థాయిలో నీళ్లు వచ్చినా ఏమీ కాలేదని పేర్కొన్నారు. రేవంత్‌రెడ్డి రైతాంగాన్ని దృష్టిలో పెట్టుకుని నీళ్లను ఎత్తిపోయాలన్నారు. లేకపోతే కరెంటు సమస్యలు కూడా తలెత్తుతాయన్నారు. ఈ సమావేశంలో ఆర్థిక నిపుణులు పి. పాపారావు, బీజేపీ నేత వేణుగోపాల్ రెడ్డి, బీఆర్ఎస్ నేత చిరుమల్ల రాకేష్, సీనియర్ జర్నలిస్టులు గొర్ల బుచ్చన్న, ఎ. రమణ కుమార్, నర్రా విజయ్ తదితరులు పాల్గొన్నారు.

## షాబాద్ నరహంతకుడు రాజ్‌కుమార్ మృతి

- మొదటి పేజి తరువాయి

పాయిజన్ బాటిల్‌ను గుర్తించారు. నిందితుడు ఆత్మహత్య చేసుకున్నట్లు భావిస్తున్నారు. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను పోలీసులు వెల్లడించాల్సి ఉంది.ఓ బాలికను వేధించిన వ్యవహారంలో తనపై పోక్సో కేసు పెట్టారనే కక్షతో రాజ్‌కుమార్ శుక్రవారం అర్ధరాత్రి ఉన్మాదిగా మారి నరమేధం సృష్టించాడు. తొలుత బాలిక తల్లి, నానమ్మలను కత్తిపోట్లతో కడతేర్చాడు. తర్వాత నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లి బాలికను గొంతుకోసి చంపేశాడు. అనంతరం ఇంటికెళ్లి భార్య, నిద్రిస్తున్న కన్న బిడ్డల గొంతుకోసి కర్కశంగా హతమార్చాడు. మొత్తం అరగంట వ్యవధిలో మూడు ప్రాంతాల్లో ముగ్గురు మహిళలు, ఓ బాలిక, ఇద్దరు ముక్కుపచ్చలారని చిన్నారుల్ని కిరాతకంగా అంతమొందించాడు. పరారీలో ఉన్న నిందితుడి కోసం పోలీసులు 14 ప్రత్యేక బృందాలతో గాలింపు చేపట్టారు. హైదరాబాద్-బెంగళూరు హైవేల్లోని హోటళ్లు, లాడ్జీలు, దాబాల్లో విస్తృత తనిఖీలు చేపట్టారు. బస్టాండ్లు, రైల్వేస్టేషన్ల సీసీటీవీ ఫుటేజీలను పరిశీలించారు. నిందితుడి కుటుంబసభ్యులు, సన్నిహితులను ప్రశ్నించారు. ఈ క్రమంలో సోమవారం పెంజర్లలో రాజ్‌కుమార్ మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు.

జీవితంపై విరక్తి కలిగిందంటూ.. రాజ్‌కుమార్ సెల్ఫీ వీడియో..మృతికి ముందు రాజ్‌కుమార్ సెల్ఫీ వీడియో తీసుకున్నాడు. మృతదేహం పక్కన ఉన్న అతడి మొబైల్ ఫోన్‌లో ఈ వీడియోను గుర్తించినట్లు ఫ్యూచర్ సిటీ సీపీ తరుణ్ జోషి తెలిపారు. రాజ్‌కుమార్‌కు బెట్టింగ్ అలవాటు ఉందని.. దీనికోసం 16 సిమ్‌లు వినియోగించినట్లు చెప్పారు. ఆన్‌లైన్ బెట్టింగ్ కారణంగా అప్పుల బాధతో జీవితంపై విరక్తి కలిగిందని.. ఓ అమ్మాయిని నమ్మి చాలా మోసపోయానని సెల్ఫీ వీడియోలో రాజ్‌కుమార్ పేర్కొన్నాడు. 2.26 సెకన్ల నిడివి గల ఈ వీడియోను మీడియా ప్రతినిధులకు సీపీ చూపించారు. శుక్రవారం సాయంత్రం 4 గంటలకు వీడియో రికార్డు చేసినట్లు తెలిపారు.

## గెలిపించిన యువతే ఇప్పుడు రోడ్డెక్కింది.. నేపాల్ ప్రభుత్వంపై జెన్‌జీ ఆగ్రహం

నేపాల్‌లో 25 ఏళ్ల రైడ్‌షేరింగ్ డ్రైవర్ గణేశ్ మృతి దేశవ్యాప్తంగా నిరసనలకు దారితీసింది. గత వారం ఖాట్మండులో కస్టమర్ కోసం వేచి ఉన్న సమయంలో పోలీసులు అతని మోటార్‌సైకిల్‌కు వీల్ లాక్ వేశారు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన గణేశ్ ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకున్నాడు. వెంటనే ఆసుపత్రికి తరలించినప్పటికీ మరుసటి రోజు చికిత్స పొందుతూ మృతి చెందాడు.

ఈ ఘటనతో ఇప్పటికే ప్రభుత్వంపై ఉన్న అసంతృప్తి ఒక్కసారిగా బయటపడింది. కొన్ని నెలల క్రితమే యువత మద్దతుతో భారీ మెజారిటీ గెలుపొందిన బాలేంద్ర షా ప్రభుత్వంపై ఇప్పుడు అదే జెన్‌జీ తరం ఆగ్రహం వ్యక్తం చేస్తోంది. గత ప్రభుత్వంపై తిరుగుబాటు చేసి మార్పు కోసం నిలిచిన యువతే ఇప్పుడు అధికారంలోకి వచ్చిన ప్రభుత్వాన్ని జవాబుదారీతనం కోరుతూ వీధుల్లోకి దిగడం ప్రాధాన్యం సంతరించుకుంది.ఆదివారం వందలాది మంది సింగ్‌దర్బార్ సచివాలయం వద్ద ఆందోళన చేపట్టారు. 'పేదలపై దౌర్జన్యాలు ఆపండి', 'మానవ హక్కులను గౌరవించండి' వంటి నినాదాలతో ప్లకార్డులు ప్రదర్శించారు. అక్రమ అరెస్టులను నిలిపివేయాలని, నిర్వాసితులకు ఆశ్రయం కల్పించాలని, ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలను మార్చాలని డిమాండ్ చేశారు.మీడియా కథనాల ప్రకారం, బాలేంద్ర షా అధికారంలోకి వచ్చిన తర్వాత ఖాట్మండు మున్సిపల్ పోలీసులు మరింత దూకుడుగా వ్యవహరిస్తున్నారని విమర్శలు ఉన్నాయి. ముఖ్యంగా ఫుట్‌పాత్‌లపై ఆక్రమణలు, అనధికార వీధి వ్యాపారుల తొలగింపు, నదీతీర ప్రాంతాల్లోని నివాసాలను ఖాళీ చేయించే చర్యల్లో కఠిన వైఖరి అవలంబిస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. ఈ చర్యల సందర్భంగా అనేకసార్లు ఘర్షణలు చోటుచేసుకోవడంతో పేదల పట్ల ప్రభుత్వం సానుభూతితో వ్యవహరించడం లేదనే అభిప్రాయం బలపడింది.

ఖాట్మండు మెట్రోపాలిటన్ సిటీ మున్సిపల్ పోలీస్ చట్టం-2023 బాలేంద్ర షా హయాంలో అమల్లోకి వచ్చింది. దీని ప్రకారం మున్సిపల్ పోలీసుల బాధ్యతలు నగర ఆస్తుల రక్షణ, పారిశుద్ధ్య పర్యవేక్షణ, పార్కుల సంరక్షణ, స్థానిక ఉత్సవాల నిర్వహణకు సహకరించడం వరకే పరిమితమని నిపుణులు గుర్తు చేస్తున్నారు. లాఠీచార్జ్ చేయడం లేదా ప్రజలను అదుపులోకి తీసుకునే అధికారం వారికి లేదని పేర్కొంటున్నారు.

అయినప్పటికీ, బాలేంద్ర షా ప్రభుత్వంలో మున్సిపల్ పోలీసులు రోజువారీ కూలీలు, వీధి వ్యాపారులపై తరచూ బలవంతపు చర్యలకు పాల్పడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అలాంటి ఘటనలకు సంబంధించిన వీడియోలు గత కొంతకాలంగా సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఇప్పుడు గణేశ్ మృతి ఆ అసంతృప్తికి మరింత ఆజ్యం పోసి నేపాల్‌లో మరోసారి భారీ నిరసనలకు కారణమైంది.

## కేంద్ర-రాష్ట్ర సహకారంతోనే తెలంగాణ అభివృద్ధి

- మొదటి పేజి తరువాయి

120 టీఎంసీలకు కేంద్రం అనుమతులు వస్తే ప్రాజెక్టులు వేగంగా పూర్తి చేసుకోవచ్చని ఆశాభావం వ్యక్తం చేశారు. గోదావరి, కావేరి నదుల అనుసంధానంతో రాష్ట్రానికి ప్రయోజనం ఉంటుందన్నారు. కేంద్రం సహకరిస్తే సహకరించిందని నిరభ్యంతరంగా చెబుతామన్నారు. కేంద్ర ప్రభుత్వ సహకారాన్ని ఒప్పుకునేందుకు తమకు ఎలాంటి భేషజాలు లేవన్నారు. తుమ్మిడిహట్టి, పోర్ట్ కనెక్టివిటీ, బుల్లెట్ ట్రైన్, ఆదిలాబాద్, వరంగల్ ఎయిర్ పోర్ట్స్ కు సంబంధించిన అనుమతులు వీలైనంత త్వరగా పూర్తి చేసుకునేలా చూడాలన్నారు.

## హైడ్రాకు 12.50 కోట్ల నిధులు విడుదల చేసిన రాష్ట్ర ప్రభుత్వం

- మొదటి పేజి తరువాయి

హైడ్రా కమిషనర్‌కు ఆదేశాలు జారీ చేసింది. ఖర్చుల వివరాలు, యుటిలైజేషన్ సర్టిఫికెట్లు సమర్పించాలని ప్రభుత్వం స్పష్టం చేసింది. జీఓ నెం.679తో 12.50 కోట్లకు పరిపాలనా శాఖ నుంచి హైడ్రాకు అనుమతి లభించింది. మెట్రోపాలిటన్ ఏరియా అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్ ఈ జీవో జారీ చేశారు.

హైడ్రాను కేవలం ఒక ఏజెన్సీగా కాకుండా, తిరుగులేని ఎన్?ఫోర్స్?మెంట్ వ్యవస్థగా మార్చడమే లక్ష్యంగా ప్రభుత్వం అడుగులు వేస్తుంది. ఇందులో భాగంగా హైడ్రాకు ప్రత్యేక పోలీస్ స్టేషన్లు, చట్టపరమైన విచారణ జరిపే అధికారులు, సాంకేతిక నిపుణులతో కూడిన విభాగాన్ని కేటాయించబోతున్నారు. చెరువులు, నాలాలు, పార్కులు ఎక్కడ ఆక్రమణకు గురైనా ఇతర శాఖల ఉత్తర్వుల కోసం వేచి చూడాల్సిన అవసరం లేకుండా, చట్టబద్ధంగా హైడ్రానే నేరుగా చర్యలు తీసుకుంటుందని ఉన్నతాధికారి ఒకరు తెలిపారు.

## 'సింగరేణి భరోసా యాత్ర' ప్రారంభించిన తెలంగాణ బీజేపీ

- మొదటి పేజి తరువాయి

జిల్లాకు చేరుకున్న వారికి పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలికాయి.ఈ యాత్రలో భాగంగా నాలుగు జిల్లాల్లోని సింగరేణి గనుల కార్మికులను కలిసి, సంస్థ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం చేపట్టిన చర్యలను వివరించనున్నట్లు బీజేపీ నేతలు తెలిపారు. తాడిచెర్ల-2 బొగ్గు బ్లాక్ కేటాయింపు వల్ల సింగరేణి దీర్ఘకాలిక ఆర్థిక వృద్ధికి బలం చేకూరుతుందని, దీంతో కార్మికుల్లో విశ్వాసం పెరిగిందని రాంచందర్ రావు పేర్కొన్నారు.యాత్ర ప్రారంభానికి ముందు మాట్లాడిన రాంచందర్ రావు, గత బీఆర్ఎస్ ప్రభుత్వం, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం రెండూ సింగరేణిని నిర్లక్ష్యం చేశాయని ఆరోపించారు. ఈ కారణంగానే ప్రభుత్వ రంగ సంస్థ ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటోందని అన్నారు. మరోవైపు ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం మాత్రం సింగరేణిని బలోపేతం చేయడానికి కృషి చేస్తోందని పేర్కొన్నారు.కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మాట్లాడుతూ తాడిచెర్ల-2 బొగ్గు బ్లాక్‌ను సింగరేణికి కేటాయించడం చరిత్రాత్మక నిర్ణయమని అన్నారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం బొగ్గు బ్లాక్‌లు వేలం ద్వారా కేటాయించాల్సి ఉన్నప్పటికీ, చట్టపరమైన అవకాశాలను పరిశీలించి, న్యాయ సలహా తీసుకున్న అనంతరం మోదీ ప్రత్యేకంగా ఈ బ్లాక్‌ను సింగరేణికి కేటాయించే నిర్ణయం తీసుకున్నారని తెలిపారు. ట్రేడ్ యూనియన్ల విజ్ఞప్తి మేరకు తాను ప్రధానితో చర్చించి ఈ కేటాయింపును సాధించామని చెప్పారు.

## పోలవరం, బనకచర్లపై పిటిషన్.. తెలంగాణకు సుప్రీంకోర్టులో ఎదురుదెబ్బ

- మొదటి పేజి తరువాయి

మొత్తం 15 మంది ప్రతివాదులు ఉన్నారని, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేపడుతున్న పనులపై తక్షణమే స్టే విధిస్తూ నోటీసులు జారీ చేయాలని కోర్టును తెలంగాణ తరపు న్యాయవాది కోరారు. అయితే, తెలంగాణ దాఖలు చేసిన పిటిషన్‌లో తీవ్ర సాంకేతిక లోపాలు ఉన్నాయని ధర్మాసనం గుర్తించింది. వాటిని సరిచేసే వరకు విచారణ చేపట్టలేమని స్పష్టం చేసింది. ప్రాథమిక లోపాలు సరిదిద్దకముందే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి నోటీసులు జారీ చేయడం గానీ, మధ్యంతర ఉత్తర్వులు (ఇంజెక్షన్/స్టే) ఇవ్వడం గానీ సాధ్యం కాదని సుప్రీంకోర్టు తేల్చిచెప్పింది. ముందుగా పిటిషన్‌లోని లోపాలను సవరించాలని తెలంగాణ ప్రభుత్వానికి సూచించింది. ఆ తర్వాతే మిగిలిన అంశాలపై విచారణ చేపడతామని పేర్కొంది. అనంతరం కేసు విచారణను వాయిదా వేసింది.

పెన్ పవర్
తెలంగాణ రౌండప్





# 'రుద్ర' కన్‌స్ట్రక్షన్‌కు..! 'గోపాలుడి' అనుగ్రహం..!

## నాడు అదే దందా..! నేడు అదే దందా..! మారింది కండువా మాత్రమే..?

- అనుచరునితో 'సెటిల్మెంట్'లు షురూ..! 'రుద్ర' కన్‌స్ట్రక్షన్‌లో యధావిధిగా పనులు..!
- దౌర్భాగ్యం ఏమిటంటే..! ఇక్కడ కూడా ఆ ఇద్దరు కరప్షన్ అధికారులే విధుల్లో..?
- షోకాజ్ నోటీసు జారీచేసి నెల.. తదుపరి చర్యలు ముడుపులతో స్తంభించాయా..?
- ఎస్ఐఆర్ విధుల్లో అధికారులు సరే..! అక్రమ కట్టడాల పర్యవేక్షణ ఎవరిది..?

- బాచుపల్లిలో హెచ్ఎండిఏ పర్మిషన్‌తో 'రుద్ర' అక్రమ నిర్మాణం..
- చేతకాని అధికార యంత్రాంగం..! సిఫార్సుల సత్తా చాటుతున్న రాజకీయం..!
- 'రుద్ర' కన్‌స్ట్రక్షన్‌కి..! 'రూల్స్' వర్తించవట..? లేకపోతే ముడుపులు దక్కవు కదా..!
- నెలనెలా రూ.లక్షలు జీతాలు తీసుకుంటూనే దిగజారిన విధులు..
- పేరుకే 'హెచ్ఎండిఏ' పర్మిషన్..! నిబంధనలు ఉల్లంఘించి ఇష్టారాజ్యం..!


Project Title :PLAN SHOWING PROPOSED RESIDENTIAL BU
CORPORATION, MEDCHAL-MALKAJGIRI DIST.BELONGING

6 మీ.
6 మీ.
6 మీ.
10.72 మీ.

SITE PLAN
(Scale - 1:100)

రుద్ర కన్‌స్ట్రక్షన్‌కి సంబంధించిన స్కెచ్ ప్లాన్..

- ఇక్కడ పర్మిషన్‌తో పనిలేదు..! ఇష్టం వచ్చినట్లు కట్టుకో..! అడిగింది ఇచ్చుకో..?
- హెచ్ఎండిఏ పర్మిషన్‌తో.. బెత్తెడు కూడా గ్యాపు లేకుండా నిర్మాణం ఏంటి..?
- చుట్టూ ఫైర్ ఇంజన్‌లు తిరగాల్సిన చోట చీమలకు కూడా అవకాశం లేదంటే అర్థం.?
- అనుమతులు ఒకలా..! నిర్మాణం మరోలా..! రుద్ర కన్‌స్ట్రక్షన్ బరితెగింపు..!
- నిజాంపేట్ సర్కిల్ పరిధిలో.. 200 ఫీట్ల రహదారిపై, రెసిడెన్షియల్ అనుమతులు..
- ఫుట్ పాత్ ఆక్రమణ..! అక్రమ నిర్మాణం ఆరోపణలపై స్పందించని టౌన్‌ప్లానింగ్..
- నిర్మాణం చుట్టూ 6 మీటర్‌లు(19.82 అడుగులు) సెట్‌బ్యాకులు ఉండాలి..
- ముందుకు 10.72 మీటర్లు(35 ఫీట్లు) పర్మిషన్‌లో స్పష్టంగా ఉంది..
- అనుమతులు ఇచ్చినోళ్ళ పర్యవేక్షణ లేదు.. లోకల్‌బాడీకి పారదర్శకత లేదు ..?
- నిబంధనలు ఉల్లంఘించినా..! అక్రమ కట్టడాల నియంత్రణ శూన్యం..
- పర్యవేక్షణ కోసం నియమించిన వార్డు ఆఫీసర్‌కి 'ఎస్ఐఆర్' డ్యూటీ..!




రుద్ర కన్‌స్ట్రక్షన్‌లో నోటీసు ఇచ్చినా, నిరాటంకంగా పనులు..

-4లో

01
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
క్లాసీఫైడ్ యాడ్స్
కేవలం
యాడ్ 100/-కే
' ఐదు రోజులకు '
'4 సెం.మీ 4 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

# దుండిగల్‌లో 'భూ సమీకరణ'పై గ్రామసభ..

- తహశీల్దార్‌తో కలిసి ఆర్డీవో శ్యామ్ ప్రకాశ్ సమావేశం..
- అసైనీ రైతులకు ఎకరానికి 600 గజాలు ప్రభుత్వ ప్రతిపాదన..
- 1200 గజాలు ఇవ్వాలని రైతుల డిమాండ్..!
- దుండిగల్ సర్వే నెంబర్లు 453, 454పై గ్రామసభ నిర్వహణ..
- భూ సమీకరణ ప్రతిపాదనపై రైతులతో అధికారుల సుదీర్ఘ చర్చ..
- తుది నిర్ణయం ఇంకా ఖరారు కాలేదని అధికారులు స్పష్టత..
- సంప్రదింపుల ప్రక్రియ కొనసాగుతోందని వెల్లడి..


దుండిగల్ భూ సమీకరణ సమావేశంలో ఆర్డీవో శ్యామ్ ప్రకాశ్..

**దుండిగల్, పెన్ పవర్, జూలై 13:** దుండిగల్ పరిధిలోని సర్వే నెంబర్లు 453, 454లో చేపట్టనున్న భూ సమీకరణ (ల్యాండ్ పూలింగ్) ప్రక్రియకు సంబంధించి సోమవారం గ్రామసభ నిర్వహించారు.. సమావేశంలో దుండిగల్ తహశీల్దార్ రాజేశ్వర్ రెడ్డితో కలిసి మల్కాజిగిరి ఆర్డీవో శ్యామ్ ప్రకాశ్, ప్రజాప్రతినిధులు, అసైనీ రైతులు, భూ యజమానులు పాల్గొని భూ సమీకరణ ప్రతిపాదనపై విస్తృతంగా చర్చించారు.. ప్రభుత్వం తరపున భూ సమీకరణలో భాగంగా అసైనీ రైతులకు ఎకరానికి 600 చదరపు గజాల అభివృద్ధి చేసిన ప్లాటు కేటాయించే ప్రతిపాదనను అధికారులు వివరించారు.. అయితే రైతులు ఈ ప్రతిపాదనపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ, ఎకరానికి 1200 చదరపు గజాల ప్లాటు కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరారు.. ఈ భూ సమీకరణ వల్ల కలిగే ప్రయోజనాలు, భవిష్యత్తులో మౌలిక వసతుల అభివృద్ధి, రైతులకు లభించే హక్కులు, పరిహారం తదితర అంశాలపై అధికారులు సమావేశంలో వివరంగా తెలియజేశారు.. రైతులు తమ అభిప్రాయాలు, సూచనలు, అభ్యంతరాలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.. రైతుల డిమాండ్లను ప్రభుత్వం పరిశీలిస్తున్నందున ప్రస్తుతం ఎలాంటి తుది నిర్ణయం తీసుకోలేదని అధికారులు తెలిపారు.. ఇరు వర్గాల మధ్య మరిన్ని సంప్రదింపుల అనంతరం భూ సమీకరణకు సంబంధించిన తుది నిర్ణయం ప్రకటించే అవకాశం ఉందని తెలుస్తోంది.



# భూ ఆక్రమణదారులకు అధికారుల అండదండలా?

- న్యాయస్థానాలు కళ్లు మూసుకుని ప్రేక్షకపాత్ర పోషించవు
- కబ్జాలపై సీబీసీఐడీతో దర్యాప్తు చేయించండి
- ఇంజాపూర్‌లో 74 ఎకరాల ప్రభుత్వ భూములపై హైకోర్టు సంచలన తీర్పు

**హైదరాబాద్ పెన్ పవర్:** రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం ఇంజాపూర్‌లో సర్వే నంబరు 126లోని 74.16 ఎకరాల ప్రభుత్వ భూముల ఆక్రమణకు అధికారులు అండగా ఉన్నారంటూ హైకోర్టు తీవ్ర ఆందోళన వ్యక్తంచేసింది. ప్రభుత్వ ఆస్తులను రక్షించాల్సిన వారే ఆక్రమణదారులకు రక్షణగా నిలిచారని తప్పుబట్టింది. న్యాయస్థానాలను చీకట్లో ఉంచి, ఖజానాను పణంగా పెట్టి ఆక్రమణలకు సహకరిస్తుంటే కోర్టు కళ్లు

-4లో

# 'రుద్ర' కన్‌స్ట్రక్షన్‌కు..! 'గోపాలుడి' అనుగ్రహం..!




రుద్ర కన్‌స్ట్రక్షన్ అక్రమ నిర్మాణంలో సెట్‌బ్యాకులు తోపాటు వెనుకవైపు రోడ్డు ఆక్రమణ..



రుద్ర అక్రమ కట్టడంలో 'జీరో' సెట్‌బ్యాకులు.. స్పష్టంగా..










**ప్రస్తుతం 'సిఎంసి' టౌన్‌ప్లానింగ్ వ్యవస్థను నడిపించడానికి వార్డు ఆఫీసర్‌లు-చైన్‌మెన్‌లు సరిపోతారేమో అనిపిస్తుంది..? ఎందుకంటే పట్టణ ప్రణాళికా అధికారులపై వస్తున్న విమర్శలు అలా ఉన్నాయి.. కుప్పలు తెప్పలుగా అక్రమ నిర్మాణాలు వెలుస్తుంటే..! చేతకాని యంత్రాంగం అనాలో..! లేక చేతివాటానికి అలవాటు పడ్డారని చెప్పాలో తెలియదు కానీ..! అక్రమార్కులను ప్రోత్సహించేందుకే అయితే..! ఈ టౌన్‌ప్లానింగ్ వ్యవస్థ ఎందుకు..? అందులో అధికారులు ఎందుకు..? అన్న ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి.. ఈ పట్టణ ప్రణాళికలో "చీఫ్ సిటీ ప్లానర్ (సీసీపీ)-సిటీ ప్లానర్ (సీపి)-డిప్యూటి సిటీ ప్లానర్ (డీసీపీ)- అసిస్టెంట్ సిటీ ప్లానర్ (ఏసీపి)- టౌన్‌ప్లానింగ్ సూపర్‌వైజర్ (టిపిఎస్).. ఇంతమంది యంత్రాంగం ఉన్న ఈ విభాగంలో..! చర్యల ప్రస్తావనే లేనప్పుడు, ఈ అధికారులు అవసరమా..? అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.. ఈ అధికారులు కేవలం ముడుపుల కోసమేనని ఇలాంటి వందలాది అక్రమ నిర్మాణాలతో నిరూపితం అవుతున్నాయి..! కుర్చీలకు వన్నె తెచ్చేందుకా వీరి విధులు..? లేక టౌన్‌ప్లానింగ్ విభాగానికి అలంకార ప్రాయమా..? ప్రజల సొమ్మును వేతనంగా పొందుతున్నది సరిపోవడం లేదని..! అక్రమ నిర్మాణాల దందాకు సహకరించే, తప్పుడు అధికార వ్యవస్థ అంటూ, తీవ్ర విమర్శలు వినవస్తున్నాయి.. పలువురు ఫిర్యాదు చేసినప్పటికీ, ఉన్నతాధికారులు 'ఉలుకూలేదు పలుకూ లేద'ని పలువురు వ్యంగ్య వ్యాఖ్యలు చేస్తున్నారు..**

**సిఎంసి బ్యూరో (పెన్ పవర్) జూలై 13:**

## లి'రుద్ర' కన్‌స్ట్రక్షన్‌కి..! నిబంధనలు వర్తించవా..?

హెచ్ఎండిఏ నిబంధనలు కొందరికేనా..! బడా నిర్మాణ సంస్థలకు రూల్స్ వర్తించవా..? అన్న ప్రశ్నలకు అవుననే సంకేతాలు వస్తున్నాయి.. నిజాంపేట్ సర్కిల్-58 సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి బాచుపల్లిలో 200 ఫీట్ల రహదారి పక్కన నిర్మిస్తున్న 'రుద్ర' కన్‌స్ట్రక్షన్ అక్రమ నిర్మాణం,తీవ్రంగా ఆరోపణలు ఎదుర్కొంటోంది.. హెచ్ఎండిఏ నుండి రెసిడెన్షియల్ బిల్డింగ్ కోసం, బాచుపల్లి సర్వే నెం.135/పార్ట్, 136లో.. ప్లాట్ నెంబర్: 34, 35, 71 అండ్ 72 కు సంబంధించిన స్థలం 1066.80 చదరపు మీటర్ల(1274 గజాలు) స్థలానికి "రుద్ర కన్‌స్ట్రక్షన్ సంస్థ" అనుమతులు పొందింది.. డబుల్ సెల్లార్ం 1 గ్రౌండ్ ం 5 అప్పర్ ఫ్లోర్స్‌కు హెచ్ఎండిఏ నుండి పర్మిషన్ తీసుకున్నారు.. నిర్మాణం మాత్రం అనుమతులకు విరుద్ధంగా, నిబంధనలు ఉల్లంఘించి చేపట్టడం గమనార్హం.. ఈ విషయాన్ని నిజాంపేట్ సర్కిల్-58 సిఎంసి టౌన్‌ప్లానింగ్ అప్పటి ఏసిపితో ప్రస్తావిస్తూ..! పెన్ పవర్ దినపత్రికలో వార్తా కథనాన్ని ప్రచురించగా, గత నెల షోకాజ్ నోటీసు జారీచేసి చేతులు దులుపుకున్నారు..

- 3 పేజి తరువాయి

పేరుకే హెచ్ఎండిఏ అనుమతులు.. నిర్మాణాలు మాత్రం నిబంధనలు ఉల్లంఘించి ప్రమాదకరగా నిర్మిస్తున్నారు.. ఒకరు పలుకుబడితో, మరొకరు డబ్బుతో ప్రలోభ పెట్టో, ఇంకొకరు భయపెట్టో, ఏదోరకంగా, చివరికి అక్రమ నిర్మాణాలు సక్రమం అవుతున్నాయి.. కాదు కాదు అక్రమ కట్టడాలు అట్లనే ఉంటున్నాయి.. అధికారుల సిగ్గుమాలిన విధులకు ఈ నిర్మణాలు సాక్ష్యాధారాలుగా నిలుస్తున్నాయి.. 'హెచ్ఎండిఏ-మున్సిపల్' అధికార యంత్రాంగం ప్రశ్నించిన వారికి 'పిట్టకథలు" వినిపించడం కూడా కొత్తేమికాదు..! నిజాంపేట్ సర్కిల్-58 సిఎంసి పరిధి బాచుపల్లిలో 200 అడుగుల వెడల్పుగల హైవేకు

## "సెట్‌బ్యాకులు- రహదారి" ఆక్రమణ..!

బాచుపల్లిలోని 'రుద్రా కన్‌స్ట్రక్షన్ అనుమతులు ఒకలా..! నిర్మాణం మరోలా చేపడుతున్నారు.. రహదారి, ఫుట్‌పాత్ ఆక్రమణ ఆరోపణలపై అధికారుల మౌనం అనేక ప్రశ్నలు లేవనెత్తుతోంది.. సంబంధిత కన్‌స్ట్రక్షన్‌కు సంబంధించి, హెచ్ఎండిఏలో సమర్పించిన స్కెచ్ ప్లాన్ ప్రకారం, నిర్మాణం చుట్టూ (మూడు వైపులా) సెట్‌బ్యాకులు 6 మీటర్లు (19.82 అడుగులు) ఉండాలి.. ముందువైపున ప్లాన్ ప్రకారం 10.72 మీటర్లు (35 ఫీట్లు) వదిలేయాలని అధికారికంగా, పర్మిషన్ స్కెచ్ ప్లాన్‌లో స్పష్టంగా పొందుపరిచారు.. అయినప్పటికీ నిబంధనలు ఉల్లంఘించిన, బడా నిర్మాణ సంస్థ 'రుద్ర' కన్‌స్ట్రక్షన్ బిల్డర్, హెచ్ఎండిఏ నిబంధనలు తుంగలోతొక్కారు.. ప్రమాదాల నుంచి తప్పించుకునే వీలుగా సూచించిన, 6 మీటర్ల సెట్‌బ్యాకుల నిబంధనలు సైతం అతిక్రమించారు.. ఈ వ్యవహార నిజాంపేట్ సర్కిల్-58 సిఎంసి టౌన్‌ప్లానింగ్ అధికారులకు తెలియకుండా సాధ్యమేనా అనే ప్రశ్నలు కూడా ఉత్పన్నం అవుతున్నాయి..

'రుద్ర' కన్‌స్ట్రక్షన్ కంపెనీకి 1066.82 మీటర్ల స్థలానికి రెసిడెన్షియల్ పర్మిషన్ మంజూరు చేయడం ఒకవంతైతే..! 100 శాతం నిబంధనలు ఉల్లంఘించిన ఈ "రుద్ర" కన్‌స్ట్రక్షన్ వ్యవహారంలో టౌన్‌ప్లానింగ్ అధికారులు 'షోకాజ్ నోటీసు'తో సరిపెట్టారు.. దాదాపు నెలరోజులు దాటినా, తదుపరి చర్యలు లేకపోవడం గమనార్హం..! ఈ విషయంలో అవినీతి అధికారులు, అక్రమ నిర్మాణ దారునికి సరెండర్ అయినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి..

## 'రుద్ర' కన్‌స్ట్రక్షన్‌కి..'గోపాలుడి' అనుగ్రహం.?

ఇదిలా ఉండగా రుద్ర కన్‌స్ట్రక్షన్ పనులు నిరాటంకంగా కొనసాగటానికి, ఓ అధికారపార్టీ నాయకుని అనుచరుడు సెటిల్మెంట్‌ల వ్యవహారం ప్రారంభించాడట.. నిజాంపేట్ కార్పోరేషన్‌లో అక్రమ నిర్మాణాలకు అండగా నిలిచిన అప్పటి బీఆర్ఎస్ నాయకుడు, తమ ముఖ్య అనుచరునితో హవా కొనసాగించినట్లు వినికిడి.. ప్రస్తుతం అదే నాయకుడు కాంగ్రెస్ కండువా కప్పుకుని, మళ్ళీ అదే దందా ప్రారంభిచినట్లు ఆరోపణలు వస్తున్నాయి.. తన ముఖ్య అనుచరునితో, నిబంధనలు ఉల్లంఘించిన ఈ 'రుద్ర' కన్‌స్ట్రక్షన్‌కి అండగా నిలిచి పనులు ప్రారంభించారట.. షోకాజ్ నోటీసు జారీ చేసినప్పటికీ..! తదుపరి చర్యలకు ముందుకు సాగని టౌన్‌ప్లానింగ్..! చట్టాన్ని ధిక్కరించి పనులు యధావిధిగా కొనసాగటం ఏమంటారో సిఎంసి కమిషనర్, జోనల్ కమిషనర్ తేల్చాలి.. నిబంధనలు ఉల్లంఘించిన అక్రమార్కులు.. నిర్మాణ చట్టాలను అమలు చేయలేని నిస్సహాయ స్థితిలో టౌన్‌ప్లానింగ్ అధికారులు.. ఉన్నంతవరకు ప్రమాదకర అక్రమ కట్టడాల నియంత్రణ ఉండదేమోనని అనిపిస్తుంది.. నిజానికి సస్పెండ్ చేయాల్సిన అవినీతి అధికారులను కూడా విధుల్లో కొనసాగటం మన దౌర్భాగ్యం అంటూ పలువురు అసహనం వ్యక్తం చేస్తున్నారు..

## పలుమార్లు ఫిర్యాదు చేసినా చర్యల్లేవు: ఆకుల సతీష్..

రుద్ర కన్‌స్ట్రక్షన్ నిబంధనలు ఉల్లంఘించారని, పలుమార్లు నిజాంపేట్ సర్కిల్-58 సిఎంసి టౌన్‌ప్లానింగ్ అధికారులకు ఫిర్యాదు చేశామని, ఆకుల సతీష్ ఆరోపించారు.. షోకాజ్ నోటీసుతో సరిపెట్టి తదుపరి చర్యలు తీసుకోలేదని ఆకుల సతీష్ ఆరోపించారు.. అందుకే సోమవారం మరోసారి ఫిర్యాదు చేసినట్టు తెలిపారు.. నిబంధనల ఉల్లంఘన వ్యవహారం ప్రారంభం నుండే తెలిసినప్పటికీ.. 2 సెల్లార్‌లు ం 1 గ్రౌండ్ ం 5 పై అంతస్తులకు, 3 ఫ్లోర్‌లు నిర్మించే వరకు పట్టించుకోకుండా, పత్రికలో వార్త వచ్చినాక, ఇప్పుడు నోటీసులు జారీచేశామని, చెప్పడం విడ్డూరంగా ఉందని సతీష్ తెలిపారు.. 00507/ద్వీ/ఎవీణా/1955/వీజుణ/2022 దరఖాస్తు నంబరుతో రుద్రా కన్‌స్ట్రక్షన్‌కు 1066.80 చదరపు మీటర్ల విస్తీర్ణంలో రెసిడెన్షియల్ భవన నిర్మాణానికి అనుమతి మంజూరైంది.. ఫిర్యాదులో గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ చట్టం, 1955లోని పలు సెక్షన్లను ప్రస్తావిస్తూ.. సెక్షన్ 428 ప్రకారం అనుమతులకు విరుద్ధంగా నిర్మాణాలు చేపట్టడం.. సెక్షన్ 433 అక్రమ నిర్మాణాల మార్పు లేదా కూల్చివేతలు.. సెక్షన్ 452 రోడ్లు, వీధులు, ఫుట్‌పాత్‌ల ఆక్రమణ తొలగింపు.. సెక్షన్ 461 మున్సిపల్ నిబంధనల ఉల్లంఘనపై శిక్షలు వంటి నిబంధనలను ఉల్లంఘించారని ఫిర్యాదులో ఆరోపించారు.. మున్సిపల్, హెచ్ఎండిఏ అధికారులు క్షేత్రస్థాయిలో సమగ్ర విచారణ నిర్వహించి చర్యలు చేపట్టాలని సతీష్ డిమాండ్ చేశారు.

# భూ ఆక్రమణదారులకు అధికారుల అండదండలా?

- 3 పేజి తరువాయి

మూసుకుని ప్రేక్షకపాత్ర పోషించబోదని, చట్టపరమైన పాలన అమలయ్యేలా అధికరణం 226 కింద విచక్షణాధికారాన్ని ఉపయోగిస్తామని స్పష్టంచేసింది. ఇంజాపూర్‌లో భూముల ఆక్రమణపై సీబీసీఐడీతో దర్యాప్తు చేయించాలంటూ డీజీపీని ఆదేశించింది. మూడు నెలల్లో సమగ్ర నివేదిక సమర్పించాలంది. ప్రభుత్వ భూముల పరిరక్షణలో విఫలమై, ఆక్రమణదారులకు సహకరించిన అప్పటి తహసీల్దార్, గ్రామ పాలనాధికారులపై తగిన చర్యలు తీసుకుని, నివేదిక సమర్పించాలంటూ రెవెన్యూ శాఖ ముఖ్యకార్యదర్శిని సైతం ఆదేశించింది. ఇంజాపూర్‌లో ప్రభుత్వ భూముల ఆక్రమణలు, రికార్డుల మార్పిడి, అక్రమ లేఔట్‌లు, అధికార దుర్వినియోగం, రాజకీయ నేతల పాత్రపై దర్యాప్తు చేయించాలని కోరుతూ అధికారులకు 2025 డిసెంబరులో వినతిపత్రం ఇచ్చారు. అయితే, చర్యలేమీ తీసుకోకపోవడాన్ని సవాలు చేస్తూ సరూర్‌నగర్‌కు చెందిన న్యాయవాది సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఈ ఏడాది జనవరిలో హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై జస్టిస్ నగేశ్ భీమపాక విచారణ చేపట్టి సోమవారం తీర్పు వెలువరించారు.

**పరిస్థితిని వివరిస్తే సరిపోదు...**

పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది ఎ.సంతోష్‌కుమార్ వాదనలు వినిపిస్తూ... "పదుల ఎకరాల ప్రభుత్వ భూమి కబ్జాకు గురైంది. ఇందులో అధికారులు, నేతల జోక్యముంది. స్వతంత్ర లేదంటే సీబీఐతో దర్యాప్తు జరిపించాలి" అని కోరారు. ఈ కేసులో పలు వాయిదాల అనంతరం రెవెన్యూ శాఖ కార్యదర్శి హాజరుకు ఆదేశాలివ్వగా... కలెక్టర్ కౌంటర్ దాఖలు చేయడాన్ని న్యాయమూర్తి ప్రస్తావించారు. "కలెక్టర్ కౌంటరు ప్రకారం సర్వే నంబరు-126లోని 74.16 ఎకరాలు సర్కారు భూమిగా, గ్రామపటం ప్రకారం జిలావర్‌ఖాన్ చెరువుగా ఉన్నట్లు స్పష్టమవుతోంది. 1.1 ఎకరాల కాలువ మినహా మిగిలినదంతా ఆక్రమణకు గురైనట్లు తేలింది. ఇందులో 1.13 ఎకరాల్లో యాపిల్ ఎవెన్యూ అపార్ట్‌మెంట్, 7.25 ఎకరాల్లో వ్యవసాయం, హుడా అధీనంలో 22 ఎకరాలు, ఒక సబ్‌స్టేషన్, ఇందిరమ్మ ఇళ్లు, శ్మశానాలు, దేవాలయాలు, రోడ్లు ఇలా రకరకాల నిర్మాణాలు ఉన్నాయి. వీటికి భూములను చట్టప్రకారం ఎవరు కేటాయించారన్న వివరాలేవీ లేవు. ఆక్రమణలు ఎలా జరిగాయి... ఎవరు బాధ్యులు తదితర వివరాలను పక్కదారి పట్టించేలా కలెక్టర్ కౌంటర్ దాఖలు చేశారు. ప్రభుత్వ భూమిని రక్షించాల్సిన కలెక్టర్ కబ్జాలపై చెప్పకుండా ప్రస్తుత పరిస్థితిని వివరిస్తే చాలదు. పైగా పిటిషనర్‌పైనే ఆరోపణలు చేశారు. అధికారుల మౌనం యాదృచ్ఛికం కాదు. ఆక్రమణల కొనసాగింపునకు ఉద్దేశపూర్వకంగా సహకరించినట్లు స్పష్టమవుతోంది. ఇలాంటి దుశ్చర్యలను ఆదిలోనే అరికట్టి, కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరముంది. అందువల్ల ఈ కోర్టు విచక్షణాధికారంతో చట్టపరమైన పాలన నిమిత్తం తగిన ఆదేశాలు జారీ చేస్తోంది. 74.16 ఎకరాల ప్రభుత్వ భూముల ఆక్రమణలపై సీబీసీఐడీతో దర్యాప్తు చేయించాలి. దీన్ని మూడు నెలల్లో పూర్తి చేయాలి" అంటూ డీజీపీకి ఆదేశాలు జారీ చేశారు.

# జిల్లా ప్రగతి, వివిధ అభివృద్ధి కార్యక్రమాల అమలుపై కలెక్టర్ సమీక్ష

**హైదరాబాద్ పెన్ పవర్:** జిల్లా అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో జిల్లా ప్రగతి, వివిధ అభివృద్ధి కార్యక్రమాల అమలుపై కలెక్టర్ సమగ్రంగా సమీక్ష నిర్వహించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.జిల్లాలోని రెసిడెన్షియల్ పాఠశాలలు, సంక్షేమ హాస్టళ్లలో డెంగ్యూ, మలేరియా తదితర సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పాఠశాలలు, హాస్టళ్ల పరిసరాల్లో పిచ్చిమొక్కలు, చెత్తాచెదారం లేకుండా పరిశుభ్రతను కచ్చితంగా పాటించాలని, వారానికి కనీసం ఒకసారి ఫాగింగ్ నిర్వహించాలని సూచించారు. శానిటేషన్ డ్రైవ్‌ను మరింత సమర్థవంతంగా అమలు చేయడంతో పాటు, స్పెషల్ ఆఫీసర్లకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. విద్యార్థులకు హాస్టళ్లు, పాఠశాలల్లో నాణ్యమైన భోజనాన్ని అందించాలని, విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించని సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు.

వనమహోత్సవం కార్యక్రమంలో నిర్దేశించిన లక్ష్యాలను ప్రతి శాఖ తప్పనిసరిగా పూర్తి చేసేలా కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని సూచించారు. గతంలో ఉద్యోగులతో కలిసి మొక్కలు నాటిన కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించినట్లు పేర్కొంటూ, ఈ ఏడాది కూడా ప్రతి ఉద్యోగి ఒక మొక్కను నాటేలా ప్రత్యేక ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు. అలాగే విద్యాశాఖ ఆధ్వర్యంలో ప్రతి పాఠశాలలో కిచెన్ గార్డెన్లు ఏర్పాటు చేసి విద్యార్థుల్లో ప్రకృతి, పోషకాహారంపై అవగాహన పెంపొందించాలని సూచించారు.



అర్హులైన ప్రతి విద్యార్థికి ప్రీ-మెట్రిక్ స్కాలర్‌షిప్ అందేలా ప్రత్యేక నమోదు కార్యక్రమం స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని ఆదేశించారు. విద్యార్థులకు యూనిఫాంలు సకాలంలో అందేలా సంబంధిత శాఖల అధికారులు అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు.

ఈ సమావేశంలో అడిషనల్ కలెక్టర్ రెవెన్యూ లక్ష్మీకిరణ్, జిల్లా రెవెన్యూ అధికారి నాగరాజమ్మ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ భవ్యతో పాటు వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు


02

ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో

శుభాకాంక్షలు యాడ్స్

కేవలం

యాడ్ 300/-

'పోస్టుకార్డు సైజు '

'పో. 12 సెం.మీ, వె.16 సెం.మీ'

'మరిన్ని వివరాలకు సంప్రదించండి '

93948 55244

షరతులు వర్తిస్తాయి


## బద్దిపల్లిలో ఓటర్ నమోదు కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకుల

**హైదరాబాద్ పెన్ పవర్:** బద్దిపల్లి గ్రామ పంచాయతీలో సోమవారం నిర్వహించిన ఓటర్ నమోదు కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు సింగిరాల వెంకటస్వామి, బీఎల్ఏ మునిగల శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఓటరు జాబితాలో పేర్లు నమోదు చేసుకోవడం, వివరాలను సరిచూసుకోవడం యొక్క ప్రాముఖ్యతపై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రతి అర్హుడూ తప్పనిసరిగా ఓటరుగా నమోదు చేసుకుని ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగస్వాములు కావాలని వారు పిలుపునిచ్చారు.

## SIR ఎన్యుమరేషన్ లో పాల్గొన్న ఎంపీ వద్దిరాజు

**- కుటుంబ సభ్యుల వివరాలు అందజేత**

**ఖమ్మం, జూలై, 13: పెన్ పవర్:** ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో భాగంగా దీూలు ఇంటింటికి తిరిగి అందజేసిన ఎన్యుమరేషన్ ఫారాలను తిరిగి వారికి అప్పగించి, రసీదు పొందాలని బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ నేత, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర సూచించారు. సోమవారం ఖమ్మం బుర్హాన్ పురంలోని తన క్యాంపు కార్యాలయంలో వద్దిరాజు తమ కుటుంబ సభ్యుల SIR ఎన్యూమరేషన్ ఫారాలను స్వయంగా నింపి సంబంధిత దీూ మాగి సావిత్రి కి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన ఎన్యూమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ గురించి బీఎల్ఓ అడిగి తెలుసుకున్నారు. డూప్లికేట్ ఓట్లు, అడ్రస్ దొరకని ఓటర్ల గురించి ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారని తెలుసుకున్నారు. ప్రతి ఓటరు ఎస్ఐఆర్ ను సద్వినియోగం చేసుకుని, తమ వివరాలతో పాటు, కుటుంబ సభ్యుల వివరాలు అందజేయాలని ఎంపీ రవిచంద్ర కోరారు. ఎన్యూమరేషన్ ఫారాలు నింపడంలో లేదా వివరాల నమోదులో ఎవరికైనా ఇబ్బందులు ఎదురైతే, స్థానిక దీూ నాయకులు, బూత్ లెవల్ ఏజెంట్ లు అందుబాటులో ఉండి సహకారం అందిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ శీలంశెట్టి వీరభద్రం తదితరులు పాల్గొన్నారు.

## హైదర్ బస్తీలో విద్యార్థులకు నోట్ బుక్స్ పంపిణీ పాల్గొన్న ఎమ్మెల్యే తలసాని

**హైదరాబాద్ పెన్ పవర్:** బంగారు భవిష్యత్తు కు విద్య ఎంతో ప్రధానమైందని మాజీమంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. సోమవారం రాంగోపాల్ పేట డివిజన్ హైదర్ బస్తీలో గల హిందీ మహా విద్యాలయం లో తెలంగాణ పేపర్ మర్చంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 160 మంది విద్యార్థులకు నోట్ బుక్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంచి విద్యా బోధన జరగాలంటే అన్ని సౌకర్యాలు కల్పించాల్సిన అవసరం ఉందని అన్నారు. పేద విద్యార్థులకు నోట్ బుక్స్ పంపిణీ చేసే గొప్ప కార్యక్రమం చేపట్టిన తెలంగాణ పేపర్ మర్చంట్స్ అసోసియేషన్ సభ్యులను అభినందించారు. విద్యార్థులు మంచిగా చదువుకోవాలని, ఏ సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకొస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని ప్రకటించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ లు అత్తిలి మల్లిఖార్జున్ గౌడ్, అత్తిలి అరుణ గౌడ్, అసోసియేషన్ ప్రతినిధులు అభిషేక్ విజయ్, శ్రీనాథ్, మాశెట్టి శ్రీనివాస్, విజయ్, డివిజన్ బి ఆర్ ఎస్ పార్టీ అధ్యక్షుడు అత్తిలి శ్రీనివాస్ గౌడ్, నాయకులు కిషోర్, ఆంజనేయులు, నార్ల దీపక్ గుప్తా, కోటేశ్వర్ గౌడ్, గణేష్, అభిషేక్, జనార్దన్, రాజు తదితరులు ఉన్నారు.

## ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన దరఖాస్తులను పరిష్కరించాలి

**హైదరాబాద్ పెన్ పవర్:** సోమవారం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయం లోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి తమ సమస్యల వినతులను జిల్లా అదనపు కలెక్టర్ లక్ష్మీ కిరణ్ తో కలిసి జిల్లా కలెక్టర్ స్వీకరించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.ప్రజలు తమ సమస్యలు పరిష్కారం అవుతాయని నమ్మకంతో ప్రజావాణి కార్యక్రమానికి వచ్చేసి అందజేసిన ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించి అర్హతల మేరకు వెంటనే పరిష్కరించే దిశగా అధికారులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ అధికారులకు సూచించారు. జిల్లాలో పరిష్కారం కోసం వచ్చేసిన ప్రజల నుండి మొత్తం 109 దరఖాస్తులు తీసుకున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో డి ఆర్ ఓ నాగరాజమ్మ, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ భవ్య, ఎస్డిసి సుదర్శన్ జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు

## ఆషాఢ బోనాల జాతరకు ప్రభుత్వం సర్వం సిద్ధం: మంత్రి పొన్నం ప్రభాకర్

**హైదరాబాద్ పెన్ పవర్:** జూలై 16 నుండి ఆగస్టు 13 వరకు గోల్కొండ నుంచి లాల్‌దర్వాజా వరకు బోనాల జాతరకు ప్రత్యేక ఏర్పాట్లు.బోనాల ఉత్సవాల నిమిత్తం 3427 దేవాలయాలకు 15 కోట్ల 5 లక్షల 41 వేల 150 రూపాయలు విడుదల.భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని విభాగాల అధికారుల సమన్వయం హైదరాబాద్ ఇంచార్జి మంత్రి పొన్నం ప్రభాకర్.తెలంగాణ రాష్ట్ర ఆధ్యాత్మిక, సాంస్కృతిక వైభవానికి ప్రతీకగా నిలిచే ఆషాఢ మాస బోనాల జాతరను అత్యంత వైభవంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని శాఖలతో సమన్వయం చేస్తూ విస్తృత ఏర్పాట్లు చేపట్టిందని హైదరాబాద్ ఇంచార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ ఒక ప్రకటన ద్వారా తెలిపారు.జూలై 16 నుంచి ఆగస్టు 13 వరకు హైదరాబాద్, సికింద్రాబాద్ నగరాల్లో బోనాల ఉత్సవాలు జరుగనున్న నేపథ్యంలో లక్షలాది మంది భక్తులు ఆలయాలకు తరలివచ్చే అవకాశాన్ని దృష్టిలో ఉంచుకుని అన్ని శాఖలు అప్రమత్తంగా పనిచేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు.జూలై 16న గోల్కొండ శ్రీ జగదాంబ మహంకాళి ఆలయంలో బోనాల ఉత్సవాలతో ప్రారంభంజూలై 20,21,22 తేదీల్లో బల్కంపేట ఎల్లమ్మ కల్యాణోత్సవ ఉత్సవాల్లో భాగంగా 20 న బల్కంపేట ఎల్లమ్మ అమ్మవారి ఎదుర్కోలు ఉత్సవం,21న అమ్మవారికళ్యాణం, 22 న రథోత్సవం అత్యంత వైభవంగా జరగనుంది.ఆగస్టు 2న సికింద్రాబాద్ శ్రీ ఉజ్జయిని మహంకాళి దేవాలయంలో బోనాలు,ఆగస్టు 3న రంగం కార్యక్రమంఆగస్టు 9న హైదరాబాద్ నగరంలోని లాల్ దర్వాజా సింహవాహిని అమ్మవారి బోనాల తో పాటు, నగరంలోని ప్రధాన దేవాలయాల్లో జరిగే బోనాల ఉత్సవాలకు అన్ని రకాల ఏర్పాట్లు చేసినట్లు వెల్లడించారు.బోనాల ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా గతంలో జరిగిన అనుభవాలను దృష్టిలో పెట్టుకుని అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఉత్సవాల కోసం దేవాదాయ శాఖ, జీహెచ్ఎంసీ, పోలీస్ శాఖ, రోడ్లు మరియు భవనాల శాఖ, ట్రాన్స్‌కో, హైదరాబాద్ మెట్రో వాటర్ సప్లై అండ్ సీవరేజ్ బోర్డు, పౌర సరఫరాల శాఖ, టీజీఎస్ఆర్టీసీ, రైల్వే, సమాచార మరియు పౌర సంబంధాల శాఖ, పురావస్తు శాఖతో పాటు ఇతర అన్ని ప్రభుత్వ శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేస్తున్నాయని తెలిపారు.

# హత్య కేసును ఛేదించిన పోలీసులు.. నిందితుడి అరెస్ట్

**హుజూరాబాద్: జూలై 13** హుజూరాబాద్ లోని మామిండ్లవాడకు చెందిన చింత సునీత(35) హత్య కేసులో నిందితుడిని అరెస్ట్ చేసినట్లు హుజూరాబాద్ ఏసిపి వాసంశెట్టి మాధవి సోమవారం తెలిపారు. హత్య జరిగిన కేవలం 36 గంటల్లోనే ఈ కేసును చేయించినట్లు వివరించారు. సోమవారం హుజూరాబాద్ పోలీసు స్టేషన్ లో హత్య కేసు వివరాలను ఆమె వెల్లడించారు. హుజూరాబాద్ మండలం పోతిరెడ్డిపేట గ్రామానికి చెందిన చింత సునీత (35) గత కొంతకాలంగా హుజూరాబాద్ మామిండ్లవాడలో నివాసం ఉంటుంది. ఆమె భర్త కుమార్ మృతి చెందగా, గత ఐదు సంవత్సరాలుగా మోతే కిరణ్ తో సహజీవనం చేస్తుంది. వీరిద్దరు మామిండ్లవాడ గ్యాస్ గోదాం సమీపంలో ఓ అద్దె ఇంటిలో నివాసం ఉంటున్నారు. సునీత తన పక్కన ఉన్న ఇంట్లో ముతోజు భాగ్య అనే మహిళతో స్నేహం పెంచుకుందన్నారు. తరచూ వీరిద్దరు కలిసి తిరుగుతుండటంతో సునీత వ్యభిచారం చేస్తుందనే అనుమానం కిరణ్ కలిగిందన్నారు. ఈ అనుమానంతో ఇద్దరి మధ్య తరచూ గొడవలు జరుగుతుండేవన్నారు. ఈ నెల 10న కిరణ్, సునీత ఇద్దరు కలిసి మద్యం సేవించారన్నారు. ఇదే విషయమై మళ్లి గొడవ జరగడంతో ఆగ్రహానికి గురైన కిరణ్ ముందుగా సునీత గొంతును చేతులతో పిసికి, అనంతరం చిర ముక్కతో గొంతు బిగించి, కాలితో మెడపై తొక్కి హత్య చేశాడన్నారు. ఎవరికి తనపై అనుమానం రాకుండా ఉండేందుకు సునీత మృతదేహాన్ని ఎత్తుకొని వెళ్లి తన స్నేహితురాలైన ముతోజు భాగ్య ఇంటి సమీపంలోని బావిలో పడేశాడన్నారు. సునీత ధరించిన లో దుస్తులు (ప్యాంట్, డ్రాయర్) ను బావికి సమీపంలోని చెట్టు వద్ద పడవేసి, అక్కడి నుంచి పరారై కరీంనగరకు వెళ్లిపోయాడని పేర్కొన్నారు. సిఐ కరుణాకర్ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఈ నెల 13న సోమవారం హుజూరాబాద్ కు తిరిగి వచ్చాడనే పక్కా సమాచారం అందటంతో నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారించగా, స్వచ్ఛందంగా నేరాన్ని ఒప్పుకున్నాడన్నారు. సంఘటన జరిగిన ఇంటిని, మృతదేహాన్ని పడవేసిన బావిని, దుస్తులు పడవేసిన స్థలాన్ని చూపించాడన్నారు. సంఘటన స్థలం నుంచి పగిలిన గాజులు, గాజు ముక్కలు, పుస్తెల పూసలు, కాలి పట్టి తదితర కీలక ఆధారాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నామన్నారు. అలాగే బావి సమీపంలో పడవేసిన మృతురాలి లో దుస్తులను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అరెస్ట్ చేసి న్యాయస్థానంలో హాజరుపరచగా, కేసు దర్యాప్తు కొనసాగుతోందని వివరించారు. మహిళ హత్య కేసును కేవలం 36 గంటల్లోనే ఛేదించి నిందితుడిని పట్టుకున్నామన్నారు. సిఐ కరుణాకర్, ఎస్ఐ లు రవి, శ్రీనివాసరావు, సిబ్బంది మోహన్, అవినాష్, మహేందర్, శ్రీధర్, అనిల్ లను ఏసిపి అభినందించారు.

# ట్రినిటీ ఇంజనీరింగ్ కళాశాలలో ఘనంగా "ట్రినిటీ ఐడియా పిచ్ అరేనా"



**హైదరాబాద్ పెన్ పవర్:** పట్టణంలోని ట్రినిటీ ఇంజనీరింగ్ కళాశాల రీసెర్చ్ అండ్ డెవలప్మెంట్ సెల్ ఆధ్వర్యంలో "ట్రినిటీ ఐడియా పిచ్ అరేనా" కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్టాన్లీ, పల్లవి, మల్లారెడ్డి యూనివర్సిటీ, జ్యోతిష్మతి, ఐఐటిసి తదితర ప్రముఖ విద్యాసంస్థల విద్యార్థులు పాల్గొని సుమారు 100 వినూత్న ప్రాజెక్ట్ ప్రతిపాదనలు సమర్పించా రు. సమాజానికి ఉపయోగపడే నూతన ఆవిష్కరణలు, సాంకేతిక పరిష్కారాలను విద్యార్థులు ప్రదర్శించగా, నిపుణులైన జడ్జీలు పారదర్శకంగా వాటిని పరిశీలించి మూల్యాంకనం చేశారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన మూడు బృందాల కు నగదు బహుమతులు, మెమెంటోలు అందజేసి ఘనంగా సత్కరించారు. అ లాగే మెరిట్ జాబితాలో ఎంపికైన వినూత్న ఆలోచనలను భారత ప్రభుత్వం నిర్వహిస్తున్న ఎం ఎస్ ఎంఈ ఐడియా హాకతోన్ 6.0కు సిఫారసు చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల అకాడమిక్ డైరెక్టర్ డా. అశోక్ కుమార్ వూట్ల మాట్లాడుతూ, తమ కళాశాల వ్యవస్థాపకులు దాసరి మనోహర్ రెడ్డి, చైర్మన్ దాసరి ప్రశాంత్ రెడ్డి, డైరెక్టర్ డాక్టర్ దాసరి మమతారెడ్డి ఆధ్వర్యంలో ట్రినిటీ ఇంజనీరింగ్ కళాశాలకు ఇటీవలే భారత ప్రభుత్వ ఎం ఎస్ ఎంఈ శాఖ ద్వారా ఇంక్యుబేషన్ సెంటర్ మంజూరైందన్నారు. విద్యార్థు ల్లో ఆవిష్కరణలు, స్టార్టప్ సంస్కృతిని ప్రోత్సహించేందు కు ఇలాంటి కార్యక్రమాలను నిరంతరం నిర్వహిస్తున్నామని తెలిపారు. సూక్ష్మ, చిన్న, మధ్య తరహా

పరిశ్రమలు ఆవిష్కరణలకు ట్రినిటీ ఇంక్యుబేషన్ సెంటర్ ద్వారా భారత ప్రభుత్వ సహకారంతో రూ.15 లక్షల వరకు గ్రాంట్ పొందే అవకాశం ఉందని పేర్కొన్నారు. కళాశాల ప్రిన్సిపల్ డా. మణి గణేష్, ఆర్ అండ్ డి కోఆర్డినేటర్ శ్రీ అశోక్ ప్రభాకర్, జడ్జిలుగా డా. కౌండిన్య, డా. సమ్మ య్య , డాక్టర్ రామ్మోహన్, విద్యాసాగర్ సుప్రియ, భాష, మరియు విభాగ అధిపతులు పాల్గొని విద్యార్థులకు విలువై న సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో అధ్యాప కులు, వివిధ కళాశాలల విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేశారు.

## మణుగూరు ప్రధాన రహదారిపై భారీ గుంతలు వెంటనే పూడ్చాలి

**భద్రాద్రి కొత్తగూడెం పెన్ పవర్:**
మణుగూరు పట్టణ ప్రధాన రహదారిపై ఏర్పడిన భారీ గుంతలను అత్యవసరంగా పూడ్చడంతో పాటు శాశ్వతంగా నాణ్యమైన బీటీ (డీ) రహదారి నిర్మాణం చేపట్టాలని మాజీ జడ్పీటీసీ పాల్వంచ దుర్గ జిల్లా సోమవారం కలెక్టర్ కార్యాలయంలో జరిగిన ప్రజావాణిలో జిల్లా కలెక్టర్ కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, మణుగూరు ప్రధాన రహదారిలో సురక్ష బస్ స్టాండ్ సమీపంలోని గిరిజన స్టోర్ ఎదురుగా, అంబేద్కర్ సెంటర్‌లో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహం సమీపంలో, అశోక్‌నగర్ పెట్రోల్ బంక్ ముందు రహ దారి పూర్తిగా దెబ్బతిని భారీ గుంతలు ఏర్పడ్డాయని తెలిపారు. ఇటీవల కురుస్తున్న వర్షాల కారణంగా గుంతల్లో నీరు నిల్వ ఉండటంతో వాటి లోతు కనిపించక వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ రహదారి పట్టణంలో అత్యం త రద్దీగా ఉండే ప్రధాన మార్గమని, ప్రతిరోజూ వేలాది మంది ప్రజలు, విద్యార్థులు, ఉద్యోగులు, సింగరేణి కార్మికులు, అత్యవసర సేవల వాహనాలు, ఆర్టీసీ బస్సులు, లారీలు, ఇతర భారీ వాహనా లు ఈ మార్గంలో ప్రయాణిస్తున్నాయని తెలిపారు. గుంతల కారణంగా ద్విచక్ర వాహనదారులు అదుపుతప్పి పడిపోవ డం, ఆటోలు, కార్లు ఇతర వాహనాలు ప్రమాదాలకు గురవడం తరచుగా జరుగు తోందన్నారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో ప్రమాదాల తీవ్రత మరింత పెరుగుతోంద ని పేర్కొన్నారు. ఇప్పటికే పలువురు గాయపడగా, భవిష్యత్తులో ప్రాణనష్టం సంభవించే ప్రమాదం ఉన్నందున సంబం ధిత అధికారులు వెంటనే స్పందించాలని ఆమె కోరారు. భారీ గుంతలను అత్యవ సరంగా పూడ్చి వేయడంతో పాటు శాశ్వత పరిష్కారంగా నాణ్యమైన బీటీ రహదారి నిర్మించాలని, మరమ్మతులు పూర్తయ్యే వరకు హెచ్చరిక బోర్డులు, బ్యారికేడ్లు, రిఫ్లెక్టర్లు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. అలాగే సంబంధిత ఇంజనీరింగ్ అధికారులు క్షేత్రస్థాయిలో వెంటనే పరిశీలించి నివేదిక సమర్పించే లా ఆదేశాలు జారీ చేయాలని, ప్రజల ప్రాణ భద్రత దృష్ట్యా ఈ పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్‌ను దుర్గ కోరారు.

## ఎస్ఐఆర్ సర్వే విజయవంతానికి అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలి..

**హైదరాబాద్ పెన్ పవర్:**
స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ఎస్ఐఆర్ సర్వే ప్రక్రియ విజయవంతం కావడానికి అన్ని రాజకీయ పార్టీలు ప్రజాప్రతినిధులు ప్రజలు సమన్వయంతో సహకరించాలని మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు కోరారు సోమవారం తన నివాసంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎస్ఐఆర్ సర్వేపై అవగాహన పోస్టర్లను విడుదల చేశారు.ఈ సందర్భంగా విడుదల చేసిన అవగాహన పోస్టర్లలో మీ ఓటు మీ బాధ్యత అనే నినాదంతో కొత్త ఓటరు నమోదు పేరు తొలగింపు వివరాల సవరణ పోలింగ్ కేంద్రం మార్పు డూప్లికేట్ ఓట్ల తొలగింపు వంటి అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతు ఓటరు జాబితాను మరింత పారదర్శకంగా రూపొందించేందుకు ఎన్నికల సంఘం చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ఎస్ఐఆర్ సర్వే ప్రక్రియ జూలై 24తో ముగుస్తుందని ఓటరు జాబితాలో పేరు లేని వారు కొత్తగా ఓటరు నమోదు చేసుకునే అర్హులు అలాగే పేరు చిరునామా ఇంటి నంబర్ వయస్సు ఫోటో తదితర వివరాల్లో మార్పులు అవసరమైన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ఒక పోలింగ్ కేంద్రం నుంచి మరో పోలింగ్ కేంద్రానికి మార్పు ఓట్ల తొలగింపు వంటి ప్రక్రియలను కూడా ఈ సర్వే ద్వారా పూర్తి చేసుకోవచ్చని ఎమ్మెల్యే వివరించారు. ఓటు హక్కు ప్రతి పౌరుడి ప్రాథమిక హక్కు అని అందువల్ల ఎవరూ నిర్లక్ష్యం చేయకుండా తమ వివరాలను సకాలంలో నమోదు చేసుకోవాలని జూలై 31న ముసాయిదా ఓటర్ల జాబితా విడుదల అవుతుందని అనంతరం అభ్యంతరాలు సవరణలకు ఆగస్టు నుంచి అక్టోబర్ 24 వరకు అవకాశం ఉంటుందని తెలిపారు. తుది ఓటర్ల జాబితా అక్టోబర్ 31న విడుదల కానుందని వెల్లడించారు ఈ సర్వే ప్రక్రియ వల్ల అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో పారదర్శకత పెరుగుతుందని పేర్కొన్న ఎమ్మెల్య రేషన్ కార్డులు పెన్షన్లు తదితర ప్రభుత్వ సేవలకు సంబంధించిన వివరాలను కూడా ప్రజలు సకాలంలో నవీకరించుకోవాలని సూచించారు. ప్రజల్లో అవగాహన కల్పించేందుకు అన్ని రాజకీయ పార్టీలు సర్పంచులు వార్డు సభ్యులు స్థానిక ప్రజాప్రతినిధులు చొరవ చూపాలని కోరారు.ఎస్ఐఆర్ సర్వే పూర్తయ్యే వరకు ప్రతి ఒక్కరూ దీనికి ప్రాధాన్యత ఇవ్వాలని రాజకీయాలకు అతీతంగా ప్రజాహిత దృక్పథంతో సహకరించాలని ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు. ఈ ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా ప్రతి కుటుంబం బాధ్యతాయుతంగా తమ వివరాలను నమోదు

చేసుకోవాలని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో మాజీ డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ మేయర్ దర్నీ మధుకర్ డిప్యూటీ మేయర్ సల్ల రమ్య టీపీసీసీ ఉపాధ్యక్షులు చిట్ల సత్య నారాయణ మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కార్పొరేటర్ తూముల నరేష్ పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు గజ్జెల హేమలత ఆయా డివిజన్ల కార్పొరేటర్లు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు

# బాల్యంపై భారం ...
# పుస్తకాల బరువుతో వంగిపోతున్న చిన్నారులు

**చిన్న వయస్సులో వెన్నెముకపై సామర్థ్యాన్ని మించి భారం**
**అమలుకు నోచుకోని విద్యాహక్కు చట్టం**

**జగిత్యాల: పెన్ పవర్:** బాల్యంపై భారం పెరిగిపోతోంది. వారిని పుస్తకాల బరువు కుంగదీస్తోంది. కిలోల కొద్ది బరువును వీపుపై మోస్తూ అనారోగ్యం భారిన పడాల్సి వస్తోంది. పలు ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు తమ లాభాపేక్ష కోసం ప్రభుత్వ నిబంధనలకు తూట్లు పొడుస్తూ విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడుతున్నాయి. విద్యాహక్కు చట్టాన్ని తుంగలో తొక్కుతూ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయి. అవసరంలేని, అర్హతకు మించిన పుస్తకాలను కొనుగోలు చేయించి విద్యార్థుల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్నాయి. వాస్తవానికి నర్సరీ, ఎల్కేజీ, యూకేజీ విద్యార్థులకు అసలు పుస్తకాలు ఉండొద్దని చట్టం పేర్కొంటుంది. కానీ ఈ నిబంధనలేవి అమలవడం లేదు. అంతేనా పలు ప్రైవేటు పాఠశాలలు పుణ్యమా అని ఒకటి రెండు తరగతుల విద్యార్థులే 30 నుంచి 45 పుస్తకాలను మోస్తున్నారు. విద్యార్థులకు తరగతి గదులే సరిపడా లేని పలు పాఠశాలల్లో ఇక లాకర్ల సదుపాయం ఎక్కడ ఉంటుందనే వాదన వినిపిస్తోంది. కానీ ఇలాంటి పాఠశాలలను అధికారులు పట్టించుకోవడంలే దని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు మారిన ఫ్యాషన్ పోకడలను అనుసరించి విద్యార్థులు నడుం కిందకు బ్యాగు వేసుకుంటున్నారు. ఇలా వేసుకోవడం వల్ల ఇబ్బందులు ఎదురవుతాయని వైద్యులు హెచ్చరిస్తున్నారు. అయితే ఈ ఏడాది అకాడమిక్ క్యాలెండర్ ను విడుదల చేసిన ప్రభుత్వం పది బ్యాగ్ లెస్ డేస్ ను నిర్వహించాలని, నెలలో ప్రతీ మూడో శనివారం నో బ్యాగ్ డేగా పాటించాలని నిర్ణయం తీసుకుంది.

# అన్న-అక్క మెంటర్‌షిప్‌తో జెడ్పీహెచ్ఎస్ పద్మానగర్‌లో ప్రత్యేక శిక్షణ ప్రారంభం



**కరీంనగర్ జూలై 13 పెన్ పవర్:** ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల్లో విద్యా నైపుణ్యాలు, ఉన్నత విద్యపై అవగాహన పెంపొందించేందుకు అన్న--అక్క మెంటర్‌షిప్ కార్యక్రమంలో భాగంగా జెడ్పీహెచ్ఎస్ పద్మానగర్‌లో ప్రత్యేక శిక్షణ తరగతులను ప్రారంభించారు. ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల (అటానమస్) గణితశాస్త్ర విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డా. ఎం. అర్చన, కళాశాల విద్యార్థులతో కలిసి ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా నోడల్ అధికారి మధు రాజేష్ మాట్లాడుతూ, డిగ్రీ విద్యార్థులు ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు మార్గనిర్దేశం చేయడం ద్వారా ఆత్మవిశ్వాసం, వ్యక్తిత్వ వికాసం పెరుగుతుందని తెలిపారు. ప్రధానోపాధ్యాయులు ఎం. దినేష్ కుమార్ మాట్లాడుతూ, ఈ కార్యక్రమం విద్యార్థులకు ఉన్నత లక్ష్యాల సాధనలో ప్రేరణగా నిలుస్తుందని అన్నారు. డా. ఎం. అర్చన మాట్లాడుతూ, గణితం, సైన్స్‌తో పాటు ఉన్నత విద్య, పోటీ పరీక్షలు, కెరీర్ అవకాశాలపై నిరంతర మార్గదర్శకత్వం అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొనగా, ఎస్ఆర్ఆర్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె. రామకృష్ణ, వైస్ ప్రిన్సిపాల్ డా. పి. నితిన్ తదితరులు నిర్వాహకులను అభినందించారు.

# 42 ఏళ్ల తర్వాత ఎలగందుల పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక

## రేకుర్తిలో ఎస్ఎస్‌సీ 1984 బ్యాచ్ అపూర్వ సమ్మేళనం

**హైదరాబాద్ పెన్ పవర్:** ఎలగందుల గ్రామానికి చెందిన 1983--84 విద్యా సంవత్సరపు పదో తరగతి (ఎస్ఎస్‌సీ) బ్యాచ్ పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం రేకుర్తిలోని ల్యాంప్స్ ఫామ్ హౌస్ లో ఘనంగా జరిగింది. పాఠశాల విడిచి 42 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఏర్పాటు చేసిన ఈ ఆత్మీయ కలయికలో మిత్రులంతా ఒకే వేదికపై చేరి బాల్యస్మృతులను నెమరువేసుకున్నారు. పాఠశాల రోజుల్లో జరిగిన మధుర సంఘటనలు, స్నేహితులతో గడిపిన అనుభవాలను గుర్తుచేసుకుంటూ ఆనందంగా గడిపారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ, గతంలో 2010లో తొలి సమ్మేళనం నిర్వహించి ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించినట్లు గుర్తుచేశారు. అప్పట్లో పాఠశాల గ్రంథాలయానికి అవసరమైన పుస్తకాలను అందజేసి, పాఠశాల అభివృద్ధికి తమ వంతు సహకారం అందించామన్నారు. మళ్లీ 16 ఏళ్ల అనంతరం రెండోసారి కలుసుకోవడం పాత స్నేహాలను మరింత బలపరిచిందని ఆనందం వ్యక్తం చేశారు. ఇటువంటి కలయికలు భావితరాలకు స్ఫూర్తిగా నిలుస్తాయని,



ఇకపై ప్రతి ఏటా ఇలాంటి సమావేశాలు నిర్వహించడంతో పాటు సామాజిక సేవా కార్యక్రమాలు, పాఠశాల అభివృద్ధికి తోడ్పడాలని నిర్ణయించినట్లు తెలిపారు.
పాల్గొన్నవారు ఈ కార్యక్రమంలో తమకు విద్యాబోధ చేసిన రాచమల్ల వెంకటయ్య టీచర్, కొండలరావు టీచర్, నారాయణరెడ్డి టీచర్ సేవలను పూర్వ విద్యార్థులు ప్రత్యేకంగా స్మరించుకున్నారు. గురువుల ఆశీస్సులతో తమ జీవితాల్లో సాధించిన విజయాలను గుర్తుచేసుకుంటూ వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఇట్టి కార్రక్రమంలో బోనాల కిషన్ ఏఎస్పి, మామిడి రమేష్ ఎన్టిపిఏ, కోటేశ్వర్ లేబర్ ఆఫీసర్, జి శ్రీనివాస్, డి ఏ ఓ, రాచమల్ల సుగుణాకర్, ఆంజనేయులు, ఉమ్మర అలీ, స్వామి, శ్రీనివాస్ రెడ్డి, ఉమాదేవి, వనజ, శాంతా, పద్మావతి పాల్గొన్నారు.

# మెరిట్ ప్రకారమే గురుకుల సీట్లు

**హైదరాబాద్ పెన్ పవర్:** రాష్ట్రవ్యాప్తంగా ఉన్న మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల విద్యాలయాల సంస్థలో సీట్లు మెరిట్ ప్రకారమే కేటాయిస్తున్నామని, సీటు రానివారు ఆఫీస్, స్కూల్ చుట్టూ తిరగవద్దని సంస్థ కార్యదర్శి బడుగు సైదులు విజ్ఞప్తి చేశారు. 2026- 27 విద్యా సంవత్సరానికి మెరిట్ ప్రాతిపదికన ప్రవేశాలు జరుగుతున్నాయని, అర్హత గల వారికే సీట్లు కేటాయిస్తామని ఆయన వివరించారు. మెరిట్ ప్రకారం మొదటి విడత, రెండవ విడత సీట్ల కేటాయింపు జరిగిందన్నారు. 5వ తరగతిలో ,6,7,8 లో తరగతుల్లో బ్యాక్ లాగ్ సీట్లు ఇంకా ఏమైనా ఖాళీలు ఉంటే ఆన్ లైన్ లో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి విద్యార్థుల మెరిట్ ఆధారంగా అర్హులైన వారికి సీటు కేటాయించబడుతుందన్నారు. ఇంటర్ కాలేజి లో ఎక్కడైనా సీట్లు ఖాళీ గా ఉంటే ఆ కాలేజీల్లో స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తామని ఆయన తెలిపారు. సీటు రాని వారు ఆఫీస్ , స్కూల్ చుట్టూ తిరగవద్దని సోమవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో ఆయన విజ్ఞప్తి చేశారు.
ఈ ఏడాది గురుకులాల్లో సీట్లకు పోటీ పెరిగిందని, సీటు రానివారు హైదరాబాద్ హెడ్ ఆఫీస్ లో కానీ, =జూ ఆఫీస్ లలో కానీ, స్కూలు చుట్టూ తిరిగి సమయం వృథా చేసుకోవద్దు అని ఆయన సూచించారు. సీటు కోసం ఎవ్వరి నుంచి దరఖాస్తులు స్వీకరించబడవని ఆయన పేర్కొన్నారు. విద్యార్థులు, తల్లిదండ్రులు సంస్థ కార్యాలయానికి రావద్దని, అడ్మిషన్లకు దరఖాస్తులు తీసుకోబడవని, మధ్యవర్తులను నమ్మవద్దని సూచించారు. ఎవరైనా సీట్లు ఇప్పిస్తామని చెప్పితే వారి మాట నమ్మవద్దని, అలా చెప్పిన వారి వివరాలు ఫోన్ : 040-23120496 ద్వారా తెలియజేయాలని ఆయన కోరారు. సీట్లు ఇప్పిస్తామని తల్లిదండ్రులను, విద్యార్థులను మోసం చేసేవారి పై పోలీసులకు ఫిర్యాదు చేసి చట్టపరమైన చర్యలు తీసుంటామని ఆయన హెచ్చరించారు.

## ప్రజావాణిలో 20 అర్జీలు స్వీకరణ
## సమస్యల సత్వర పరిష్కారానికి కమిషనర్ ఆదేశాలు




**కరీంనగర్ జూలై 13 పెన్ పవర్:** కరీంనగర్ నగరపాలక సంస్థ కళాభారతిలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ వివిధ డివిజన్ల నుంచి వచ్చిన ప్రజల నుంచి మొత్తం 20 అర్జీలను స్వీకరించారు. వీటిలో టౌన్ ప్లానింగ్‌కు 15, ఇంజనీరింగ్‌కు 1, రెవెన్యూకు 2, శానిటేషన్‌కు 1, బర్త్ అండ్ డెత్ విభాగానికి 1 దరఖాస్తు వచ్చింది. ఆక్రమణల తొలగింపు, అనధికార నిర్మాణాలు, పన్ను సవరణ, కొత్త ప్రాపర్టీలు, నల్లా కనెక్షన్, తాగునీటి సమస్యలపై ఎక్కువగా ఫిర్యాదులు అందాయి. ప్రజావాణికి వచ్చిన ప్రతి అర్జీని క్షేత్రస్థాయిలో పరిశీలించి పెండింగ్‌లో ఉంచకుండా త్వరితగతిన పరిష్కరించాలని సంబంధిత అధికారులను కమిషనర్ ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ అయాజ్, డిప్యూటీ కమిషనర్ ఖాధర్ మోహియోద్దిన్, అసిస్టెంట్ కమిషనర్ రాజమనోహర్ తదితర అధికారులు పాల్గొన్నారు.

## జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవాన్ని విజయవంతం చేయాలి:



**కామారెడ్డి: పెన్ పవర్:** జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం (చీళ్ఞఱశీఋశ్రీ ణవషశీతీఎఱఅస్త్ర ఋుఎ) సందర్భంగా జిల్లాలో నిర్వహిస్తున్న కార్యక్రమాన్ని ప్రతి అర్హత కలిగిన చిన్నారికి చేరేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అన్నారు.
సోమవారం కామారెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ ప్రారంభించారు. అనంతరం విద్యార్థులకు స్వయంగా అల్బెండాజోల్ మాత్రలు అందించి కార్యక్రమాన్ని ప్రారంభించారు.
ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ఒకటి నుంచి 19 సంవత్సరాల వయస్సు గల పిల్లలు, కిశోరులకు సంవత్సరానికి రెండుసార్లు అల్బెండాజోల్ మాత్ర ఇవ్వడం ద్వారా నులిపురుగుల సమస్యను సమర్థవంతంగా నివారించవచ్చని తెలిపారు. నులిపురుగుల కారణంగా పిల్లల్లో రక్తహీనత, పోషకాహార లోపం, శారీరక ఎదుగుదల మందగించడం, చదువుపై ఏకాగ్రత తగ్గడం వంటి సమస్యలు తలెత్తే అవకాశం ఉందని పేర్కొన్నారు. జిల్లాలో అర్హులైన 2,46,177 మంది ప్రతి చిన్నారులకు , ప్రతి విద్యార్థికి నులిపురుగుల నివారణ మాత్ర అందేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆదేశించారు. తల్లిదండ్రులు కూడా తమ పిల్లలకు తప్పనిసరిగా మాత్ర వేయించి కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో భాగస్వాములు కావాలని కోరారు.
జూలై 20న నిర్వహించే మాప్-అప్ డే సందర్భంగా మొదటి విడతలో మాత్రలు తీసుకోలేకపోయిన పిల్లలకు తప్పనిసరిగా మాత్రలు అందచేయాలని అన్నారు.
ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య మరియు ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్. జె.వెంకటి,ప్రోగామ్ అధికారి డాక్టర్.రోహిత్ కుమార్,కామారెడ్డి మున్సిపల్ కమిషనర్ పర్వతాలు, మున్సిపాలిటీ చైర్‌పర్సన్ ఇప్ప ఉమారాణి, స్థానిక కౌన్సిలర్ అఖిల, జిల్లా విద్యాశాఖాధికారి మల్లికార్జున్, స్థానిక వైద్యాధికారి డాక్టర్ చందన ప్రియ, ఎంఈఓ ఎల్లయ్య, జెడ్పీహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయురాలు వై. మాధవి, వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారులు, విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు, ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## 10వ డివిజన్ కట్టరాంపూర్‌లో రూ.10 లక్షల అభివృద్ధి పనులకు శంకుస్థాపన



**కరీంనగర్ జూలై 13: పెన్ పవర్:** కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలోని 10వ డివిజన్ కట్టరాంపూర్‌లో రూ.10 లక్షల వ్యయంతో చేపట్టనున్న నూతన సీసీ రోడ్డు నిర్మాణ పనులకు సోమవారం శంకుస్థాపన చేశారు. మున్సిపల్ సాధారణ నిధులతో ఈ పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మేయర్ కొలగాని శ్రీనివాస్, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు పాల్గొని అభివృద్ధి పనులను ప్రారంభించారు. మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, కార్పొరేటర్ సౌగాని కొమురయ్య, మున్సిపల్ అధికారులు, కాలనీవాసులు తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

# ప్రతి సమస్యను వీలైనంత త్వరగా పరిష్కరిస్తాం

**హైదరాబాద్ పెన్ పవర్:** ఇది ప్రజా ప్రభుత్వమని ప్రజలు ప్రస్తావించిన ప్రతి సమస్యను వీలైనంత త్వరగా పరిష్కరిస్తామని టిపిసిసి ఉపాధ్యక్షుడు కూకట్పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్ పేర్కొన్నారు. నియోజకవర్గ పరిధిలోని వసంత నగర్ డివిజన్ గ్రీన్ వ్యూ కాలనీలో స్థానిక ప్రజల ఆహ్వానం మేరకు కాలనీలో పర్యటించిన రమేష్ విస్తృతంగా పర్యటించారు. తాము నివసించేందుకు కనీస మౌలిక సదుపాయాలైన తాగునీరు రోడ్లు విద్యుత్తు డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు చేయకపోవడాన్ని కాలనీవాసులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు దీనిపై స్పందించిన ఆయన కొద్దిరోజులు వ్యవధి లోనే కాలనీకి అన్ని మౌలిక వసతులు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు అనంతరం సర్ పత్రాల పంపిణీ పైన వాటిని పూర్తి చేయడం పైన ప్రజలకు అవగాహన కల్పించారు ప్రతి ఒక్కరూ తమకు ఇచ్చిన పత్రాన్ని పూర్తి చేసి తిరిగి అధికారులకు అందజేయాలని సూచించారు పార్టీకి చెందిన స్థానిక నాయకులు సైతం సర్ పత్రాలను పూర్తి చేయడంపై ప్రజలకు సహకరించాలని సూచించారు.

# ఎస్ఐఆర్ అవగాహనా కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే మాధవరం

**రంగారెడ్డి: పెన్ పవర్:** శేరిలింగంపల్లి నియోజకవర్గం ఆల్విన్ కాలనీలో ఎస్ ఐ ఆర్ అవగాహన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, బిఆర్ఎస్ నాయకులు ఎర్రబెల్లి సతీష్ రావు పాల్గొన్నారు. ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మాట్లాడుతూ బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు ప్రతి ఇంటికి తిరిగి ఓట్లు పోవ్వివకుండా జాగ్రత్త పడాలి. కాంగ్రెస్ బిజెపి ప్రభుత్వాలు కలిసి తెలంగాణ ప్రజలను మోసం చేసే విధంగా ఈ కార్యక్రమం వుందని అన్నారు. అబద్ధపు హామీలు ఇచ్చి గద్దెనెక్కిన రేవంత్ రెడ్డి ప్రజలకు సంక్షేమ పథకాలు ఇవ్వలేకే ఓట్లు తొలగించే డ్రామా ఎస్ఐఆర్. గడపగడపకు తిరిగి వివరాలు సేకరించవలసిన అధికారులు ఒకే చోట = ఫారంలు పంచుతున్నారు. అధికారులు వచ్చిన సమయంలో ఇంట్లో లేకపోతే వాళ్ళ ఓట్లు తొలగించే పన్నాగం పడుతున్నారు అధికారులు. అధికారులు సైతం కాంగ్రెస్ ఏజెంట్లుగా పనిచేస్తున్నారు . అధికారుల ధోరణి మారకపోతే న్యాయస్థానికి వెళ్ళి పిర్యాదు చేశాం. బిఆర్ఎస్ కార్యకర్తలు బీఎల్వో లతో కలిసి ఓట్లు తొలగించకుండా వివరాలు సేకరించేలా పనిచేయాలని అన్నారు.

## భయమా..ప్రకాష్ రాజ్ ?

**హైదరాబాద్, జూలై 13, పెన్ పవర్:** యూట్యూబర్ రావణ్ దేశద్రోహం, ఉపా చట్టం కింద అరెస్ట్ అయి జైలుకు వెళ్లిన ఉదంతంలో ప్రముఖ నటుడు ప్రకాష్ రాజ్ పేరు ప్రముఖంగా తెరపైకి రావడంతో సోషల్ మీడియాలో ఆయనపై పెద్ద ఎత్తున ట్రోలింగ్, ప్రచారం మొదలైంది. దీనిపై ప్రకాష్ రాజ్ నా ప్రశ్నించే గొంతును ఎవరూ ఆపలేరంటూ కొత్తగా వీడియో విడుదల చేశారు. తాను మౌనంగా లేనని, జనసైనికులు, కొన్ని ఛానళ్లు, యూట్యూబర్లు చేస్తున్న అబద్ధాల ప్రచారాన్ని గమనిస్తున్నానని తెలిపారు. వీటన్నిటికీ దిగజారండి, దిగజారుతూనే ఉండండి అని వ్యాఖ్యానిస్తూ, వారి దిగజారుడుతనాన్ని ప్రపంచం చూస్తోందంటూ ట్వీట్ చేశారు. ప్రకాష్ రాజ్ పైపైన ఎంత ధైర్యంగా మాట్లాడుతున్నా.. లోపల మాత్రం కేసు తీవ్రత చూసి తీవ్ర ఆందోళనలో ఉన్నారనే చర్చ రాజకీయ వర్గాల్లో జోరుగా సాగుతోంది. దేశద్రోహం కేసులో ఇరుక్కున్న రావణ్‌తో ప్రకాష్ రాజ్‌కు అత్యంత సన్నిహిత సంబంధాలు ఉన్నాయనేది ప్రధాన ఆరోపణ. రావణ్‌తో పాటు కొంతమంది ఒక ముఠాగా ఏర్పడి, ఏపీలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా సామాజిక మాధ్యమాల్లో కుల, మతాల మధ్య చిచ్చు పెట్టేలా వ్యూహాత్మక కుట్రలు చేశారనే ప్రచారం గట్టిగా నడుస్తోంది. గతంలో రావణ్ చేసిన పలు వివాదాస్పద పోస్టులను, వీడియోలను ప్రకాష్ రాజ్ సపోర్ట్ చేస్తూ రీట్వీట్లు చేయడం.. ఇప్పుడు ఈ విచారణ తన దాకా వస్తుందనే భయంతోనే ఆయన ప్రశ్నించే గొంతు అంటూ ముందస్తు రక్షణ కవచం వెతుక్కుంటున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.ప్రకాష్ రాజ్ కెరీర్ అంతా పరిశీలిస్తే.. ఆయన ఎప్పుడూ సమాజం కోసమో, సామాన్య ప్రజల సమస్యల కోసమో క్షేత్రస్థాయిలో ప్రశ్నించిన దాఖలాలు లేవనేది బహిరంగ రహస్యం. ఆయన వేసే ప్రశ్నలు కేవలం ఒక వర్గాన్ని టార్గెట్ చేసేలా, ఆయన వ్యక్తిగత, రాజకీయ ఎజెండాలకు ఉపయోగపడేలా మాత్రమే ఉంటాయనే వాదన బలంగా ఉంది. అందుకే ప్రజాసమస్యలపై స్పందించని ఆయన ప్రశ్నల ను సామాన్యులు పెద్దగా పట్టించుకోరు. కానీ, ఈసారి వ్యవహారం కేవలం రాజకీయ విమర్శలతో ఆగిపోయేలా లేదు. ప్రభుత్వ నిఘా వర్గాలు, పోలీసులు ఈ డిజిటల్ కుట్రల వెనుక ఉన్న అసలు లింకులను పక్కా ఆధారాలతో బయటకు తీస్తున్నారు. చట్టం ముందు అందరూ సమానులే కాబట్టి, నిజాలు పూర్తిగా నిరూపితమైతే ప్రకాష్ రాజ్ సైతం లీగల్ చిక్కులను, కఠిన చర్యలను ఎదుర్కోక తప్పదని భావిస్తున్నారు.ప్రస్తుతం ఈ వ్యవహారంలో పోలీసుల తదుపరి అడుగులు ప్రకాష్ రాజ్ మెడకు చుట్టుకునేలా కనిపిస్తున్నాయి. అరెస్ట్ అయిన రావణ్ మొబైల్ ఫోన్, ల్యాప్‌టాప్‌లలో లభ్యమైన కీలక డేటా, చాటింగ్ హిస్టరీతో పాటు.. ఈ ఛానల్‌కు ఫండింగ్ చేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న గమన అనే మహిళను పోలీసులు త్వరలోనే విచారించనున్నారు. గమన నోటీసుల విచారణలో తేలే అంశాలు, రావణ్ ఫోన్ డాక్యుమెంట్లు క్రోడీకరిస్తే.. ఈ సోషల్ మీడియా నెట్‌వర్క్ వెనుక ప్రకాష్ రాజ్ పాత్ర ఏంటనేది అధికారికంగా బయటపడే అవకాశం ఉంది. తెరవెనుక నడిచిన అసలు కథ స్క్రిప్ట్ బయటకు వస్తే, అది ప్రకాష్ రాజ్ కే సమస్యలు తెచ్చిపెట్టవచ్చు.

# బీజేపీకి చుక్కలు చూపిస్తున్న పీకే

**పాట్నా, జూలై 13 పెన్ పవర్:**

బీహార్ రాజకీయాల్లో ఇప్పుడు ఒకే పేరు మార్మోగుతోంది.. అదే ప్రశాంత్ కిషోర్ . మూడు దశాబ్దాలుగా భారతీయ జనతా పార్టీకి అజేయమైన కోటగా ఉన్న బంకీపూర్ అసెంబ్లీ నియోజకవర్గంలో పీకే ఎంట్రీ ఇవ్వడమే ఆలస్యం, అక్కడ పొలిటికల్ మైండ్ గేమ్‌తో కమల దళానికి ఆయన చుక్కలు చూపిస్తున్నారు. నామినేషన్ వేసిన కేవలం 24 గంటల వ్యవధిలోనే బీజేపీ అభ్యర్థి అభిషేక్ సిన్హా అర్ధాంతరంగా బరి నుంచి తప్పుకున్నారు. ఒకప్పుడు తెరవెనుక ఉండి దేశవ్యాప్తంగా ఎందరో నాయకులను గెలిపించిన ఈ కింగ్‌మేకర్, ఇప్పుడు తానే నేరుగా ప్రజాక్షేత్రంలోకి దిగి ప్రత్యర్థుల గుండెల్లో రైళ్లు పరిగెత్తిస్తున్నారు.బంకీపూర్ ఉపఎన్నిక బరిలో ప్రశాంత్ కిషోర్ స్వయంగా నిలబడటంతో బీజేపీ తీవ్ర ఆత్మరక్షణలో పడింది. పీకే లాంటి చాణక్యుడి ముందు అభిషేక్ సిన్హా చాలా బలహీనమైన అభ్యర్థి అని ఆ పార్టీ అంతర్గత సర్వేల్లో తేలడమే కాకుండా, ఆయనకు సంబంధించిన కొన్ని వివాదాస్పద ఆర్థిక లావాదేవీల చిట్టా పీకే చేతికి చిక్కిందనే ప్రచారం పట్నా రాజకీయాలను కుదిపేస్తోంది. ఆ ఆధారాలు ఎన్నికల ప్రచారంలో బయటపడితే పార్టీ పరువు గంగలో కలుస్తుందని భావించిన అధిష్టానమే, బంటితో బలవంతంగా నామినేషన్ ఉపసంహరింపజేసింద భావిస్తున్నారు. ఈ పరిణామంతో, ప్రత్యర్థులను ఈడీ, సీబీఐలతో భయపెట్టే బీజేపీ.. ఇప్పుడు ఓటమి భయంతో తానే రంగు మార్చి పారిపోతోందంటూ పీకే వేసిన సెటైర్లు సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతున్నాయి.నష్టనివారణ చర్యల్లో ఓ బీజేపీ యువజన విభాగంలో పనిచేసే నీరజ్ కుమార్ సిన్హాను కొత్త అభ్యర్థిగా అత్యవసరంగా బరిలోకి దించింది. ఐదుసార్లు వరుసగా గెలిచిన బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నవీన్ రాజ్యసభకు వెళ్లడంతో ఖాళీ అయిన ఈ స్థానం, కమలదళానికి అత్యంత ప్రతిష్టాత్మకం. గత 2025 ఎన్నికల్లో ఇక్కడి నుంచి ఆర్జేడీ అభ్యర్థి రేఖా కుమారిపై నితిన్ నవీన్ 51 వేల ఓట్ల భారీ మెజారిటీతో గెలిచారు. అయితే, ఇప్పుడు పీకే స్వయంగా రంగంలో ఉండటం, ఆర్జేడీ తరఫున మళ్లీ రేఖా కుమారి పోటీలో నిలవడంతో ఈ ఉపఎన్నిక రసవత్తరమైన త్రిముఖ పోరుగా మారింది.జులై 30న జరగబోయే పోలింగ్, ఆగస్టు 3న వచ్చే ఫలితాలను ప్రశాంత్ కిషోర్ తన రాజకీయ భవిష్యత్తుకు ఒక రెఫరెండం గా ప్రకటించారు. మొదటి విడతలోనే అభ్యర్థిని మార్చాల్సి వచ్చేలా చేసి బీజేపీ డిఫెన్స్‌లో పడిందనే నెరేటివ్‌ను సెట్ చేయడంలో పీకే ఇప్పటికే సగం విజయం సాధించారు. మూడు దశాబ్దాలుగా జనసంఘ్, ఆర్ఎస్ఎస్ మూలాలున్న బంకీపూర్ ఓటర్లు పీకే డిజిటల్ , గ్రౌండ్ మేనేజ్‌మెంట్ ప్రయోగాలకు జై కొడతారా, లేక సాధారణ బూత్ స్థాయి కార్యకర్తని నిలబెట్టిన బీజేపీకే ఓటేస్తారా అన్నది ఆసక్తికరంగా మారింది.

# కార్మికుల సమస్యల పరిష్కారానికి కలెక్టరేట్ ఎదుట భారీ ధర్నా

**కరీంనగర్ జూలై 13 పెన్ పవర్:** కరీంనగర్‌లో కార్మిక సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో వేలాది మంది కార్మికులు తెలంగాణ చౌక్ నుంచి కలెక్టరేట్ వరకు భారీ ర్యాలీ నిర్వహించి ధర్నా చేపట్టారు. కార్మికుల న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని కోరుతూ జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మేయర్ కొలగాని శ్రీనివాస్, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు పాల్గొని కార్మికులకు సంఘీభావం తెలిపారు. కార్మికులకు ఈఎస్ఐ ఆసుపత్రి, కార్మిక భవనం, ఇందిరమ్మ ఇళ్లు, ద

'కార్మిక బంధు' పథకం, ఆసరా పెన్షన్, స్థానికులకు ఉపాధి రక్షణ వంటి డిమాండ్లను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని వారు కోరారు. కార్మికుల సమస్యలు పరిష్కరించే వరకు తమ పూర్తి మద్దతు కొనసాగుతుందని హామీ ఇచ్చారు.

03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పొ. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

# 61 కోట్లు దాటిన డిజిటల్ పేమెంట్స్


**హైదరాబాద్ జూలై 13 పెన్ పవర్:** స్మార్ట్‌ఫోన్లలో ఉండే బయోమెట్రిక్ అథెంటికేషన్ (ఆన్-డివైస్) ఆధారంగా జరిగిన యూపీఐ పేమెంట్లు 2026 జూన్ నెలలో 61.1 కోట్లు దాటాయి. ఈ మొత్తం లావాదేవీల విలువ రూ. 25,416 కోట్లుగా నమోదైంది. రోజువారీ అవసరాల కోసం ప్రజలు ఈ విధానాన్ని ఎంతగానో ఆదరిస్తున్నారని ఈ గణాంకాలు చెబుతున్నాయి. ఈ ఫీచర్ ద్వారా వినియోగదారులు తమ స్మార్ట్‌ఫోన్‌లోని ఫింగర్‌ప్రింట్ లేదా ఫేషియల్ రికగ్నిషన్ ఉపయోగించి ఖా× పేమెంట్లను సులభంగా పూర్తి చేయవచ్చు.యూపీఐ వినియోగదారులు తమ రోజువారీ చెల్లింపుల కోసం బయోమెట్రిక్ ఆధారిత అథెంటికేషన్ ఎక్కువగా ఎంచుకుంటున్నారు. ఇది డిజిటల్ చెల్లింపుల రంగంలో మరింత వేగవంతమైన, సరళమైన మరియు సులువైన పద్ధతి వైపు మారుతున్న కాలానికి సంకేతంగా నిలుస్తోంది. ఈ ఫీచర్ వ్యక్తుల మధ్య జరిగే చెల్లింపులకు , అలాగే వ్యాపారులకు చేసే చెల్లింపులకు కూడా సపోర్ట్ చేస్తుంది. దీనివల్ల నిత్యం చేసే చెల్లింపులు మరింత వేగంగా, సులువుగా పూర్తవుతున్నాయి.ఈ బయోమెట్రిక్ అథెంటికేషన్ సదుపాయం రూపే క్రెడిట్ కార్డ్ ఆన్ యూపీఐ లావాదేవీలకు కూడా అందుబాటులో ఉంది. దీనివల్ల యూపీఐ పిన్ అవసరం లేకుండానే క్రెడిట్ కార్డ్ ద్వారా పేమెంట్లు చేయవచ్చు. సాధారణంగా సేవింగ్స్ ఖాతా నుండి యూపీఐ పేమెంట్ చేసేటప్పుడు ఉండే అదే వేగం, సౌకర్యాన్ని ఇది క్రెడిట్ కార్డ్ లావాదేవీలకు కూడా అందిస్తుంది."బయోమెట్రిక్ విధానానికి పెరుగుతున్న ఆదరణను చూస్తుంటే, యూపీఐ వినియోగదారులు సులభమైన, వేగవంతమైన పేమెంట్ అనుభవాలకే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నారని అర్థమవుతోంది. జూన్ నెలలోనే రికార్డు స్థాయిలో 60 కోట్లకు పైగా లావాదేవీలు నమోదు కావడం విశేషం. రూపే క్రెడిట్ కార్డ్ ఆన్ యూపీఐతో సహా అన్ని రకాల చెల్లింపుల్లోనూ ఈ విధానానికి మంచి స్పందన వస్తోంది. ఇప్పటికే పలు బ్యాంకులు, యూపీఐ యాప్‌లు తమ కస్టమర్లకు బయోమెట్రిక్ సదుపాయాన్ని అందిస్తున్నాయి. రాబోయే రోజుల్లో సురక్షితమైన, సౌకర్యవంతమైన ఈ పద్ధతిని ఎంచుకునే వారి సంఖ్య మరింత పెరుగుతుందని భావిస్తున్నాము" అని ఎన్‌పీసీఐ గ్రోత్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సోహిని రాజోలా అన్నారు.స్మార్ట్‌ఫోన్‌లోని వేలిముద్ర లేదా ఫేస్ లాక్ వాడటం ద్వారా, వినియోగదారులకు యూపీఐ పిన్ గుర్తుపెట్టుకోవాల్సిన లేదా ఎంటర్ చేయాల్సిన అవసరం తగ్గుతుంది. ఇది లావాదేవీలను చాలా వేగంగా పూర్తి చేయడమే కాకుండా, పేమెంట్లు ఫెయిల్ అవ్వకుండా

సక్సెస్ రేటును పెంచుతుంది.వివిధ బ్యాంకులు, యూపీఐ యాప్ లలో ఈ సదుపాయం విస్తరిస్తుండటంతో, భారతీయుల రోజువారీ చెల్లింపుల శైలిలో బయోమెట్రిక్ కీలక పాత్ర పోషించనుంది. రాబోయే నెలల్లో కూడా ఈ ఫీచర్‌కు ఆదరణ మరింత పెరుగుతుందని ఎన్‌పీసీఐ ఆశిస్తోంది. ఇది సురక్షితమైన, ఎలాంటి అడ్డంకులు లేని డిజిటల్ చెల్లింపుల రంగంలో యూపీఐ స్థానాన్ని మరింత బలోపేతం చేస్తుంది

# గంగాధర మండల మహిళా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలిగా చిరుత మంగ

**నియామకపు పత్రం అందజేసిన ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం**

**హైదరాబాద్ పెన్ పవర్:**
జిల్లా కాంగ్రెస్ పార్టీ కమిటీ అధ్యక్షుడు, చొప్పదండి నియోజకవర్గం ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం సూచన మేరకు గంగాధర మండల కేంద్రానికి చెందిన చిరుత మంగను మహిళా కాంగ్రెస్ పార్టీ కమిటీ గంగాధర మండల అధ్యక్షురాలిగా నియమిస్తూ మహిళా కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు కర్ర సత్యప్రసన్న ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా సోమవారం కరీంనగర్ జిల్లా గంగాధర ప్రజా కార్యాలయంలో నియామకపు పత్రాన్ని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం చిరుత మంగకు అందజేశారు.అనంతరం ఆమె మాట్లాడుతూ ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ఆధ్వర్యంలో గంగాధర మండలంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు. మండల మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలిగా తనకు అవకాశం కల్పించిన సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, మంత్రి పొన్నం ప్రభాకర్, జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం కు, మహిళా కాంగ్రెస్ కమిటీ జిల్లా అధ్యక్షురాలు కర్ర సత్యభ ప్రసన్న, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మంత్రి మహేందర్, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా మహిళా అధ్యక్షురాలు కర్ర సత్య ప్రసన్నారెడ్డి , కాంగ్రెస్ పార్టీ మండల



అధ్యక్షుడు మంత్రి మహేందర్,సింగిల్ విండో చైర్మన్ వెలిచాల తిర్మల్ రావు,జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు పురుమల్ల మనోహర్,మాజీ జెడ్పిటిసి సత్తు కనకయ్య,సర్పంచ్ ల ఫోరమ్ మండల అధ్యక్షులు ముద్దం నగేష్,సర్పంచ్ లు రేండ్ల శ్రీనివాస్,లింగాల లింగయ్య,పడాల రాజన్న,కాంగ్రెస్ పార్టీ నాయకులు గుజ్జుల బాపు రెడ్డి,పడితపల్లి కిషన్,కంకణాల రాజ గోపాల్ రెడ్డి,కర్ర బాపు రెడ్డి,రాచమల్ల,భాస్కర్, మేర్జ కొండయ్య,తోట సంధ్య,పిల్లి మహేష్,సాయిని ఐలయ్య,తాళ్ల శ్రీనివాస్,తాళ్ల సురేష్, సంపత్,దాతు అంజి కార్యకర్తలు మహిళలు పాల్గొన్నారు.

# హత్య కేసులో నిందితుడి అరెస్ట్




**హుజూరాబాద్ టౌన్, జూలై 13 పెన్ పవర్:** హుజూరాబాద్ లోని మామిండ్లవాడకు చెందిన చింత సునీత(35) హత్య కేసులో నిందితుడిని అరెస్ట్ చేసినట్లు హుజూరాబాద్ ఏసిపి వాసంశెట్టి మాధవి సోమవారం తెలిపారు. హత్య జరిగిన కేవలం 36 గంటల్లోనే ఈ కేసును చేయించినట్లు వివరించారు. సోమవారం హుజూరాబాద్ పోలీసు స్టేషన్ లో హత్య కేసు వివరాలను ఆమె వెల్లడించారు. హుజూరాబాద్ మండలం పోతిరెడ్డిపేట గ్రామానికి చెందిన చింత సునీత (35) గత కొంతకాలంగా హుజూరాబాద్ మామిండ్లవాడలో నివాసం ఉంటుంది. ఆమె భర్త కుమార్ మృతి చెందగా, గత ఐదు సంవత్సరాలుగా మోతే కిరణ్ తో సహజీవనం చేస్తుంది. వీరిద్దరు మామిండ్లవాడ గ్యాస్ గోదాం సమీపంలో ఓ అద్దె ఇంటిలో నివాసం ఉంటున్నారు. సునీత తన పక్కన ఉన్న ఇంట్లో ముతోజు భాగ్య అనే మహిళతో స్నేహం పెంచుకుందన్నారు. తరచూ వీరిద్దరు కలిసి తిరుగుతుండటంతో సునీత వ్యభిచారం చేస్తుందనే అనుమానం కిరణ్ కలిగిందన్నారు. ఈ అనుమానంతో ఇద్దరి మధ్య తరచూ గొడవలు జరుగుతుండేవన్నారు. ఈ నెల 10న కిరణ్, సునీత ఇద్దరు కలిసి మద్యం సేవింవారన్నారు. ఇదే విషయమై మళ్లి గొడవ జరగడంతో ఆగ్రహానికి గురైన కిరణ్ ముందుగా సునీత గొంతును చేతులతో పిసికి, అనంతరం చిర ముక్కతో గొంతు బిగించి, కాలితో మెడపై తొక్కి హత్య చేశాడన్నారు. ఎవరికి తనపై అనుమానం రాకుండా ఉండేందుకు సునీత మృతదేహాన్ని ఎత్తుకొని వెళ్లి తన స్నేహితురాలైన ముతోజు భాగ్య ఇంటి సమీపంలోని బావిలో పడేశాడన్నారు. సునీత ధరించిన లో దుస్తులు (ప్యాంట్, డ్రాయర్) ను బావికి సమీపంలోని చెట్టు వద్ద పడవేసి, అక్కడి నుంచి పరారై కరీంనగరకు వెళ్లిపోయాడని పేర్కొన్నారు. సిఐ కరుణాకర్ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఈ నెల 13న సోమవారం హుజూరాబాద్ కు తిరిగి వచ్చాడనే పక్కా సమాచారం అందటంతో నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారించగా, స్వచ్ఛందంగా నేరాన్ని ఒప్పుకున్నాడన్నారు. సంఘటన జరిగిన ఇంటిని, మృతదేహాన్ని పడవేసిన బావిని, దుస్తులు పడవేసిన స్థలాన్ని చూపించాడన్నారు. సంఘటన స్థలం నుంచి పగిలిన గాజులు, గాజు ముక్కలు, పుస్తెల పూసలు, కాలి పట్టి తదితర కీలక ఆధారాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నామన్నారు. అలాగే బావి సమీపంలో పడవేసిన మృతురాలి లో దుస్తులను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అరెస్ట్ చేసి న్యాయస్థానంలో హాజరుపరచగా, కేసు దర్యాప్తు కొనసాగుతోందని వివరించారు. మహిళ హత్య కేసును కేవలం 36 గంటల్లోనే ఛేదించి నిందితుడిని పట్టుకున్నామన్నారు. సిఐ కరుణాకర్, ఎస్ఐ లు రవి, శ్రీనివాసరావు, సిబ్బంది మోహన్, అవినాష్, మహేందర్, శ్రీధర్, అనిల్ లను ఏసిపి అభినందించారు.

# నిదానంగా సాగుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియ

**విజయవాడ, జూలై 13, పెన్ పవర్:** రాష్ట్రంలో ప్రస్తుతం కొనసాగుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియ ఆశించిన వేగంతో ముందుకు సాగడం లేదనే చర్చ రాజకీయ వర్గాల్లో కొనసాగుతోంది. ఎన్నికల సంఘం నిర్దేశించిన గడువు ముగియడానికి కొద్ది రోజులు మాత్రమే మిగిలి ఉన్నప్పటికీ, నమోదవుతున్న స్పందన ఆశించిన స్థాయికి చేరుకోలేదని సమాచారం. దీంతో అధికార పార్టీతో పాటు ప్రతిపక్ష పార్టీలు కూడా ఈ పరిణామాలను ఆసక్తిగా గమనిస్తున్నాయి.అధికారుల సమాచారం ప్రకారం, ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా నమోదైన పురోగతి 50 శాతం మార్కును దాటలేదని తెలుస్తోంది. కొన్ని ప్రాంతాల్లో మాత్రం ఈ శాతం మరింత తక్కువగా ఉండటం ఆందోళన కలిగిస్తోంది. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలు, గిరిజన ప్రాంతాల్లో ఓటర్ల వివరాల సేకరణ ప్రక్రియ నెమ్మదిగా సాగుతోందని చెబుతున్నారు. దీంతో నిర్ణయించిన గడువులోపు పూర్తి స్థాయిలో ప్రక్రియ పూర్తవుతుందా లేదా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.నగర ప్రాంతాల్లో పరిస్థితి కొంత మెరుగ్గా ఉన్నప్పటికీ అక్కడ కూడా ఆశించిన స్థాయిలో స్పందన కనిపించడం లేదని అధికారులు చెబుతున్నారు. ఎన్నికల సంఘం ఇంటింటికీ అవసరమైన దరఖాస్తు ఫారాలను పంపిణీ చేసినప్పటికీ, వాటిని పూర్తి వివరాలతో తిరిగి సమర్పించే విషయంలో ఓటర్ల నుంచి స్పందన తక్కువగా ఉందని తెలుస్తోంది. ఈ కారణంగా మొత్తం ప్రక్రియ మందగించినట్లు అధికారులు అభిప్రాయపడుతున్నారు.రాజకీయ పార్టీల దృష్టిలో ఈ ప్రక్రియకు ప్రత్యేక ప్రాధాన్యం ఉంది. ఎందుకంటే ఓటరు జాబితాలో పేర్లు సక్రమంగా నమోదు కావడం ఎన్నికల సమయంలో కీలక అంశంగా మారుతుంది. అందుకే అన్ని పార్టీలు తమ తమ కార్యకర్తల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించి ఫారాలు సకాలంలో సమర్పించేలా చూడాల్సిన అవసరం ఉందని రాజకీయ విశ్లేషకులు సూచిస్తున్నారు.క్షేత్రస్థాయిలో పరిశీలిస్తే చాలా మంది ఓటర్లకు ఈ ప్రక్రియపై పూర్తి అవగాహన లేదని తెలుస్తోంది. ఫారాలు ఎలా నింపాలి, ఎవరికి ఇవ్వాలి, ఏ పత్రాలు అవసరం, పాత ఓటరు జాబితాలో పేరు లేకపోతే ఏం చేయాలి వంటి విషయాల్లో ఇంకా సందిగ్ధత కొనసాగుతోందని సమాచారం. ఈ పరిస్థితిని అధిగమించాలంటే అధికారులు, రాజకీయ పార్టీలు, స్థానిక సిబ్బంది కలిసి ప్రజలకు స్పష్టమైన సమాచారం అందించాల్సిన అవసరం ఉందని భావిస్తున్నారు.ప్రత్యేకించి 2002 నాటి ఓటరు జాబితాలో పేరు ఉన్నవారు, లేనివారు అనుసరించాల్సిన విధానం గురించి కూడా ప్రజలకు స్పష్టత కల్పించాల్సిన అవసరం ఉందని నిపుణులు చెబుతున్నారు. అవసరమైన పత్రాలను ముందుగానే సిద్ధం చేసుకుని, గడువు ముగిసేలోపు దరఖాస్తులు పూర్తి చేస్తే భవిష్యత్తులో ఇబ్బందులు ఎదురుకాకుండా ఉంటాయని సూచిస్తున్నారు.గడువు ముగిసే వరకు మిగిలిన రోజుల్లో నమోదు ప్రక్రియను వేగవంతం చేయడంపై అధికారులు దృష్టి సారిస్తున్నట్లు తెలుస్తోంది. అదే సమయంలో రాజకీయ పార్టీలు కూడా తమ కార్యకర్తలను మరింత చురుకుగా రంగంలోకి దించి ప్రజలకు అవగాహన కల్పించే ప్రయత్నాలు ప్రారంభించే అవకాశం ఉందని భావిస్తున్నారు.మొత్తంగా చూస్తే, ఓటరు నమోదు ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేయాలంటే ప్రజల భాగస్వామ్యం అత్యంత కీలకం. సరైన సమాచారం, అవసరమైన పత్రాలు, సమయానికి దరఖాస్తుల సమర్పణ వంటి అంశాలపై ప్రతి ఓటరు అప్రమత్తంగా ఉంటేనే ఈ ప్రక్రియ పూర్తిస్థాయిలో విజయవంతమవుతుంది. లేకపోతే తుది ఓటరు జాబితాపై ప్రభావం పడే అవకాశం ఉందని పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు.

# ఏజెన్సీ ప్రాంతాలపై జనసేన కన్ను

**విశాఖపట్టణం, జూలై 13, పెన్ పవర్:** ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో ఏజెన్సీ ప్రాంతాలపై అధికార కూటమి ప్రత్యేక దృష్టి సారించినట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. గత ఎన్నికల ఫలితాలను విశ్లేషించిన తర్వాత గిరిజన నియోజకవర్గాల్లో పార్టీ బలాన్ని మరింత పెంచాలని ప్రభుత్వం వ్యూహాత్మకంగా ముందుకు సాగుతోందని చెబుతున్నారు. ముఖ్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ బాధ్యతలో కీలక పాత్రను ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కు అప్పగించినట్లు ప్రచారం జరుగుతోంది.ఏజెన్సీ ప్రాంతాల్లో గిరిజన ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడంపై ప్రభుత్వం దృష్టి పెట్టిందని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ శాఖల బాధ్యతలు నిర్వహిస్తున్న పవన్ కళ్యాణ్ ఇటీవల ఎక్కువగా గిరిజన ప్రాంతాల్లో పర్యటిస్తూ స్థానిక సమస్యలను నేరుగా తెలుసుకుంటున్నారని సమాచారం. రహదారులు, తాగునీరు, విద్యుత్, మౌలిక వసతుల అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని చెబుతున్నారుప్రత్యేకించి ఎన్నో దశాబ్దాలుగా సరైన రోడ్డు సౌకర్యం లేని గిరిజన గ్రామాలకు రహదారులు నిర్మించేందుకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని తెలుస్తోంది. "అడవి తల్లి బాట" వంటి కార్యక్రమాల ద్వారా మారుమూల ప్రాంతాలను ప్రధాన రహదారులతో అనుసంధానం చేసే పనులు వేగవంతం చేసినట్లు అధికార పార్టీ నేతలు చెబుతున్నారు. ఈ చర్యలతో గిరిజన ప్రాంతాల్లో అభివృద్ధిపై ప్రజల్లో సానుకూల స్పందన పెరుగుతుందని కూటమి నాయకులు భావిస్తున్నారు.అభివృద్ధితో పాటు గిరిజనులు ఎదుర్కొంటున్న ఇతర సమస్యల పరిష్కారంపైనా ప్రభుత్వం దృష్టి పెట్టినట్లు సమాచారం. ముఖ్యంగా అడవి ప్రాంతాల్లో ఏనుగుల సంచారం వల్ల పంటలు, ఆస్తులకు కలుగుతున్న నష్టాన్ని తగ్గించే చర్యలు, విద్యుత్ సౌకర్యాల విస్తరణ, గ్రామీణ కనెక్టివిటీ పెంపు వంటి అంశాలపై సంబంధిత శాఖలు పనిచేస్తున్నాయని చెబుతున్నారు. ఈ కార్యక్రమాల ద్వారా స్థానిక ప్రజలతో మరింత సన్నిహిత సంబంధాలు



ఏర్పడతాయని అధికార పార్టీ అంచనా వేస్తోంది.రాజకీయంగా పరిశీలిస్తే, 2009 నుంచి ఏజెన్సీ నియోజకవర్గాల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభావం ఎక్కువగా కొనసాగిందని ఎన్నికల ఫలితాలు సూచిస్తున్నాయి. ముఖ్యంగా 2019 అసెంబ్లీ ఎన్నికల్లో ఈ ప్రాంతాల్లో తెలుగుదేశం పార్టీ ఆశించిన ఫలితాలు సాధించలేకపోయింది. 2024 ఎన్నికల్లో రాష్ట్రవ్యాప్తంగా కూటమి మంచి ఫలితాలు సాధించినప్పటికీ, అరకు పార్లమెంట్ స్థానం మాత్రం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఖాతాలోకి వెళ్లడం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది.ఈ పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని వచ్చే ఎన్నికల నాటికి ఏజెన్సీ ప్రాంతాల్లో పార్టీ బలాన్ని పెంచుకోవాలనే లక్ష్యంతో కూటమి ముందుకు సాగుతోందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ప్రజలకు చేరువయ్యే అభివృద్ధి కార్యక్రమాలు, స్థానిక సమస్యల పరిష్కారం, గిరిజన సంక్షేమంపై ప్రత్యేక దృష్టి వంటి అంశాల ద్వారా ప్రజల్లో విశ్వాసం పెంపొందించాలని అధికార పార్టీ ప్రయత్నిస్తున్నట్లు చెబుతున్నారు.మరోవైపు విపక్షం కూడా ఈ ప్రాంతాల్లో తన బలాన్ని నిలబెట్టుకునేందుకు ప్రయత్నాలు కొనసాగిస్తోంది. దీంతో రానున్న రోజుల్లో ఏజెన్సీ నియోజకవర్గాలు రాష్ట్ర రాజకీయాల్లో మరింత కీలకంగా మారే అవకాశం ఉందని రాజకీయ పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. అభివృద్ధి, సంక్షేమం, ప్రజా సమస్యల పరిష్కారం వంటి అంశాలే భవిష్యత్ ఎన్నికల్లో ఈ ప్రాంత ఓటర్ల తీర్పును ప్రభావితం చేసే ప్రధాన అంశాలుగా నిలిచే అవకాశముందని భావిస్తున్నారు.

# హోంశాఖపై అసంతృప్తులు...

**కాకినాడ, జూలై 13, పెన్ పవర్:** కూటమిలో కొద్దిపాటి కుదుపు.. హోం శాఖ తీరుపై బహిరంగంగానే అసంతృప్తి వ్యక్తం చేస్తున్న డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పోలీసులపై కినుక వహించారని తెలుస్తోంది. సోషల్ మీడియా కేసుల విషయంలో దూకుడుగా వ్యవహరించాలంటూ పోలీసు శాఖలోని టాప్ బాస్‌ల దృష్టికి తీసుకెళ్లినా ఆశించిన రెస్పాన్స్ రావడం లేదని ఆయన ఆగ్రహంగా ఉన్నాట.కొన్ని రోజులుగా ఆంధ్రప్రదేశ్‌లో రావణ్ అంశం నడుస్తోంది. ఓ సమావేశంలో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడం.. దానికి జనసైనికులు ఆగ్రహం చెందడం.. ఆ తర్వాత రాష్ట్ర వ్యాప్తంగా చాలా చోట్ల కేసులు నమోదు కావడం జరిగింది. ఆ తర్వాత నిషేధిత సంస్థల ఐడియాలజీని ప్రోత్సహించేలా.. వీడియోలు రూపొందించారన్న విషయంపై రావణ్‌పై ఊపా చట్టం కింద కేసు నమోదు చేసే వరకూ అది దారితీసింది.ఈ విషయానికే కొంత ఇబ్బందికర పరిస్థితి ఉన్న తరుణంలో.. ఇప్పుడు కూటమికి మరో సమస్య వచ్చింది.సోషల్‌మీడియాలో చేస్తున్న వ్యాఖ్యలు, తనపైన కానీ ప్రభుత్వంపైన కానీ.. సోషల్ హార్మోనీని దెబ్బతీసేలా పనిచేస్తున్న వారి విషయంలో కానీ పోలీసులు అనుకున్నంత వేగంగా.. స్పష్టంగా పనిచేయడం లేదని పవన్ కళ్యాణ్ భావిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. ప్రశ్న రావణ్ ఒక్కరే కాదు.. మరికొందరిపై కూడా కేసులు నమోదు చేయాలన్నది ఆయన అభిమతమని.. ఆ విషయంలో పోలీసు శాఖ చొరవ చూపిచడం లేదన్న అసంతృప్తి ఆయనలో ఉంది. ఈ విషయాన్ని ఆయన నేరుగా ఓ పోలీసు ఉన్నతాధికారినే అడిగారని కూడా తెలుస్తోంది. విశ్వసనీయంగా తెలిసిన విషయం ప్రకారం ఆయన చాలా సీరియస్‌గానే దీనిపై మాట్లాడారని.. కానీ పోలీసుల నుంచి తాను ఆశించిన సమాధానం రాలేదని తెలిసింది. దీనికి పవన్ కళ్యాణ్ నొచ్చుకున్నారని చెబుతున్నారు. ఆ తర్వాత దానిని సర్దుబాటు చేయడానికి జనసేన– టీడీపీ నుంచి రెండు వైపులా ప్రయత్నాలు జరిగాయి. పోలీసులు ఈ విషయంలో మరింత దూకుడుగా లేకపోవడానికి కారణం.. చర్యలు తీసుకోవాల్సిన వ్యక్తులు తెలంగాణలో ఉండటం. ఇప్పటికే రావణ్, జర్నలిస్ట్ KVR అరెస్టుల వ్యవహారం తెలంగాణలో రచ్చకు దారితీసింది. ఏపీ పోలీసులు ఇష్టారాజ్యంగా వచ్చి ఇక్కడ నుంచి మనుషులు తీసుకెళ్తున్నారంటూ.. పొలిటికల్ పంచాయతీ నడిచింది. ఇప్పుడు ఇంకో స్టెప్ ముందుకు వేస్తే అది అనవసరంగా ఇబ్బందులకు దారితీస్తుందని వారు భావిస్తున్నారు. సాధారణంగా అరుదుగా నమోదు చేసే ఊపా చట్టాన్ని రావణ్‌పై పెట్టడంపై చర్చ నడుస్తోంది. దీనికి సరైన జస్టిఫికేషన్ పోలీసులు ఇవ్వాల్సి ఉంటోంది. చాలా మంది మాజీ IPS, ప్రజా సంఘాల వారు ఈ చర్యను తప్పు పడుతున్నారు. దీనిపై విజయవాడలో రౌండ్ టేబుల్ మీటింగ్ జరిగింది. ఊపాని రాజకీయ ప్రయోనాల కోసం వాడుతున్నారన్న భావనను ఈ సమావేశం వ్యక్తం చేసింది. ఈ పరిస్థితులన్నీ ప్రభుత్వం, పోలీసు శాఖపైన ఒత్తిడి పెంచుతున్నాయి. ఇప్పుడు కొత్త తలనొప్పులు తలకెత్తుకోవడం ఎలా అని.. పోలీసు శాఖ అనుకుంటోంది. అదే సమయంలో ప్రభుత్వంలో భాగస్వామిగా ఉన్న పార్టీని ఒప్పించడం సవాల్‌గానే ఉంది. కూటమి ప్రభుత్వంలో ఇంతకు ముందు కూడా ఇలాంటి సిచ్యువేషన్స్ ఎదురయ్యాయి. వాటిని చంద్రబాబు, పవన్ కళ్యాణ్ క్లియర్ చేసుకుని వచ్చారు. పవన్ కళ్యాణ్ తన సర్జరీ కోసం ముంబై వెళ్లడంతో ఇవాళ కేబినెట్ మీటింగ్ కు హాజరుకాలేదు. ఇది ముందుగానే షెడ్యూల్ అయిన విషయం అయినా ఈ టైమ్‌లోనే ఇలా జరగడం కూడా కూటమిలో కొంచం కుదుపుకు కారణం అయింది.

## 17న రాయపాడు స్టేషన్ శుభారంభం...

**విజయవాడ, జూలై 13, పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్‌లో కొత్త రైల్వేస్టేషన్ అందుబాటులోకి రానుంది. విజయవాడ శివారు ప్రాంతంలోని రాయనపాడు రైల్వేస్టేషన్ జూలై 17వ తేదీ నుంచి అందుబాటులోకి రానుంది. జూలై 17న రైల్వేస్టేషన్ ప్రారంభించేందుకు అధికారులు ముహూర్తం ఖరారు చేశారు. విజయవాడ రైల్వేస్టేషన్‌పై రద్దీ పడుతున్న నేపథ్యంలో.. ఆ ప్రభావం తగ్గించేందుకు రాయనపాడును శాటిలైట్ స్టేషన్‌గా అభివృద్ధి చేశారు. అమృత్ భారత్ స్టేషన్ల పథకం కింద రూ.35 కోట్లతో ఆధునికీకరణ చేపట్టారు రైలు ప్రయాణికులకు గుడ్ న్యూస్.. ఏపీలో కొత్త రైల్వేస్టేషన్ అందుబాటులోకి రానుంది. విజయవాడ సమీపంలోని రాయనపాడు రైల్వేస్టేషన్ జూలై 17న ప్రారంభం కానుంది. విజయవాడ రైల్వేస్టేషన్‌పై రద్దీ తగ్గించేందుకు రాయనపాడు రైల్వేస్టేషన్‌ను శాటిలైట్ స్టేషన్‌గా విజయవాడ శివారు ప్రాంతంలో అభివృద్ధి చేశారు. అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద రూ. 35 కోట్లు ఖర్చు చేసి రాయనపాడు రైల్వేస్టేషన్‌లో ఆధునికీకరణ పనులు చేపట్టారు. పనులు పూర్తి కావటంతో జూలై 17వ తేదీ రాయనపాడు రైల్వేస్టేషన్ ఆరంభించేందుకు ముహూర్తం ఖరారైంది.మరోవైపు అమృత్ భారత్ స్టేషన్ల పథకం కింద రాయనపాడు రైల్వేస్టేషన్‌లో ప్లాట్‌ఫామ్‌లు ఆధునీకరించారు. రైలు ప్రయాణికుల కోసం విశ్రాంతి గదులు ఏర్పాటు చేశారు. టికెట్ కౌంటర్లు, టాయిలెట్స్ తీర్చిదిద్దారు. ఆర్వో తాగునీటి సౌకర్యాన్ని కల్పించారు. అలాగే రైలు స్టేషన్ మాస్టర్, ఇతర సిబ్బంది కోసం రైల్వేస్టేషన్‌లో గదులు నిర్మించారు. రైల్వేస్టేషన్ ఎంట్రీతో పాటు మొత్తం ప్రాంగణమంతా పచ్చదనం ఉండేలా తీర్చిదిద్దారు. ఇక్కడ ఇంకో విశేషం ఏమిటంటే స్థానిక ప్రత్యేకతను ప్రయాణికులకు పరిచయం చేసేలా కొండపల్లి బొమ్మల పెయింటింగ్స్ వేశారు.మరోవైపు రాయనపాడు రైల్వేస్టేషన్ మీదుగా ప్రస్తుతం రోజూ 12 రైళ్ల వరకూ రాకపోకలు సాగిస్తున్నాయి. రాబోయే రోజులలో రాయనపాడు రైల్వేస్టేషన్ మీదుగా మరిన్ని రైళ్లను నడపనున్నారు. ఈ నేపథ్యంలోనే ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా రూ.5.77 కోట్లతో ఆధునిక టాయిలెట్లు, ఏసీ ప్రీపెయిడ్ వెయిటింగ్ హాల్ నిర్మించారు.దివ్యాంగుల కోసం మరుగుదొడ్లు నిర్మించారు. రూ.13.33 కోట్లతో ప్లాట్‌ఫామ్‌ల ఆధునికీకరణ.. దివ్యాంగులకు అనువుగా టాక్టైల్ పాత్ ఏర్పాటు చేశారు. ఫుట్‌ఓవర్ బ్రిడ్జ్, రెండు లిఫ్టులు, రైల్వేస్టేషన్ చుట్టూ ప్రహరీ గోడ నిర్మాణం చేపట్టారు. ఆధునిక సదుపాయాలు, హైటెక్ హంగులతో తీర్చిదిద్దిన రాయనపాడు రైల్వేస్టేషన్ జూలై 17న ప్రారంభం కానుంది. ఈ రైల్వేస్టేషన్ అందుబాటులోకి వస్తే విజయవాడ రైల్వేస్టేషన్ మీద ఒత్తిడి తగ్గుతుందని అధికారులు భావిస్తున్నారు. అందుకే వేగంగా పనులు పూర్తి చేసి ప్రారంభోత్సవానికి సిద్ధమయ్యార్నః

## ఆ ఇల్లే అందరికి ఆదర్శం

**అనంతపురం, జూలై 13, పెన్ పవర్:** అనంతపురం జిల్లా కళ్యాణదుర్గం మండలం కుర్లపల్లిలోని నాగప్ప కుటుంబం ఇప్పుడు అందరికీ ఆదర్శంగా నిలుస్తోంది. ఆరు తరాలుగా 80 మందికిపైగా కుటుంబ సభ్యులు కలిసి ఉంటూ.. ఉమ్మడి కుటుంబానికి సరైన నిర్వచనం చెప్తున్నారు. ఆ ఇంట్లో పిల్లాపెద్దా అందరూ కలిసి 85 మంది వరకూ ఉంటారు. వీరిలో 25 మంది వరకూ విద్యార్థులే కావడం విశేషం. ఈ కుటుంబానికి వేరువేరు చోట్ల కలిపి 127 ఎకరాల వరకూ భూమి ఉంది. మగాళ్లు అందరూ ఈ భూమిలో సేద్యం పనులు చూస్తుంటారు. వీరందరికీ వేరువేరుగా ఇళ్లు ఉన్నా కూడా.. వంట మొదలుకుని సేద్యపు పనులు, ఆదాయం వరకూ అంతా ఉమ్మడిగానే జరుగుతుంది.నాగప్ప ఉమ్మడి కుటుంబంలో మొత్తం 85 మంది సభ్యులు ఉన్నారు. వీరందరికీ వేర్వేరు ఇళ్లు ఉన్నాయి. అయితే అందరూ కలిసి ఒకేచోట వండుకుంటారు. కుటుంబంలోని మహిళలు అందరూ కలిసి.. ఉమ్మడి కుటుంబం మొత్తానికి కావాల్సిన వంట ఏర్పాట్లు చూస్తారు. ఒకే వంటగదిలో భోజనం తయారుచేస్తారు. కుటుంబం మొత్తానికి సరిపడాలంటే రోజూ 80 కిలోల బియ్యాన్ని వండాల్సి వస్తుందని మహిళలు చెప్తున్నారు. ఇక ఆదివారం రోజులలో నాన్ వెజ్ రుచిచూడాలంటే కనీసం 30 కేజీల మటన్ లేదా చికెన్ కావాల్సిందేనని చెప్తున్నారు. ఉదయం ఐదు గంటలకు మొదలుపెడితే రాత్రి 9 గంటల వరకూ వంటగదిలో పొయ్యి మంట మండాల్సిందేనట.అయితే ఆరు తరాలుగా.. వీరంతా కలిసి ఉండటానికి బావా బావమరుదులు తీసుకున్న నిర్ణయమే కారణమట.. ఆరునూరైనా మనం కలిసే ఉందామంటూ అరవై సంవత్సరాల కిందట తీసుకున్న నిర్ణయమే వీరంతా ఇలా కలిసి ఉండటానికి కారణంగా చెప్తున్నారు. ఈ కుటుంబానికి మూలమైన నాగప్పకు.. ఇద్దరు భార్యలు. పెద్ద భార్యకు ఒకే కుమార్తె. రెండో భార్యకు ఇద్దరు కొడుకులు, ఇద్దరు కుమార్తెలు సంతానం. అయితే తన పిల్లలు అందరూ ఒకేచోట కలిసి ఉండాలనే ఉద్దేశంతో నాగప్ప.. పెద్ద భార్య కూతురికి ఇల్లరికం పెళ్లి చేసి అల్లుడిని ఇంటికి తెచ్చుకున్నాడు. ఈ దంపతులకు నలుగురు మగపిల్లలు సంతానం.వీరిలోని హనుమంతరాయుడు.. నాగప్ప రెండో భార్య కొడుకు ముత్యాలప్ప (బావమరిది) కలిసి తమ తాతగారి మాట ప్రకారం ఉమ్మడి కుటుంబంగా కలిసి ఉండాలని నిర్ణయించుకున్నారు. అప్పటి నుంచి వీరంతా కలిసే ఉంటున్నారు. ఈ ఇంట్లో కూడా ఎక్కువగా ఇల్లరికం వివాహాలే జరుగుతుంటాయి. అలా కొడుకులు, మనవళ్లూ, మనవరాళ్లూ, మునిమనవరాళ్లూ ఇలా అందరూ కలిసి 85 మంది అయ్యారు.ఈ కుటుంబానికి 127 ఎకరాల భూమి ఉంది. అలాగే70 వరకూ గేదెలూ, 40 ఆవులూ, వేయికిపైగా గొర్రెలు, మేకలు ఉన్నాయి. సేద్యం ద్వారా ధాన్యం, కూరగాయలు పండిస్తున్నారు. ఇలా పండించిన వాటిలో కుటుంబ అవసరాలు పోనూ మిగతా వాటిని మార్కెట్లో విక్రయిస్తుంటారు. అలాగే నాలుగు ప్రైవేటు బస్సులను నడుపుతూ.. ఏటా 20 లక్షలు సంపాదిస్తున్నారు. ఇలా వచ్చిన ఆదాయాన్ని ఉమ్మడి కుటుంబం కోసం వెచ్చిస్తున్నారు. ఇక్కడ ఇంకో విశేషం ఏమిటంటే వేయి రూపాయలు దాటిన ఏ ఖర్చుకు అయినా.. కుటుంబ పెద్దలు హనుమంతరాయుడు, ముత్యాలప్పల నిర్ణయం తప్పనిసరి. అలా ఉమ్మడి కుటుంబ వ్యవస్థకు నిలువెత్తు నిదర్శనంగా ఈ ఫ్యామిలీ నిలుస్తోంది.

## పవన్ ట్రాప్ లో జగన్



**నెల్లూరు, జూలై13, పెన్ పవర్:** రాజకీయాలు ఇలానే ఉండాలని లేదు. ఒకే విధంగా ఉంటే వాటిని రాజకీయాలు అనరు. చాణక్య నీతి ఆధారంగా రాజకీయాలు సాగుతూ ఉంటాయి. రాజకీయం అంటేనే పరమపద సోపానం లాంటిది. నిచ్చెనలు.. పాములు.. ఇలా చాలా ఉంటాయి. ఇందులో తెలివిగా వ్యవహరించిన వారు మాత్రమే పరమపద సోపానంలో విజయం సాధించగలుగుతారు.గతంలో ఏపీ రాజకీయాలలో వైసీపీ అధినేత రకరకాల చక్రవ్యూహాలు రచించేవారు. ఆయన వెంట నాడు విజయసాయిరెడ్డి.. వంటి నాయకులు ఉండేవారు. వారు తమ బుర్రకు పదును పెట్టి ఆలోచనలు చేసేవారు. వాటిని జనంలోకి తీసుకెళ్లేవారు జగన్. తద్వారా నాడు టిడిపి ప్రభుత్వానికి.. జనసేన పార్టీకి ఇబ్బందికరమైన వాతావరణం కలిగించేవారు. జగన్ వేసిన ఉచ్చులలో ప్రధానంగా వారు చిక్కుకునేవారు. 2019 ఎన్నికల్లో జరిగింది అదే. అందువల్లే జగన్ ఏకపక్షంగా అధికారంలోకి రాగలిగారు.జగన్ అధికారంలోకి వచ్చిన తర్వాత.. టిడిపి తరఫున మహాసేన రాజేష్ సోషల్ మీడియాలో గట్టిగా మాట్లాడేవారు. నాడు మహాసేన రాజేష్ పవన్ కళ్యాణ్.. జగన్ ను విమర్శించేవారు. చంద్రబాబును ఒక్క మాట కూడా అనేవారు కాదు. ఇటీవలి ప్రశ్న రావణ్ కూడా ఏపీ సీఎం, ఐటీ మంత్రిని ఒక్క మాట అనలేదు. కేవలం పవన్ కళ్యాణ్ మీద మాత్రమే దాడి చేసేవారు. ఇష్టానుసారంగా మాట్లాడేవారు. జడ శ్రావణ్ కూడా జన సేన అధినేత ను టార్గెట్ చేసుకొని విమర్శించేవారు.. అయితే ఎన్నడూ కూడా ఏపీ సీఎం, ఆయన కుమారుడిని విమర్శించే వారు కాదు.రావణ్.. జడ శ్రావణ్ వ్యవహార శైలి రోజురోజుకు దారుణంగా మారుతున్న నేపథ్యంలో..పవన్ కళ్యాణ్ పై. తీవ్రస్థాయిలో విమర్శలు చేస్తున్న నేపథ్యంలో.. జనసేన నాయకులకు కడుపు రగిలిపోయింది. పవన్ కళ్యాణ్ నుంచి ఆదేశాలు రావడంతో వారు కేసులు పెట్టడం మొదలుపెట్టారు. ఫలితంగా పోలీసులు కేసులు కట్టి రావణ్ మీద చర్యలు తీసుకోవడం మొదలుపెట్టారు. ఒకరకంగా పోలీసులకు అరెస్ట్ చేసే పరిస్థితి మాత్రమే కల్పించి.. తాను ఏంటో నిరూపించుకున్నారు పవన్. ఈ విషయంలో టిడిపికి కూడా పవన్ కళ్యాణ్ మాటకు ఊ కొట్టడం తప్ప మరో మార్గం లేకుండా పోయింది.పవన్ కళ్యాణ్ గట్టిగా నిలబడడంతో రావణ్ లాంటివాళ్ళు ఇప్పుడు నోరు మూసుకొని కూర్చున్నారు. వాస్తవానికి ఇక్కడ రావణ్ లేదా శ్రవణ్ వల్ల వైసీపీకి పెద్దగా ఉపయోగం లేదు. ఎందుకంటే వైసీపీకి దళిత క్రైస్తవులు ఓట్లు ఆల్రెడీ ఉన్నాయి. మొదటి ఎన్నికల్లో కొంత మాత్రమే తగ్గాయి. ఎస్సీ.. ఎస్టీలు కూడా జగన్మోహన్ రెడ్డికి అండగా ఉన్నారు. అలాంటప్పుడు శ్రావణ్ విషయంలో.. రావణ్ విషయంలో జగన్ ఎందుకు తొందర పడుతున్నారు.. ఎందుకు ఆయన వకాల్తా పుచ్చుకుంటున్నారో అర్థం కావడం లేదు. పవన్ కళ్యాణ్ వేసిన ట్రాప్ లో పడి జగన్ ఇబ్బంది పడుతున్నారు. ఇదే సమయంలో హిందువుల పట్ల జగన్మోహన్ రెడ్డిని విలన్ లాగా చిత్రీకరించే ప్రయత్నాన్ని పవన్ విజయవంతంగా పూర్తి చేశారు.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001
and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965

# 'వ్యూహం' మార్చుకుంటున్న వైసీపీ?



2029 అసెంబ్లీ ఎన్నికల్లో గెలవాలని లక్ష్యంగా పెట్టుకున్న విపక్ష వైసీపీ 'సరికొత్త వ్యూహం'తో ముందుకు వస్తుందా? అన్న చర్చ జరుగుతోంది. కూటమిలోని మూడు పార్టీలు మళ్లీ కలిసికట్టుగా పోటీ అంటుండటంతో తమ గెలుపునకు సరైన వ్యూహం అవసరమని వైసీపీ గుర్తించిందని చెబుతున్నారు. దీంతో కొత్త రాజకీయ ఎత్తుగడతో ప్రజల ముందుకు రావాలనే ఆలోచనకు ఆ పార్టీ అధిష్టానం వచ్చిందని చెబుతున్నారు. ప్రధానంగా పార్టీకి ఇప్పటివరకు రాజకీయ వ్యూహాలు అందిస్తున్న 'ఐ-ప్యాక్'ను వదిలించుకోవాలని నిర్ణయించుకున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఐ ప్యాక్ స్థానంలో తమిళనాడులోని టీవీకే పార్టీకి వ్యూహకర్తగా పనిచేసిన కపిల్ సాహును వ్యూహకర్తగా నియమించుకోవాలని వైసీపీ భావిస్తోందని చెబుతున్నారు. దీంతో వచ్చే అసెంబ్లీ ఎన్నికలకు వైసీపీ సన్నాహాలు మొదలుపెట్టినట్లేనని అంటున్నారు.రెండేళ్ల క్రితం జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఘోర ఓటమి ఎదుర్కొన్న వైసీపీ మూడేళ్ల తర్వాత జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో ఎట్టి పరిస్థితుల్లోనూ గెలవాలని టార్గెట్ పెట్టుకుంది. ఇందుకోసం అనేక వ్యూహాలను సిద్ధం చేస్తోంది. ఇందులో ప్రధానమైనది పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి పాదయాత్ర ఒకటి అయితే, రెండోది పార్టీకి సరైన ఎన్నికల వ్యూహాలు అందించే బృందంగా భావిస్తున్నారు. 2019 ఎన్నికల్లో ప్రముఖ ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్ కిషోర్ సలహాలు, సూచనలతో రికార్డు విజయాన్ని సొంతం చేసుకున్న వైసీపీ.. గత ఎన్నికల్లో ప్రశాంత్ కిషోర్ బృందంలోని రిషిరాజ్ సింగ్ వ్యూహాలతో బోల్తా కొట్టింది. అయితే ఈ సారి తమిళనాడులో టీవీకే పార్టీని అధికారంలోకి తీసుకువచ్చిన కపిల్ సాహు వైపు చూస్తోందని కొద్దిరోజులుగా విస్తృత ప్రచారం జరుగుతోంది.ప్రశాంత్ కిషోర్ బృందానికే చెందిన కపిల్ సాహు ప్రస్తుతం సొంతంగా పనిచేస్తున్నట్లు చెబుతున్నారు. ప్రధానంగా డిజిటల్ ప్రచారంలో కపిల్ సాహుకు మంచి గుర్తింపు ఉందని చెబుతున్నారు. తమిళనాడులో టీవీకే పార్టీకి రాజకీయ వ్యూహాలు అందించిన కపిల్ సాహు సైలెంట్ గా టార్గెట్ ను కొట్టడమే హాట్ టాపిక్ అవుతోంది. ఎన్నికలకు ముందు ఎటువంటి అంచనాలు లేని టీవీకేని ఏకంగా ప్రభుత్వంలోకి తీసుకురావడానికి కపిల్ సాహు వ్యూహాలు బాగా పనికొచ్చాయని చెబుతున్నారు. రెండు బలమైన ప్రాంతీయ పార్టీలను మట్టి కరిపించి టీవీకేను ఓటర్లకు చేరువ చేయడంలో కపిల్ సాహు సక్సెస్ అయ్యారని అంటున్నారు. ఇదే అంశం వైసీపీని ఆకర్షిస్తోందని అంటున్నారు.కూటమి పార్టీలు కలిసి వుంటే ఓట్లు చీలడం కష్టమనే అభిప్రాయంతో ఉన్న వైసీపీ.. కూటమికి విరుగుడుగా వ్యూహాలు రచించే సరైన స్ట్రాటజిస్టు కోసం అన్వేషిస్తున్న క్రమంలో కపిల్ సాహు పేరు తెరపైకి వచ్చిందని అంటున్నారు. దీంతో ఆయనతో ప్రస్తుతం చర్చలు కొనసాగుతున్నాయని చెబుతున్నారు. కపిల్ సాహుతో ఒప్పందం కుదిరితే రిషిరాజ్ సింగ్ కు చెందిన ఐ-ప్యాక్ స్థానంలో కపిల్ సాహు సెల్ఫ్-ఎంప్లాయిడ్ బృందం తెరపైకి వచ్చే సూచనలు కనిపిస్తున్నాయని చెబుతున్నారు. కాగా, వచ్చే ఎన్నికల్లో గెలుపు కోసం ఎన్నికల వ్యూహకర్తలపైనే ఆధారపడాలా? అన్న ప్రశ్న పార్టీలో విస్తృతంగా వినిపిస్తోంది. క్షేత్రస్థాయిలో పార్టీకి మరమ్మతులు చేయకుండా ఏం చేసినా ఉపయోగం లేదనే వాదన బలంగానే వ్యక్తమవుతోందని చెబుతున్నారు.

# ఏపీలో స్థానిక సమరం.. కీలక అప్డేట్!



ఏపీలో స్థానిక ఎన్నికలకు సంబంధించి ప్రభుత్వం కీలక అప్డేట్ ఇచ్చింది. ఈ ఏడాది సెప్టెంబరు-అక్టోబరు మాసాల్లోనే స్థానిక ఎన్నికలు నిర్వహించేందుకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్టు ప్రభుత్వం క్లారిటీ ఇచ్చేసింది. అంటే.. మరో రెండు మాసాల్లోనే స్థానిక సమరానికి రంగం రెడీ అవుతోంది. ఇప్పటికే పార్టీ పరంగా దీనికి సంబంధించిన కార్యాచరణను కూడా సిద్ధం చేస్తున్నారని పార్టీ పేర్కొనడం గమనార్హం. సెప్టెంబరు-అక్టోబరు మాసాల్లోనే పంచాయతీ ఎన్నికలు నిర్వహించనున్నారు. ప్రస్తుతం గ్రామీణ ప్రాంతాల్లో దీనికి సంబంధించిన సందడి మొదలైంది. ఆ తర్వాత.. జనవరి-ఫిబ్రవరి మధ్య మునిసిపల్ ఎన్నికలు, ఆ తర్వాత కార్పొరేషన్ ఎన్నికలు ఇలా.. వేర్వేరుగా నిర్వహించాలని నిర్ణయించారు. తద్వారా.. ఎక్కు వ సమయం ఉండడంతో ప్రచారం చేసుకునేందుకు, నాయకుల ఎంపికకు కూడా అవకాశం ఉంటుందని అంచనా వేస్తున్నారు.స్థానిక ఎన్నికలకు సంబంధించి ప్రధానంగా స్థానికంగా జరుగుతున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల పైనే కూటమి ప్రభుత్వం దృష్టి పెట్టనుంది. పంచాయతీల్లో ఇప్పటికే సాగుతున్న పనులు.. ఆగస్టు చివరి నాటికి పూర్తికానున్నాయి. దీంతో ఆ తర్వాతే ఎన్నికలకు వెళ్లాలని నిర్ణయించారు. అలానే.. కార్పొరేషన్ ఎన్నికల సమయానికి నగరాల్లో అభివృద్ధి కార్యక్రమాలు పూర్తి చేయనున్నారు. అంటే.. రహదారుల నిర్మాణం.. సంక్షేమ పథకాల అమలుపై దృష్టి పెట్టనున్నారు.

ఇదే సమయంలో కూటమి పార్టీల మధ్య సమన్వయం మరింత పెంచేదిశగా రానున్న నెల రోజుల్లో మూడు పార్టీలు సంయుక్తంగా సమావేశాలు నిర్వహించనున్నారు. ఇప్పటికే దీనికి సంబంధించిన కార్యాచరణను కూడా రెడీ చేశారని తెలిసింది. తద్వారా స్థానికంగా బలమైన వ్యూ-హంతో ముందుకు సాగాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇదే సమయంలో పార్టీ పరంగా యువతను ఎంకరేజ్ చేయనున్నట్టు టీడీపీ చెబుతోంది.నిజానికి స్థానికంగా జరిగే ఎన్నికల్లో అధికార పార్టీలకు అనుకూలంగా ఓటు బ్యాంకు ఉంటుంది. దీనిని మరింత పెంచుకునేందుకు ప్రయత్నిస్తున్నారు.

# ట్రైన్‌లో దుప్పట్ల దొంగలు... రూ.100o కోట్లు లూటీ

ఇండియాలో ప్రభుత్వ ఆస్తులు ఏ స్థాయిలో లూటీ కి గురి అవుతున్నాయో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. అన్ని చోట్ల ప్రభుత్వానికి చెందిన ఆస్తులు నాశనం చేయడం లేదా దొంగిలించడం వంటివి జరుగుతూనే ఉంటాయి. ప్రైవేట్ ఆస్తుల కంటే ప్రభుత్వ ఆస్తులపై దొంగల కన్ను ఎక్కువగా ఉంటుంది. ప్రభుత్వ ఆస్తి దొంగతనం చేస్తే పెద్దగా పట్టించుకోరని, అదే సమయంలో కేసుల తీవ్రత కూడా పెద్దగా ఉండదని దొంగలు భావిస్తారేమో. అందుకే ప్రభుత్వానికి చెందిన ఏ వస్తువు అయినా దొంగతనంకు అనుకూలంగా ఉంది అనిపిస్తే వెంటనే దొంగిలించేందుకు దొంగలు రెడీగా ఉంటారు. ఇండియన్ రైల్వేలో దొంగతనాలు ఏ స్థాయిలో ఉంటాయో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. రైల్లో దొంగలు ఉంటారని ప్రయాణికులను హెచ్చరిస్తూ ఉంటారు. ఆ ప్రయాణికులే దొంగలు అయితే పరిస్థితి ఎలా ఉంటుందో తాజా గణాంకాలు చూస్తే అర్థం అవుతుంది.

**రైల్వేలో ఏసీ కోచ్ ప్రయాణాలు...**

రైలులోని ఏసీ కోచ్‌ల్లో ప్రయాణించే ప్రయాణికులకు బెడ్ రోల్స్ సామాగ్రిని ఇవ్వడం జరుగుతుంది. ఏసీ టికెట్ తీసుకున్న వారి సౌకర్యార్థం రైల్వే శాఖ బెడ్ షీట్లు, దుప్పట్లు, పిల్లో, పిల్లో కవర్స్, ఫేస్ టవల్స్‌ను ఇవ్వడం జరుగుతుంది. ప్రయాణికులు చాలా మంది తమ గమ్య స్థానం వచ్చిన సమయంలో దిగినప్పుడు వాటిని తమతో తీసుకు వెళ్తున్నారు. అవి ప్రభుత్వ ఆస్తి కదా, మమ్ములను ఎవరు అడుగుతారులే అనుకుంటారో లేదా టికెట్ పెట్టాం కదా, డబ్బు ఇచ్చాం కదా ఇవి మావి అనుకుంటారో తెలియదు కానీ పెద్ద ఎత్తున దుప్పట్లు, బెడ్ షీట్స్ ను ప్రయాణికులు లూటీ చేసినట్లు అధికారులు చెప్పుకొచ్చారు. తాజాగా ఒక సమాచార హక్కు చట్టం కార్యకర్త పిటిషన్ మేరకు ఇండియన్ రైల్వే అధికారులు ఈ లెక్కలను బయట పెట్టారు. ఒకటి కాదు రెండు కాదు ఏకంగా వంద కోట్ల రూపాయల మేరకు దొంగతనం జరిగినట్లు వెల్లడి అయింది.

# ఈ మఫ్లర్ ప్రత్యేకత ఏంటో తెలుసా న్యూజిలాండ్ పర్యటనలో ప్రధాని ఇంట్రెస్టింగ్ స్పీచ్



ప్రధాని నరేంద్ర మోదీ విదేశీ పర్యటనలో ఓ ఆసక్తికర అంశం వెలుగు చూసింది. ఈ నెల 6 నుంచి 11వ తేదీ వరకు ప్రధాని మోదీ మూడు దేశాల్లో పర్యటించిన విషయం తెలిసిందే. తొలుత ఇండోనేషియా వెళ్లిన ప్రధాని అక్కడి నుంచి ఆస్ట్రేలియా తర్వాత న్యూజిలాండ్ లో పర్యటించారు. కాగా, గత 40 ఏళ్లలో న్యూజిలాండ్ ను సందర్శించిన తొలి ప్రధానిగా మోదీ రికార్డు సృష్టించారు. ఇదే సందర్భంలో ఆయన న్యూజిలాండ్ లో ప్రవాసభారతీయుల సమావేశంలో తీవ్ర భావోద్వేగంగా మాట్లాడారు. దీనికి సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. సుమారు 25 నుంచి 30 ఏళ్ల క్రితం తాను గుజరాత్ ముఖ్యమంత్రి హోదాలో న్యూజిలాండ్ లో పర్యటించగా, అప్పుడు జరిగిన ఓ సంఘటన గుర్తు చేస్తూ సభికులను ప్రధాని ఆశ్చర్యపరిచారు.

**చెదరని జ్ఞాపకం**

న్యూజిలాండ్ లో ఎన్ఆర్ఐల సమావేశంలో ప్రధాని మోదీ ప్రసంగిస్తూ, తన మెడలో ఉన్న మఫ్లర్‌ను తీసి ప్రేక్షకులకు చూపించారు. "ఈ మఫ్లర్‌ను చూడండి.. ఇది సుమారు 25-30 ఏళ్ల క్రితం న్యూజిలాండ్ పర్యటనలో ఉన్నప్పుడు నాకు ఒక మిత్రుడు బహుమతిగా ఇచ్చారు. ఇన్ని ఏళ్లు గడిచినా, నేను దాన్ని ఇప్పటికీ ఎంతో జాగ్రత్తగా దాచుకున్నాను, అవసరమైనప్పుడు వాడుతుంటాను" అని చెప్పారు. ఏళ్ల తరబడి ఒక వస్తువును అంత భద్రంగా ఉంచుకోవడమే కాకుండా ఆ మఫ్లర్ ను న్యూజిలాండ్ తీసుకువెళ్లిన తన పాత జ్ఞాపకాలను నెమరవేసుకోవడం ద్వారా ప్రధాని మోదీ సభికుల మనసు దోచుకున్నారని వ్యాఖ్యానిస్తున్నారు.


**మీ ప్రేమ కూడా అంతే..**

కేవలం ఒక మఫ్లర్‌ను గుర్తుచేసుకోవడమే కాకుండా, దాన్ని దేశ ప్రజల ప్రేమతో పోల్చడం ప్రధాని మోదీ రాజకీయ చతురతను తెలియజేస్తోందని అంటున్నారు. 'ఈ మఫ్లర్‌ను ఎలాగైతే నేను ఇన్నాళ్లు జాగ్రత్తగా దాచుకున్నానో, మీరంతా నాపై చూపిస్తున్న అమితమైన ప్రేమను కూడా నేను అలాగే నా గుండెల్లో భద్రపరుచుకుంటాను' అంటూ ప్రధాని వ్యాఖ్యానించిన వెంటనే సభ మొత్తం హర్షధ్వానాలతో మార్మోగిపోయింది.

**ప్రేక్షకుల్లో జోష్!**

ప్రధాని మాటలు విన్న సభికులు తమ అభిమానాన్ని చాటుకున్నారు. వేలాది మంది జనం ఆయన మాటలకు చప్పట్లు కొడుతూ, నినాదాలతో తమ మద్దతును వ్యక్తం చేశారు. కేవలం రాజకీయ నాయకుడిగానే కాకుండా, తనను ఆదరించే ప్రజలను ఒక కుటుంబ సభ్యుడిగా భావించే మోదీ శైలికి ఈ ప్రసంగం నిదర్శనంగా నిలిచిందని వ్యాఖ్యానిస్తున్నారు. వస్తువుల పట్ల చూపే గౌరవం, మనుషుల పట్ల చూపే ప్రేమ.. ఈ రెండింటినీ కలిపి మోదీ చెప్పిన విధానం సోషల్ మీడియాలో ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. నాయకుడు అంటే కేవలం అధికారం చలాయించేవాడు మాత్రమే కాదని, ప్రజల మనసులను గెలుచుకునేవాడు అని ప్రధాని మరోసారి నిరూపించారని కొనియాడుతున్నారు.

# ముస్లింల పూర్వీకులు హిందువులే.. రాందేవ్ బాబా నిప్పు రాజేశాడు



భారతదేశంలో మతం, సంస్కృతి, చరిత్రకు సంబంధించిన అంశాలు ఎప్పుడూ సున్నితమైనవే. ఇవి సామాజికంగా ఎంతటి సంచలనాన్ని సృష్టిస్తాయో రాజకీయంగా అంతకంటే పెద్ద చర్చకు దారితీస్తుంటాయి. తాజాగా యోగా గురువు బాబా రామ్‌దేవ్ చేసిన వ్యాఖ్యలు దేశవ్యాప్తంగా సరికొత్త వివాదానికి, చర్చకు తెరలేపాయి. ముస్లింల పూర్వీకులు అందరూ హిందువులేనని.. వారంతా తమ మూలాలను గుర్తుంచుకుని తిరిగి హిందూ ధర్మంలోకి రావాలని ఆయన పిలుపునివ్వడం ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది.

**మూలాలు వెతకాలి.. బాబా రామ్‌దేవ్ పిలుపు**

ఒక బహిరంగ కార్యక్రమంలో మాట్లాడిన బాబా రామ్‌దేవ్, భారతదేశంలో నివసిస్తున్న ముస్లింల పూర్వీకులు పరాయి దేశాల నుంచి రాలేదని.. వారంతా ఇక్కడి హిందూ సమాజానికి చెందినవారేనని వ్యాఖ్యానించారు. గతంలో దేశంలో జరిగిన వివిధ చారిత్రక పరిణామాలు, బలవంతపు లేదా పరిస్థితుల ప్రభావంతో కూడిన మత మార్పిడుల వల్లే నేడు ముస్లింలుగా ఉన్నవారి పూర్వీకులు మారాల్సి వచ్చిందని ఆయన పేర్కొన్నారు. "మీ పూర్వీకులను గౌరవించండి.. మీ మూలాలను గుర్తించి తిరిగి హిందూ ధర్మంలోకి రండి" అంటూ ఆయన చేసిన వ్యాఖ్యలు సామాజిక మాధ్యమాల్లో దావానలంలా వ్యాపించాయి.

**గతాన్ని గుర్తుచేస్తున్న 'ఘర్ వాపసీ' వివాదం**

బాబా రామ్‌దేవ్ చేసిన ఈ వ్యాఖ్యలు గతంలో దేశాన్ని కుదిపేసిన "ఘర్ వాపసీ" ఉద్యమాన్ని మరోసారి గుర్తుకు తెస్తున్నాయి. "భారతీయులందరి డిఎన్ఏ ఒక్కటే పూర్వీకులు ఒక్కరే" అనే వాదనను కొన్ని హిందూ సంస్థలు చాలా కాలంగా వినిపిస్తున్నాయి. అయితే ఈ తరహా వ్యాఖ్యలు సమాజంలో విభజనను తెస్తాయని ప్రతిపక్షాలు, మైనారిటీ సంఘాలు గట్టిగా వాదిస్తున్నాయి.

**రాజకీయ లబ్ధా? చారిత్రక సత్యమా?**

రాబోయే రోజుల్లో ఐదు రాష్ట్రాల ఎన్నికలు లేదా రాజకీయ సమీకరణలు ఉన్న నేపథ్యంలో బాబా రామ్‌దేవ్ చేసిన ఈ వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య దీనిపై తీవ్రస్థాయిలో మాటల యుద్ధం నడిచే సూచనలు కనిపిస్తున్నాయి. చరిత్రను చారిత్రక కోణంలోనే చూడాలా లేక ఆధునిక ప్రజాస్వామ్య యుగంలో వ్యక్తిగత స్వేచ్ఛకు పీటం వేయాలా అనే ప్రశ్నపై మేధావుల మధ్య మేధోమథనం మొదలైంది. ఏది ఏమైనా రాందేవ్ బాబా రాజేసిన ఈ 'పూర్వీకుల' మంటలు అంత సులభంగా చల్లారేలా కనిపించడం లేదు.

# షాబాద్‌ను వణికించిన నరరూప రాక్షసుడి కథకు ముగింపు.. రాజ్ కుమార్ అంతమయ్యాడిలా..

తెలుగు రాష్ట్రాలను తీవ్ర కలవరానికి గురిచేసి.. అమాయకుల రక్తంతో షాబాద్ ప్రాంతాన్ని తడిపిన ఆ నరరూప రాక్షసుడి ఆట ముగిసింది. గత కొన్ని రోజులుగా ప్రజల గుండెల్లో గుబులు రేపుతూ పోలీసులకు ముచ్చెమటలు పట్టించిన షాబాద్ ఆరు హత్యల కేసు ప్రధాన నిందితుడు రాజ్‌కుమార్ (29) ఇక లేడు. 14 ప్రత్యేక పోలీసు బృందాల కళ్లు గప్పి తిరిగిన ఈ నరహంతకుడి ప్రాణం.. చివరికి ఒక నిర్జీవ దేహంగా మారి పొలాల మధ్య తేలింది. రంగారెడ్డి జిల్లా కొత్తూరు మండలం పెంజర్ల గ్రామ పరిసరాల్లో రాజ్‌కుమార్ మృతదేహం లభించడంతో ఈ సంచలన ఉదంతం ఊహించని మలుపు తిరిగింది.

**భయానికి ముగింపు.. కానీ గుండెకోత మిగిలే ఉంది**

స్థానికులు ఇచ్చిన సమాచారంతో రంగంలోకి దిగిన పోలీసులు.. అక్కడ పడి ఉన్న శవం మరెవరిదో కాదు.. తాము గాలిస్తున్న మోస్ట్ వాంటెడ్ క్రిమినల్ రాజ్‌కుమార్‌దేనని నిర్ధారించారు. మృతదేహం పక్కనే లభించిన విషం బాటిల్ అతడు పోలీసులకు దొరకకుండా ఆత్మహత్య చేసుకుని ఉంటాడనే అనుమానాలకు బలం చేకూరుస్తోంది. అయితే ఇది నిజంగానే ఆత్మహత్యేనా? లేక దీని వెనుక మరేదైనా కోణం ఉందా? అనేది పోస్టుమార్టం నివేదిక వచ్చాకే తేలనుంది.

**ఆరు ప్రాణాలు.. అంతులేని విషాదం:**

ఒక పోక్సో కేసులో నిందితుడిగా చేర్చారని పగతో రగిలిపోయి వరుసగా ఆరు అమాయక ప్రాణాలను అత్యంత దారుణంగా బలిగొన్న రాజ్‌కుమార్ క్రూరత్వానికి షాబాద్ నివ్వెరపోయింది. అడవులు, కొండలు, శ్రీశైలం పరిసరాలంటూ పోలీసులు జల్లెడ పట్టినా దొరకని ఈ కిరాతకుడు.. చివరకు ఇలా విగతజీవిగా మారడం స్థానికులకు కొంత ఉపశమనాన్ని ఇచ్చినా అతడు మిగిల్చిన గాయం మాత్రం అంత సులభంగా మానని.



**దర్యాప్తులో ముమ్మరమైన ఫోరెన్సిక్ విశ్లేషణ**

ప్రస్తుతం సంఘటనా స్థలానికి చేరుకున్న ఫోరెన్సిక్ నిపుణులు క్లూస్ సేకరిస్తున్నారు. నిందితుడి మృతితో ఈ కేసు ముగిసిపోయినట్లు భావించినా చట్టపరంగా పూర్తి నిజాలు బయటకు రావాల్సి ఉంది.

**తీరని లోటు.. మాయని గాయం**

రాజ్‌కుమార్ అంతంతో షాబాద్‌ను వణికించిన ఒక నల్లటి అధ్యాయానికి తెరపడింది. నిందితుడి వేటకైతే

ముగింపు దొరికింది కానీ అతడి రాక్షసత్వానికి బలైన ఆ ఆరు కుటుంబాల ఆక్రందనలకు.. వారు అనుభవిస్తున్న గుండెకోతకు పరిహారం ఎక్కడిది? చట్టం నుంచి తప్పించుకోవడానికి విషం తాగి ప్రాణాలు తీసుకున్నా ఆ బాధితుల శాపనార్థాల నుంచి అతడు తప్పించుకోలేకపోయాడంటూ స్థానికులు కన్నీటి పర్యంతమవుతున్నారు. పోస్టుమార్టం, ఫోరెన్సిక్ నివేదికలు వచ్చిన తర్వాత పోలీసులు ఈ మరణం వెనుక ఉన్న పూర్తి వివరాలను అధికారికంగా వెల్లడించనున్నారు.

# క్వాంటం కేతనం!

రెండు సంఖ్యలను కూడమంటే తడబడే యంత్రం, విశ్వ రహస్యాలను మాత్రం అలవోకగా విప్పుతుంది.. ఇదెక్కడి వింత అనిపించవచ్చు. కానీ క్వాంటం కంప్యూటింగ్ ప్రపంచపు నిజస్వరూపం ఇదే. వందల రూపాయల కాలిక్యులేటర్ క్షణంలో చేసే సాధారణ కూడికను క్వాంటం కంప్యూటర్‌తో చేయించడం మహా కష్టమని, అదే సమయంలో పరస్పరం ప్రభావితం చేసుకునే కణాలతో నిండిన అత్యంత సంక్లిష్ట క్వాంటం వ్యవస్థను అనుకరించడం దానికి సులభమని బిట్స్ పిలానీ భౌతికశాస్త్ర ప్రొఫెసర్ ఇంద్రాక్షి రాయ్‌చౌధురి చమత్కరిస్తారు. క్వాంటం యంత్రాలు సంప్రదాయ కంప్యూటర్లను నిజంగా ఎక్కడ మించగలవో కనిపెట్టడమే నేడు ప్రపంచ దేశాలు, కార్పొరేట్ దిగ్గజాలు వేల కోట్లు కుమ్మరిస్తున్న అసలు సవాలు. ఎందుకంటే ఈ రంగం చుట్టూ ఉన్న ప్రచార ఆర్భాటానికీ, క్షేత్రస్థాయి వాస్తవానికీ మధ్య అగాధం చిన్నదేమీ కాదు. దశాబ్దాల పరిశోధన, బిలియన్ డాలర్ల పెట్టుబడుల తర్వాత కూడా, నిజంగా ఉపయోగపడే ఒక్క సమస్యనూ క్వాంటం యంత్రాలు సాధారణ కంప్యూటర్ల కంటే వేగంగా పరిష్కరించలేకపోయాయన్నది కఠోర సత్యం! సూపర్ కంప్యూటర్‌కు పదివేల సంవత్సరాలు పట్టే పనిని తమ ప్రాసెసర్ నిమిషాల్లో పూర్తి చేసిందని 2019లో గూగుల్ ఘనంగా ప్రకటించినా, ఆ 'పని'కి ఎలాంటి ఆచరణాత్మక ప్రయోజనమూ లేదు; కేవలం క్వాంటం హార్డ్‌వేర్‌కు అనుకూలమనే దాన్ని ఎంచుకున్నారు. అందుకే ఈ రంగం ఇప్పుడు ఆడంబరాల నుంచి వాస్తవికత వైపు మళ్లి, స్వతంత్రంగా సరిచూడగలిగే నిజమైన సమస్యపై సాధించే 'ఉపయోగకరమైన ఆధిక్యం' (యూజ్‌ఫుల్ అడ్వాంటేజ్) అనే నికార్సయిన లక్ష్యాన్ని వెంబడిస్తోంది. సరిగ్గా ఇక్కడే భారత శాస్త్ర పతాక ఒకటి సగర్వంగా రెపరెపలాడింది. రాయ్‌చౌధురి బృందం ఐబీఎం క్వాంటం శాస్త్రవేత్తలతో కలిసి, 120 క్యూబిట్‌లపై పరమాణు అంతర్గత కణాల ప్రవర్తనను అనుకరించి చూపింది. సంప్రదాయ కంప్యూటర్‌కు రెండు గంటలుపట్టే ఆ గణనను క్వాంటం యంత్రం కేవలం 20 సెకన్లలో పూర్తి చేసింది. భౌతిక శాస్త్రవేత్తలకు ఉపయోగపడుతూ, సంప్రదాయ కంప్యూటర్ల శక్తికి లొంగకుండా నిలిచిన సమస్యలు ప్రపంచవ్యాప్తంగా ఇప్పటివరకు మూడంటే మూడే ఉన్నాయని నిపుణుల అంచనా. వాటిలో ఒకటి భారత గడ్డపై పుట్టిన పరిష్కారం కావడం చరిత్రాత్మకం.

ఈ విజయపు లోతు తెలియాలంటే, ఆ బృందం ఎంచుకున్న సమస్య స్వభావాన్ని అర్థం చేసుకోవాలి. ప్రోటాన్ లోపలి క్వార్క్‌లు, వాటిని బంధించి ఉంచే గ్లువాన్‌లు ప్రకృతిలోకెల్లా బలమైన శక్తి అయిన 'స్ట్రాంగ్ న్యూక్లియర్ ఫోర్స్' పాలనలో నడుస్తాయి. ఆ కణాలు క్షణక్షణం ఎలా కదులుతాయో, ఎలా పునర్వ్యవస్థీకృతమవుతాయో లెక్కించడం ఫిజిక్స్‌లోని క్లిష్ట సమస్యల్లో ఒకటి. సంప్రదాయ పద్ధతులు ప్రోటాన్ ద్రవ్యరాశిని కచ్చితంగా చెప్పగలవుగానీ, కణాల పరిణామాన్ని ఫ్రేమ్ తర్వాత ఫ్రేమ్ చూడాలంటే మాత్రం గణన సంక్లిష్టత ఘాతీయంగా పెరిగిపోయి చేతులెత్తేస్తాయి. నిశ్చల ఛాయాచిత్రం స్థానంలో సజీవ చలనచిత్రాన్ని చూపగల సత్తా క్వాంటం కంప్యూటర్‌కే ఉంది. ఆ సత్తాను రాబట్టేందుకు ఈ బృందం, బలమైన శక్తి పూర్తి సిద్ధాంతానికి సరళీకృత ప్రతిరూపమైన నమూనాను తీసుకుని, గణిత పునరుక్తులను తొలగించే వినూత్న 'ఎన్‌కోడింగ్'ను రూపొందించింది. ఫలితంగా ఇతరులు గరిష్ఠంగా 27 క్యూబిట్‌లపై నడిపిన సమస్య ఏకంగా 120 క్యూబిట్‌ల స్థాయికి విస్తరించింది.

'ఈరోజు నాకు వెయ్యి క్యూబిట్‌ల కంప్యూటర్ ఇస్తే, మా అల్గారిథం నిరాటంకంగా దానికి సరిపోతుంది' అన్న రాయ్‌చౌధురి మాటల్లో ధీమా అంతా ఆ పునాది పటిష్ఠతదే. మరో విశేషం -ఈ ఫలితం నిగ్గుతేలిన తీరు. క్వాంటం ఆధిక్య ప్రకటనల్లో నీరెంతో, పాలెంతో తేల్చడానికి 2025 నవంబర్‌లో ఐబీఎం, ఫ్లాటిరాన్ ఇన్‌స్టిట్యూట్, పలు అంకుర సంస్థలు, విద్యావేత్తలు కలిసి 'క్వాంటం అడ్వాంటేజ్ ట్రాకర్' (క్యూఏటీ) అనే సజీవ సమీక్షా వేదికను ప్రారంభించారు. పరిశోధకులు సమర్పించే ప్రతి ఫలితాన్నీ ఒక కమిటీ సంప్రదాయ, క్వాంటం యంత్రాలు రెండింటిపైనా పరీక్షిస్తుంది. ఇప్పటివరకు నమోదైన సుమారు 220 ఎంట్రీలలో ఆమోదం పొందినవి డజను లోపే. అలాంటి కఠిన వడపోతలో ఈ బృందం ఫలితం 'యాక్టివ్' హోదాతో నిలబడింది. ఒక భారతీయ ప్రయోగశాల నుంచి ఈ ఘనత సాధించిన తొలి ఫలితం ఇదే. మే నుంచి ఇప్పటివరకు ఏ సంప్రదాయ కంప్యూటరూ దాన్ని అధిగమించలేకపోయింది. ప్రపంచంలోనే అతిపెద్ద కణ పరిశోధనా కేంద్రమైన సెర్న్ (స్విట్జర్లాండ్) శాస్త్రవేత్తలు, తమ అనుకరణలను ముందుకు తీసుకెళ్లగలరేమో చూడమని ఆమెను ఆహ్వానించడం భారత మేధకు దక్కిన అంతర్జాతీయ గుర్తింపునకు తార్కాణం.

అయితే ఈ విజయోత్సాహపు వెలుగులో దేశం ఆత్మపరిశీలన చేసుకోవాల్సిన కోణాలూ ఉన్నాయి. 2023లో ఆమోదం పొందిన రూ.6,003 కోట్ల జాతీయ క్వాంటం మిషన్ ద్వారా భారత్ ఈ రంగంలో అడుగులు వేస్తోంది; బెంగళూరులో కంప్యూటింగ్ హబ్ నడుస్తోంది. కానీ ఉన్నత శ్రేణి క్వాంటం హార్డ్‌వేర్ మాత్రం సొంతంగా లేదు. మన పరిశోధకులు విదేశీ యంత్రాలపైనే ఆధారపడాల్సిన పరిస్థితి. ఇది సెమీకండక్టర్ రంగంలో మనం చవిచూస్తున్న పరాధీనతను గుర్తుచేసే హెచ్చరిక. అదే సమయంలో, 'అల్గారిథంలు లేకుండా హార్డ్‌వేర్ నిరుపయోగం' అన్న రాయ్‌చౌధురి మాట మనకో దారి చూపుతోంది. హార్డ్‌వేర్ పోటీలో అమెరికా, చైనాలను వెంటనే అందుకోలేకపోయినా, మేధాశక్తే ముడిసరుకుగా ఉండే అల్గారిథంల రంగంలో భారత్ అగ్రస్థానం సాధించగలదని ఈ విజయం రుజువు చేసింది. అయితే అది జరగాలంటే మౌలిక పరిశోధనపై దృష్టి పెట్టాలి. ఔషధ ఆవిష్కరణ, పదార్థ విజ్ఞానం వంటి రంగాల్లో క్వాంటం అద్భుతాల గురించి మీడియా ఊదరగొడుతున్నా, గణనపరంగా అవి ఇంకా ప్రాథమిక దశలోనే ఉన్నాయని ఆమె చెప్పిన మాట గమనార్హం. అంటే తక్షణ వాణిజ్య ఫలితాలు ఇవ్వని శుద్ధ శాస్త్రమే నేడు క్వాంటం ఆధిక్యపు తొలి పంటను పండించిందన్నమాట. వెంటనే లాభాలు చూపించమని పరిశోధకులను ఒత్తిడి చేసే ధోరణికి ఇది చెంపపెట్టు. అలాగే, ఒక మహిళా శాస్త్రవేత్త నాయకత్వంలో, గోవాలోని క్యాంపస్ నుంచి ఈ ఘనత రావడం.. శాస్త్ర పరిశోధన ఐఐటీలు, మహానగరాల గుత్త సొత్తు కాదని చాటుతోంది. ఇరవై సెకన్ల ఆ గణన, నిజానికి దశాబ్దాల తపస్సుకు దక్కిన ఫలం. ఆ తపస్సును ప్రోత్సహించి, సొంత హార్డ్‌వేర్ నిర్మాణం దిశగా జాతీయ క్వాంటం మిషన్‌ను వేగవంతం చేస్తే -రేపటి క్వాంటం యుగంలో భారత్ వినియోగదారుగా కాక, నిర్మాతగా నిలుస్తుంది. ఆ దిశగా ఈ 'ఇరవై సెకన్ల మెరుపు' ఒక శుభసంకేతం!.

## పనికొచ్చే పలుకు



# కాలేజీ కాదు.. కలలే మీ బ్రాండ్!

భారతదేశంలో సగటు మధ్యతరగతి ఇంజనీరింగ్ విద్యార్థి కల.. ఎలాగైనా ఐఐటీలో సీటు కొట్టడం. తర్వాత మంచి ప్యాకేజీతో ఉద్యోగంలో చేరడం! గ్లోబల్ టెక్నాలజీ కంపెనీల్లో స్థిరపడాలన్నా, భారీ ప్యాకేజీ అందుకోవాలన్నా ఐఐటీ ట్యాగ్ ఒక్కటే ఏకైక మార్గమని మెజారిటీ విద్యార్థులు నమ్ముతారు. అయితే, ప్రతిభకు ఏ కాలేజీ బ్రాండ్ అవసరం లేదని, పట్టుదల ఉంటే ప్రపంచంలోనే అత్యంత విలువైన కంపెనీని సైతం శాసించవచ్చని నిరూపించాడు కర్ణాటక కుర్రోడు పృథ్వీరాజ్. ఇటీవల ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) రంగంలో ప్రపంచాన్ని శాసిస్తున్న మైక్రోచిప్ దిగ్గజం 'ఎన్వీడియా'కు చెందిన కాలిఫోర్నియాలోని శాంటా క్లారా ప్రధాన కార్యాలయంలో పృథ్వీరాజ్ సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్ ఇంజనీర్ (డీప్ లెర్నింగ్)గా చేరాడు. అతని ప్యాకేజీ అక్షరాలా రూ.2.6కోట్లు! ఈ విషయాన్ని ఆయన స్వయంగా తన లింక్డ్‌ఇన్ ఖాతా ద్వారా పంచుకోవడంతో, ఈ విజయగాథ ఇప్పుడు సామాజిక మాధ్యమాల్లో వైరలైంది. కేవలం ప్రీమియం ఇన్‌స్టిట్యూట్‌ల విద్యార్థులకే ఇలాంటి అవకాశాలు వస్తాయనే అపోహలను ఈ ప్రయాణం పూర్తిగా బద్దలు కొట్టింది.

పృథ్వీరాజ్ ప్రయాణం అంత సులువుగా సాగలేదు. కర్ణాటకలోని చిత్రదుర్గ జిల్లాకు చెందిన 'కటందేవరకోట' ఆయన స్వస్థలం. కనీస సాంకేతిక వనరులు, ఆధునిక విద్యావకాశాలు లేని పల్లెటూరు నుంచి ఆయన తన ప్రయాణాన్ని ప్రారంభించాడు. తండ్రి ఒక సాధారణ బ్యాంక్ ఉద్యోగి. మధ్యతరగతి కుటుంబ నేపథ్యం కావడంతో ఎలాంటి అదనపు సదుపాయాలు లేవు. కేవలం సొంత శ్రమ, పట్టుదలనే పెట్టుబడిగా మార్చుకున్నాడు. బెంగళూరులోని పీఈఎస్ యూనివర్సిటీ నుంచి బ్యాచిలర్ డిగ్రీ పూర్తి చేసిన పృథ్వీరాజ్, కాలేజీ క్యాంపస్ సెలక్షన్స్ లేదా థియరీ చదువులకే పరిమితం కాలేదు. భవిష్యత్తు అంతా కృత్రిమ మేధస్సు, డీప్ లెర్నింగ్ చుట్టూనే తిరగబోతోందని ముందుగానే గుర్తించి, ఆయా రంగాల్లో ప్రాక్టికల్ నైపుణ్యాలను పెంచుకోవడంపై దృష్టి పెట్టాడు. సాంకేతికత అందుబాటులో లేని వాతావరణంలో పెరగడంవల్ల మొదట్లో ఈ కలలు అసాధ్యంగా అనిపించేవని, ప్రయాణంలో ఎన్నో అడ్డంకులు, సొంత సామర్థ్యంపై అనుమానాలు వ్యక్తమైనా ఏనాడూ వెనకడుగు వేయలేదని ఆయన గుర్తుచేసుకున్నాడు.

కోచింగ్‌లు లేవు.. సొంతంగానే ప్రయోగాల పాఠాలు

ఖరీదైన కోచింగ్ సెంటర్లు, బడా కాలేజీల రెప్యుటేషన్‌పై ఆధారపడకుండా, పృథ్వీరాజ్ ఆన్‌లైన్ కోర్సులు, సొంత ప్రాజెక్టులు, నిరంతర సాధన ద్వారా ఏఐ, డీప్ లెర్నింగ్ టెక్నాలజీలపై పట్టు సాధించాడు. డిగ్రీ పూర్తయిన తర్వాత ఉన్నత చదువుల కోసం అమెరికా వెళ్లాడు. అక్కడ కూడా ఆయనకు ఏ పెద్ద యూనివర్సిటీలోనూ సీటు రాలేదు. ఒక సాధారణ టైర్-3 వర్సిటీలోనే మాస్టర్స్ చేశాడు. ఆ సమయంలో తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటూ, కెరీర్ ప్లానింగ్ కోసం సరైన గైడెన్స్ లేకపోయినా ఒంటరిగానే పోరాడాడు.

అనంతరం ఎన్వీడియా సంస్థ నిర్వహించే అత్యంత కఠినమైన రిక్రూట్‌మెంట్ ప్రక్రియను తన అసాధారణ సాంకేతిక పరిజ్ఞానంతో సులువుగా ఛేదించాడు. ప్రస్తుతం అతను ఎన్వీడియాలో అత్యాధునిక డీప్ లెర్నింగ్ టెక్నాలజీలపై పనిచేస్తూ, ఏడాదికి దాదాపు 2,75,000 డాలర్లు (మన భారత కరెన్సీలో సుమారు రూ.2.6 కోట్లు) వేతనంగా అందుకుంటున్నాడు. ప్రపంచంలోని అత్యంత ప్రతిభావంతులైన మేధావులతో కలిసి పనిచేసే అవకాశం రావడం తన అదృష్టమని పృథ్వీరాజ్ పేర్కొన్నాడు. చివరగా తోటి విద్యార్థులకు ఆయన ఒకటే సందేశమిచ్చాడు. "కాలేజీల బ్రాండ్లకంటే మీ నైపుణ్యాలను నిరంతరం మెరుగుపరుచుకోవడంపైనే దృష్టి పెట్టండి. ఓపికగా ఉండండి. విజయం ఎంత దూరంలో ఉన్నా ప్రయత్నాన్ని మాత్రం ఆపకండి" అని.

# లోకేష్‌తో కొరియా కరచాలనం!



ఒక రాజకీయ నాయకుడి పనితీరుకు ప్రజలు బిరుదులివ్వడం సహజం. కానీ ఏడు సముద్రాల ఆవల, భాషా సంస్కృతులు పూర్తిగా భిన్నమైన దేశపు ప్రతినిధులు మన మంత్రికి ముద్దుపేరు పెట్టడం అరుదైన విశేషం! ఆంధ్రప్రదేశ్ విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ మంత్రి నారా లోకేష్ వారంపాటు దక్షిణ కొరియా పర్యటనలో చూపిన చురుకుదనానికి ముగ్ధులైన కొరియన్ ప్రతినిధులు ఆయనకు 'పల్లి.. పల్లి మంత్రి' అని నామకరణం చేశారు. కొరియన్ భాషలో 'పల్లి పల్లి' అంటే 'త్వరగా.. త్వరగా' అని అర్థం. వేగమే జీవన విధానంగా, పనితనమే సంస్కృతిగా బతికే కొరియన్లనుంచి ఆ మాట రావడం సామాన్య ప్రశంస కాదు.. యువనేతకు అదొక ధ్రువీకరణ. జూలై 5నుంచి 11 వరకు సాగిన లోకేష్ అధికారిక పర్యటన ఎన్నో విధాలుగా ప్రత్యేకం. సాధారణంగా రాష్ట్ర మంత్రులు పెట్టుబడుల వేటకు తామే విదేశాలకు వెళుతారు; కానీ ఇక్కడ దక్షిణ కొరియా విదేశాంగ మంత్రిత్వ శాఖే స్వయంగా లోకేష్‌ను అధికారికంగా ఆహ్వానించడం గమనార్హం. రాష్ట్రంతో ద్వైపాక్షిక, వాణిజ్య సహకారాన్ని బలోపేతం చేసుకోవాల్సిన ప్రాధాన్యతను ఆ దేశమే గుర్తించిందనడానికి ఇంతకుమించిన రుజువులు అక్కర్లేదు. సియోల్‌లో తెలుగు ప్రవాసులతో ఆత్మీయ సమావేశంతో మొదలైన యాత్ర, సీఐఐ ఆధ్వర్యంలో పెట్టుబడిదారుల రోడ్‌షోతో ముగిసేలోగా -50కి పైగా కార్పొరేట్ దిగ్గజాల నాయకత్వంతో ముఖాముఖి భేటీలు, ప్రభుత్వ ఉన్నతాధికారులతో చర్చలు, పారిశ్రామిక క్షేత్రాల సందర్శనలతో సాగిపోయింది. ఎల్జీ వంటి అంతర్జాతీయ దిగ్గజం తన ప్రధాన కార్యాలయానికి ప్రత్యేకంగా ఆహ్వానించి, ఉన్నతస్థాయి బృందంతో గౌరవ విందు ఇవ్వడం మామూలు మర్యాద కాదు; అది ఆంధ్రప్రదేశ్ పట్ల కొరియన్ కార్పొరేట్ ప్రపంచంలో ఏర్పడుతున్న విశ్వాసానికి నిలువెత్తు సంకేతం! ఎల్జీ, హ్యుందయ్, శాంసంగ్, బీఎన్‌కే ఫైనాన్షియల్ వంటి సంస్థలు తమ అత్యున్నత నాయకత్వంతో సంప్రదించి ఏపీ ప్రతిపాదనలను పరిశీలిస్తామని హామీ ఇవ్వడంతో, ఈ వారం రోజుల శ్రమకు తగిన ప్రతిఫలం దక్కే ఆశలు చిగురించాయి. వారం రోజుల అధికారిక పర్యటనను అక్షరాలా 'పెట్టుబడుల యాత్ర'గా మలిచిన లోకేష్ లౌక్యం వెనుక, రాష్ట్రాభివృద్ధిపై ఆయనకున్న చిత్తశుద్ధి, 20 లక్షల ఉద్యోగ, ఉపాధి అవకాశాల కల్పన లక్ష్యంపై నిబద్ధత సుస్పష్టం!

పర్యటనలో లోకేష్ అనుసరించిన వ్యూహం -సమగ్రం, బహుముఖం. తొలిరోజే భారత రాయబారి గౌరంగలాల్ దాస్‌తో భేటీ అయి, కొరియా ప్రాధాన్యతా రంగ పరిశ్రమలను ఏపీకి తీసుకొచ్చేందుకు చొరవ చూపాలని కోరుతూ రాష్ట్ర విజన్‌ను ఆవిష్కరించారు. దౌత్య మార్గాలను, వాణిజ్య మార్గాలను సమాంతరంగా నడిపిన ఈ పద్ధతి పరిణత రాజనీతికి అద్దంపట్టేదే! దక్షిణ కొరియా ప్రఖ్యాత ఓడరేవు నగరం బుసాన్‌లో ఏపీఈడీబీ ఆధ్వర్యంలో 'అపెక్స్-కొరియా' పేరిట పెట్టుబడిదారుల సహాయక, అనుసంధాన విభాగాన్ని ప్రారంభించడం.. యాత్రలో వ్యవస్థాగతంగా నిలిచిపోయే ముందడుగు. పర్యటనలు వస్తూ పోతుంటాయి గానీ, ఇలాంటి శాశ్వత యంత్రాంగాలే దీర్ఘకాల బంధాలకు పునాదులవుతాయి. కొరియన్ పెట్టుబడిదారులకూ ఏపీ ప్రభుత్వానికీ మధ్య ఇది ఏక గవాక్ష వారధిగా పనిచేయడంతోపాటు, శ్రీసిటీ పరిసరాల్లో ఇప్పటికే కార్యకలాపాలు సాగిస్తున్న 40కి పైగా కొరియన్ కంపెనీలకు 'ఆఫ్టర్ కేర్' భరోసానూ ఇస్తుంది. పెట్టుబడిని రాబట్టడం ఒక ఎత్తయితే, వచ్చిన పెట్టుబడిదారుడిని కంటికి రెప్పలా చూసుకోవడం మరో ఎత్తు. రెండోది బాగుంటేనే మొదటిది వెల్లువలా వస్తుందన్న మార్కెటింగ్ మౌలిక సూత్రాన్ని లోకేష్ ఒంటబట్టించుకున్నారని ఈ ఏర్పాటు చెప్పకనే చెబుతోంది. అనంతపురం జిల్లాలో అడుగుపెట్టిన రెండేళ్లలోనే ఉత్పత్తి ప్రారంభించి అద్భుత విజయం సాధించిన 'కియా' గాథను ఆయన ప్రతి వేదికపైనా ఉదహరించడం -పరిణితి సాధించిన రాజకీయ నేత ప్రదర్శించే గొప్ప ఎత్తుగడ! సొంత దేశపు కంపెనీ విజయంకంటే గొప్ప ప్రచారపత్రం మరొకటి ఉండదు కదా! దానికితోడు కూటమి ప్రభుత్వ 'త్రీ ఎస్' నమూనా -స్పీడ్, స్టెబిలిటీ, సర్వీస్.. పారదర్శక పాలన, వేగవంతమైన అనుమతులపై లోకేష్ ఇచ్చిన ప్రజెంటేషన్లకు కొరియా మీడియా, దిగ్గజ సంస్థలు ఫిదా అయ్యాయి. బుసాన్‌లో కొరియా మెరైన్ ఎక్విప్‌మెంట్ అసోసియేషన్ నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో 1,053 కిలోమీటర్ల తీరరేఖ, ఏటా 33 కోట్ల టన్నులకు పైగా సరుకు రవాణా సామర్థ్యం, నాలుగు కొత్త గ్రీన్‌ఫీల్డ్ పోర్టులు, లక్ష ఎకరాలకు పైబడిన పారిశ్రామిక ల్యాండ్ బ్యాంక్‌వంటి బలాలను ప్రస్తావిస్తూ ఏపీని భారత సముద్ర వాణిజ్య ముఖద్వారంగా లోకేష్ ప్రతిపాదించడం.. విజనరీ చంద్రబాబుకు 2.0 వర్షన్ లోకేష్ అనిపించుకున్నారు. రూ.30 వేల కోట్ల అంచనాతో రూపుదిద్దుకుంటున్న దుగరాజపట్నం షిప్‌బిల్డింగ్ క్లస్టర్‌లో మెరైన్ ఇంజిన్లు, నావిగేషన్ పరికరాల తయారీకి కొరియన్ సంస్థలను ఆహ్వానించారు. అంతేకాదు.. ఏపీ-కొరియా ఇన్వెస్ట్‌మెంట్ డెస్క్, రాష్ట్ర విశ్వవిద్యాలయాల్లో కొరియన్ భాషా కేంద్రాలు, కొరియన్ సాంస్కృతిక కేంద్రం, విశాఖ-బుసాన్ నగరాల మధ్య భాగస్వామ్యం, ప్రత్యక్ష విమాన అనుసంధానం వంటి దీర్ఘకాలిక ప్రతిపాదనలనూ ఆయన తెరపైకి తెచ్చారు. దీన్నిబట్టి అర్థం చేసుకోవచ్చు.. ఇది పెట్టుబడుల వేటే కాదు; రెండు ప్రాంతాల మధ్య ఆర్థిక, సాంస్కృతిక, మానవ వనరుల వారధి నిర్మాణ ప్రయత్నమని!

విశాలమైన ఈ కృషికి కొరియా నుంచే ప్రశంసల జల్లు కురవడం పర్యటన సాఫల్యానికి తిరుగులేని నిదర్శనం. కోట్రా దక్షిణాసియా విభాగాధిపతి క్యుంగ్‌హూన్ కిమ్.. లోకేష్ బృందానికి 'హ్యాట్సాఫ్' అంటూ బహిరంగంగా అభినందనలు తెలపడం, ప్రతినిధులు 'పల్లి పల్లి మంత్రి' అంటూ ఆత్మీయంగా పిలుచుకోవడం -విదేశీ గడ్డపై తెలుగు రాష్ట్రానికి దక్కిన అత్యున్నత గౌరవం. అయితే ఈ విజయగాథను రాష్ట్ర రాజకీయ నేపథ్యంలో పెట్టి చూసినప్పుడే దీని విలువ పూర్తిగా బోధపడుతుంది. రాష్ట్రంలో ప్రధాన ప్రతిపక్షం ఆరోపణల రాజకీయాలు, కుట్ర సిద్ధాంతాలతో కాలక్షేపం చేస్తున్న వేళ, ఆ రొదను పట్టించుకోకుండా అభివృద్ధి బాటలో లోకేష్ పరుగులు తీస్తుండటం -యువతలో విశ్వాసం బలోపేతమవుతోంది. విమర్శలకు విమర్శలతో కాక, ఫలితాలతో జవాబివ్వడమే నిజమైన రాజనీతిగా ఈ తరం నాయకుడు నిరూపిస్తున్నాడన్న భావన ప్రజల్లో దేదీప్యమవుతోంది. ప్రపంచ సరఫరా గొలుసులు చైనానుంచి ప్రత్యామ్నాయ గమ్యస్థానాల వైపు చూస్తున్న చారిత్రక సంధి కాలంలో, స్థిరమైన విధానాలు, నైపుణ్య మానవ వనరులు, మౌలిక వసతులున్న ప్రాంతాలదే భవిష్యత్తు. ఆ అవకాశాన్ని ఒడిసిపట్టేందుకు ఏపీ సరైన సమయంలో సరైన తలుపులు తడుతోందని లోకేష్ కొరియా యాత్ర చాటింది. అలాగని గమ్యం చేరిపోయామని కాదు; హామీలు ఒప్పందాలుగా, ఒప్పందాలు ఫ్యాక్టరీలుగా, ఫ్యాక్టరీలు ఉద్యోగాలుగా మారినప్పుడే యాత్ర పరిపూర్ణ సార్థకత సంతరించుకున్నట్టు. అందుకు అనుసరణ (ఫాలో-అప్) యంత్రాంగం నిరంతరం పనిచేయాలి; అపెక్స్-కొరియా సెల్ కాగితాలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో పరిగెత్తాలి. వేగంతోపాటు నిలకడ కూడా తోడైనప్పుడే 'పల్లి పల్లి' ప్రశంస శాశ్వత కీర్తిగా మారుతుంది. దశాబ్దాల క్రితం 'హైటెక్ సీఎం'గా చంద్రబాబు అంతర్జాతీయ ఖ్యాతి గడించిన బాటలో, నేడు తనయుడు 'పల్లి పల్లి మంత్రి'గా గుర్తింపు తెచ్చుకోవడం -ఒక అభివృద్ధి వారసత్వపు కొనసాగింపు కాకపోదు. ఈ వేగం, ఈ దూరదృష్టి, ఈ నిబద్ధత ఇలాగే కొనసాగితే, స్వర్ణాంధ్ర స్వప్నానికి కొరియావంటి మిత్రదేశాలు బలమైన భాగస్వాములవడం రేపటి చరిత్ర కాకపోదు! ■



మన మనసులోని ప్రతికూల ఆలోచనలు ఎప్పుడూ పెద్దగా అరవవు. చాలా నిశ్శబ్దంగా, చిన్నగా భవిష్యత్తును వెనక్కిలాగే కథలు చెప్తాయి. 'రేపు ప్రారంభిద్దాం', 'నేనింకా సిద్ధంగా లేను', 'ఇది నాకు వర్కవుట్ కాదు' అంటూ పురోగతిని దెబ్బతీసే కథలవి. జీవితాన్ని శాసించే అవకాశం అలాంటి కథలకు ఇవ్వకండి. ఆ నిశ్శబ్ద గొంతును గుర్తించడమే మీ ఫస్ట్ సక్సెస్. 'రేపు' అనే మాటను 'ఇప్పుడే' అని మార్చిన క్షణంనుంచే -కలలు నిజమయ్యే ప్రయాణం మొదలైనట్టు. సాకులకు వెయ్యి దార్లు. సంకల్పానికి ఒకే దారి. కాని -ఆ ఒక్క దారే మనల్ని కలలుగన్న శిఖరానికి చేర్చేది. గెలుపు బయటెక్కడో లేదు -మీ లోపలి ఆ చిన్న గొంతును జయించడంలోనే ఉంది!

-మహాదేవ

## వింతల్లో వింతలు

# మనిషిని మించిన వేగం!!



సాలెపురుగు కనిపిస్తే హడలిపోయేవారికి ఒక్కటే ధైర్యం -పరిగెత్తి తప్పించుకోవచ్చనే! కానీ ఆ ఎనిమిది కాళ్ల జీవి మనకంటే వేగంగా పరిగెడితే? అదే పీడకల నిజమైంది. ప్రపంచంలోకెల్లా అత్యంత వేగవంతమైన సాలీడు ఏదో తేల్చేందుకు శాస్త్రవేత్తలు ఏకంగా 258 జాతులను ప్రయోగశాలలో పరీక్షించారు. ఆస్ట్రేలియాలోని క్వీన్స్‌లాండ్‌కు చెందిన 'హంట్స్‌మన్' సాలీడు సెకనుకు దాదాపు 3.6 మీటర్ల (గంటకు 13 కి.మీ.) వేగంతో దూసుకెళ్లి అగ్రస్థానం కైవసం చేసుకుంది. సగటు మనిషి నడక వేగం గంటకు 6-9 కి.మీ. మాత్రమే కావడంతో.. చాలామందిని ఇది సునాయాసంగా వెనక్కి నెడుతుంది! పొడవాటి కాళ్లున్న, కాస్త పెద్దగా ఉండే సాలీళ్లే వేగంగా పరిగెడతాయని, అయితే బరువెక్కిన పొట్ట మోయలేనంత పెద్దవైతే మాత్రం వేగం తగ్గుతుందని అధ్యయనం తేల్చింది. ఇక సాలీడు కనిపిస్తే పరుగు పనికిరాదన్నమాట!

# ఈ ఆహారాలు తింటే రోగనిరోధక శక్తి డబుల్

మన శరీరంలో రెండో మెదడు ఎక్కడ ఉంటుందో తెలుసా? అది మన పొట్ట. పొట్ట ఆరోగ్యంగా ఉంటేనే మన మూడ్ బాగుంటుంది. అన్ని పనులు సజావుగా చేయడానికి శరీరం కూడా సహకరిస్తుంది. రోగనిరోధక శక్తి పెరుగుతుంది. చివరికి చర్మం కూడా కాంతివంతంగా మెరుస్తుంది. కానీ ప్రస్తుత ఉరుకుల పరుగుల జీవితంలో గ్యాస్, ఎసిడిటీ, మలబద్ధకం వంటి సమస్యలు ప్రతి ఒక్కరినీ వేధిస్తున్నాయి. వీటన్నింటికీ ప్రధాన కారణం మనం తీసుకునే ఆహారంలో ఒక ముఖ్యమైన అంశం తగ్గిపోవడమే. అదే 'ఫైబర్' (పీచు పదార్థం). ప్రముఖ గ్యాస్ట్రో స్పెషలిస్ట్ డాక్టర్ పాల్, మన వంటింట్లో దొరికే సాధారణ పదార్థాలతోనే పొట్టను ఎలా క్లీన్ చేసుకోవచ్చో వివరించారు. ఆయన సూచించిన ఆ ఐదు సూపర్ ఫుడ్స్ ఏంటి? ఫైబర్ అనేది జీర్ణవ్యవస్థకు ఒక క్లీనర్ లాగా పనిచేస్తుంది. ఇది మనం తిన్న ఆహారం సాఫీగా కదలడానికి సహాయపడటమే కాకుండా, మన పొట్టలో ఉండే మంచి బ్యాక్టీరియాకు ఆహారాన్ని అందిస్తుంది. ఫైబర్ అందించడంలో వేయించిన శనగలు అగ్రస్థానంలో నిలుస్తాయి. ప్రతి 100 గ్రాముల శనగలలో సుమారు 17 గ్రాముల ఫైబర్ ఉంటుంది. ఇందులో ఉండే ఇన్‌సోల్యూబుల్ ఫైబర్, ప్రోటీన్ మిమ్మల్ని ఎక్కువ సేపు ఆకలి వేయకుండా ఉంచుతాయి. వీటిని చిరుతిండిగా నేరుగా తీసుకోవచ్చు లేదా సలాడ్లలో కలుపుకోవచ్చు. మన ఇళ్లలో సాధారణంగా వాడే నల్ల మినుములలో ఒక కప్పుకు 16 గ్రాముల ఫైబర్ లభిస్తుంది. ఇందులో కరిగే, కరగని ఫైబర్స్ రెండూ ఉంటాయి. ఇవి జీర్ణక్రియను మెరుగుపరచడమే కాకుండా, మన పొట్టలోని మంచి బ్యాక్టీరియాను పోషిస్తాయి. పప్పు మఖానీ లేదా అన్నంలో కలిపి తీసుకోవడం వల్ల గుండెకు కూడా మేలు జరుగుతుంది. చియా విత్తనాలు ఇప్పుడు సూపర్ ఫుడ్‌గా ప్రాచుర్యం పొందాయి. కేవలం రెండు టేబుల్ స్పూన్ల చియా విత్తనాల్లో 10 గ్రాముల ఫైబర్ ఉంటుంది. ఇవి పొట్టలోకి వెళ్ళగానే జెల్ లాగా మారి జీర్ణక్రియను సులభతరం చేస్తాయి. బ్లడ్





షుగర్ లెవల్స్ స్థిరంగా ఉండటానికి కూడా ఇవి తోడ్పడతాయి. డాక్టర్ పాల్ వీటిని పెరుగుతో కలిపి తీసుకోవాలని సూచిస్తున్నారు. చూడటానికి చాలా చిన్నవిగా ఉన్నా, రాస్ప్‌బెర్రీస్ ఫైబర్ పవర్‌హౌస్‌లు. ఒక కప్పు రాస్ప్‌బెర్రీస్‌లో 8 గ్రాముల ఫైబర్ లభిస్తుంది. ఇవి మంచి బ్యాక్టీరియాకు మద్దతు ఇవ్వడమే కాకుండా, శరీరానికి కావాల్సిన యాంటీ ఆక్సిడెంట్లను అందిస్తాయి. వీటిని స్మూతీలలో లేదా ఓట్స్‌లో కలిపి తీసుకోవచ్చు. తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆరోగ్యాన్ని ఇచ్చే పండు జామ. ఇందులో ఫైబర్ పుష్కలంగా ఉంటుంది. మలబద్ధకంతో బాధపడేవారికి ఇది ఒక దివ్యౌషధంలా పనిచేస్తుంది. రోజూ
ఒక జామ పండు తినడం వల్ల జీర్ణవ్యవస్థ మొత్తం శుభ్రపడుతుంది. ఆరోగ్యకరమైన పొట్టే సంతోషకరమైన జీవితానికి ఆధారం. డాక్టర్ పాల్ సూచించిన ఈ ఐదు పదార్థాలను మీ రోజువారీ ఆహారంలో భాగంగా చేసుకోవడం వల్ల జీర్ణ సమస్యల నుండి శాశ్వత ఉపశమనం పొందవచ్చు. ఇవి కేవలం మీ పొట్టనే కాకుండా, మీ పూర్తి ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయి.

## ప్యాకేజీ ఫుడ్‌తో క్యాన్సర్ ముప్పు!



ఆధునిక జీవనశైలిలో మనకు సమయం దొరకడమే కష్టమవుతోంది. అందుకే త్వరగా తయారయ్యే ఇన్స్టంట్ ఫుడ్స్, ప్యాక్ చేసిన పానీయాలు, ఎక్కువ కాలం నిల్వ ఉండే ఆహార పదార్థాల వైపు అందరం మొగ్గు చూపుతున్నాం. కానీ మనం సౌకర్యవంతంగా భావిస్తున్న ఈ ఆహారమే మన ప్రాణాల మీదకు తెచ్చే ప్రమాదం ఉందని మీకు తెలుసా?ఆహారం పాడవకుండా, ఎక్కువ కాలం తాజాగా ఉంచేందుకు కంపెనీలు వాడే కొన్ని కెమికల్స్.. నిశ్శబ్దంగా మన శరీరంలో క్యాన్సర్ కణాలను పెంచుతున్నాయని తాజా అంతర్జాతీయ పరిశోధనలో తేలింది. ముఖ్యంగా మహిళల్లో వచ్చే రొమ్ము క్యాన్సర్, పురుషుల్లో వచ్చే ప్రోస్టేట్ క్యాన్సర్‌లకు ఈ నిల్వ కారకాలే ప్రధాన శత్రువులని నిపుణులు హెచ్చరిస్తున్నారు. అసలు ఆ ప్రమాదకరమైన ప్రిజర్వేటివ్స్ ఏంటి? ఫ్రాన్స్‌లోని 'యూనివర్సిటీ పారిస్ సిటీ' పరిశోధకులు సుమారు 1,05,260 మందిపై సుదీర్ఘ కాలం పాటు జరిపిన అధ్యయన ఫలితాలను 'ది బిఎమ్?జె (ఃఓఏ)' జర్నల్‌లో ప్రచురించారు. ప్యాక్ చేసిన ఆహారాల్లో వాడే 17 రకాల ప్రిజర్వేటివ్స్ గురించి వారు పరిశీలించగా, అందులో కొన్ని సాధారణ కెమికల్స్ క్యాన్సర్ రిస్క్‌ను విపరీతంగా పెంచుతున్నట్లు గుర్తించారు. పొటాషియం సోర్బేట్: ఇది మొత్తం క్యాన్సర్ ముప్పును 14 శాతం, రొమ్ము క్యాన్సర్ ముప్పును 26 శాతం పెంచుతున్నట్లు తేలింది.సోడియం నైట్రైట్: మాంసం నిల్వ ఉంచేందుకు వాడే ఈ కెమికల్ వల్ల ప్రోస్టేట్ క్యాన్సర్ వచ్చే అవకాశం 32 శాతం ఎక్కువగా ఉంది.పొటాషియం నైట్రేట్: దీని వల్ల రొమ్ము క్యాన్సర్ ముప్పు 22 శాతం పెరుగుతోంది.సల్ఫైట్లు: ఆహారంలో వీటి పరిమాణం ఎక్కువైతే సాధారణ క్యాన్సర్ రిస్క్ 12 శాతం పెరుగుతుంది.అసిటేట్లు: ఇవి రొమ్ము క్యాన్సర్ ముప్పును 25 శాతం పెంచుతాయని పరిశోధనలో వెల్లడైంది. ఆహారం నిల్వ ఉండటానికి వాడే ఈ రసాయనాలు మన శరీరంలోని రోగనిరోధక శక్తిని దెబ్బతీస్తాయి. ఇవి శరీరంలో ఇన్ఫ్లమేషన్ (వాపు)ను పెంచి, క్యాన్సర్ కణాలు వృద్ధి చెందడానికి అనువైన వాతావరణాన్ని కల్పిస్తాయి. సహజమైన యాంటీ ఆక్సిడెంట్ ప్రిజర్వేటివ్స్ పెద్దగా నష్టం చేయకపోయినా.. సోడియం ఎరిథోర్బేట్ వంటి కొన్ని రసాయనాలు మాత్రం అనారోగ్యానికి కారణమవుతున్నాయి.

## రాత్రి భోజనానికి ఏది ప్రయోజనకరం



రాత్రి పూట అన్నం తింటే బాగుంటుందా? లేదా రోటీ తింటే బాగుంటుందా? అనే ప్రశ్న తలెత్తుతుంటుంది. రాత్రి పూట ఈ రెండింటిలో ఏదీ తీసుకుంటే మంచిది? వీటి శరీరానికి ఎలాంటి ప్రయోజనాలు ఉంటాయి? దీనిపై నిపుణులు కీలక విషయాలు వెల్లడించారు. రాత్రి భోజనంలో అన్నం తినాలా లేక రోటీ తినాలా అనేది తరచుగా ప్రజలను కలవరపెట్టే ప్రశ్న. నిపుణులు సమాధానం మీ జీవనశైలి, జీర్ణ సామర్థ్యం, ఆరోగ్యంపై ఆధారపడి ఉంటుందని అంటున్నారు. రెండూ పోషకమైనవి. కానీ కొన్ని తేడాలు ఏ విందు ఎంపిక ఉత్తమమో నిర్ణయిస్తాయి. పోషకాహార నిపుణుల అభిప్రాయం ప్రకారం.. రోటీ కంటే బియ్యం వేగంగా జీర్ణమవుతాయి. రాత్రిపూట జీర్ణశక్తి బలహీనంగా ఉంటుంది. అందుకే బియ్యం శరీరంపై ఎక్కువ ఒత్తిడిని కలిగించదు. తెల్ల బియ్యం తేలికగా ఉంటుంది. అలాగే కడుపు, ప్రేగులపై ఒత్తిడిని కలిగించదు. ఇది నిద్రకు కూడా సహాయపడుతుంది. కానీ జాగ్రత్తగా ఉండండి. వడ్డించే పరిమాణాలను అదుపులో ఉంచండి. ఎల్లప్పుడూ పప్పుధాన్యాలు, కూరగాయలను పక్కన పెట్టుకోండి. బ్రెడ్‌లో ఫైబర్ అధికంగా ఉంటుంది. ముఖ్యంగా గోధుమ, జొన్న లేదా మల్టీగ్రెయిన్ పిండి అయితే. రాత్రిపూట రోటీ తినడం వల్ల రక్తంలో చక్కెర స్థాయిలు అదుపులో ఉంటాయి. మధుమేహ వ్యాధిగ్రస్తులకు, బరువును నియంత్రించుకోవాలనుకునే వారికి రోటీ మంచిదని నిపుణులు భావిస్తున్నారు. ఇక రోటీలో ఫైబర్ పుష్కలంగా ఉండటం వల్ల మిమ్మల్ని ఎక్కువసేపు కడుపు నిండి ఉండేలా చేస్తుంది. అన్నం త్వరగా జీర్ణమవుతుంది. అందుకే రాత్రిపూట ఆకలిగా ఉన్నవారికి 1-2 రోటీలు మంచి ఎంపిక. బియ్యంలో ఉండే ట్రిప్టోఫాన్ తేలికపాటి విశ్రాంతినిస్తుంది. అందువల్ల రాత్రిపూట తేలికపాటి భోజనాన్ని ఇష్టపడేవారు కొంచెం అన్నం తినవచ్చు. బరువు తగ్గాలనుకుంటున్నారా ? అయితే రాత్రిపూట రోటీ మంచిది. జీర్ణశక్తి బలహీనంగా ఉందా లేదా తేలికైన భోజనం కావాలనుకునేవారికి అన్నంమంచి ఎంపిక.నిపుణుల అభిప్రాయం ప్రకారం.. రోటీ- అన్నం రెండూ రాత్రిపూట మంచివి. అది మీ ఆరోగ్యం, అవసరాన్ని బట్టి ఉంటుంది.

# ఆహారాలు కుక్కర్‌లో ఉడికించి తింటే.. కిడ్నీలు మటాష్! జాగ్రత్త మరీ..




వంట ప్రక్రియ త్వరగా పూర్తవుతుందని కుక్కర్‌లో అన్ని రకాల ఆహారాలను వండటం సరైనది కాదు. అవును.. కుక్కర్‌లో కొన్ని ఆహార పదార్థాలను వండటం వల్ల వాటి పోషకాలు నాశనమవుతాయి. అలాంటి ఆహారాలు తీసుకోవడం వల్ల ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావాలు ఉంటాయి. దాదాపు ప్రతి ఇంట్లోనూ ప్రెషర్ కుక్కర్లు వాడుతారు. అన్నం వండటం నుంచి సాంబారు తయారీ వరకు త్వరగా వంట పూర్తి చేయడానికి, సమయం, గ్యాస్ ఆదా చేయడంలో ఇది కీలక పాత్ర పోషిస్తుంది. కానీ వంట ప్రక్రియ త్వరగా పూర్తవుతుందని కుక్కర్‌లో అన్ని రకాల ఆహారాలను వండటం సరైనది కాదు. అవును.. కుక్కర్‌లో కొన్ని ఆహార పదార్థాలను వండటం వల్ల వాటి పోషకాలు నాశనమవుతాయి. అలాంటి ఆహారాలు తీసుకోవడం వల్ల ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావాలు ఉంటాయి. అందువల్ల ఈ రకమైన ఆహారాలను ప్రెషర్ కుక్కర్‌లో వండకూడదు.సాధారణంగా చాలా మంది కుక్కర్‌లో బియ్యం వండుతారు. కానీ బియ్యాన్ని ఎప్పుడూ కుక్కర్‌లో వండకూడదు. ఎందుకంటే ఇలా కుక్కర్‌లో బియ్యం వండడం వల్ల ఆర్సెనిక్ అనే విష పదార్థం విడుదల అవుతుంది. ఇది మన ఆరోగ్యానికి హానికరం. కాబట్టి ఓపెన్ పాత్రలో మాత్రమే బియ్యం వండటం మంచిది. పాలకూర, మెంతులు, కొల్లార్డ్ ఆకుకూరలు వంటి ఆకుకూరలను ప్రెజర్ కుక్కర్‌లో ఉడికించడం వల్ల వాటి పోషకాలు నశించి, మూత్రపిండాల్లో రాళ్లు వచ్చే ప్రమాదం పెరుగుతుంది. కాబట్టి వాటిని సాధారణ పాన్‌లో తక్కువ వేడి మీద ఉడికించడం మంచిది. బీన్స్‌లో లెక్టిన్ అనే సహజంగా లభించే టాక్సిన్ ఉంటుంది. ఇది సరిగ్గా ఉడికించకపోతే జీర్ణ సమస్యలను కలిగిస్తుంది. ఫుడ్ పాయిజనింగ్‌కు కూడా కారణమవుతుంది. అలాగే, ప్రెషర్ కుకింగ్ బీన్స్‌లోని లెక్టిన్‌ను వేగంగా విచ్ఛిన్నం చేస్తుంది. ఇది జీర్ణ సమస్యలకు దారితీస్తుంది. కాబట్టి ఈ కూరగాయలను ప్రెజర్ కుక్కర్‌లో ఉడికించడం మంచిది కాదు. ప్రెషర్ కుక్కర్‌లో పాలు మరిగించడం వల్ల దాని సహజ నిర్మాణం మారి అది పెరుగులా మారుతుంది. తద్వారా దాని పోషక విలువలు తగ్గుతాయి. పాలు మరిగించడానికి స్టీల్ లేదా నాన్-స్టిక్ పాన్ ఉత్తమం. టమోటాలు, చింతపండు లేదా పుల్లని పదార్థాలను ప్రెషర్ కుక్కర్‌లో ఉడికించడం వల్ల అవి ఆమ్లంగా మారతాయి. ఇది శరీరానికి హానికరం. కాబట్టి వాటిని స్టీల్ లేదా మట్టి పాత్రలో ఉడికించడం మంచిది. బీన్స్, కొన్ని ధాన్యాలు సహజ విష పదార్థాలను కలిగి ఉంటాయి. వీటిని ప్రెజర్ కుక్కర్‌లో పూర్తిగా తొలగించలేం. కాబట్టి, వాటిని రాత్రంతా నానబెట్టి ఆపై తక్కువ వేడి మీద ఓపెన్ పాత్రలో ఉడికించడం ఆరోగ్యకరమైనది.

# మటన్‌లోని ఈ పార్ట్ తింటే ఇక తిరుగుండదంతే



మేక మెదడు (మటన్ బ్రెయిన్) కూర బలహీనంగా ఉన్న పిల్లలకు, ఆపరేషన్ల నుండి కోలుకుంటున్న వారికి, కండరాల నిర్మాణానికి అద్భుతమైన పోషకాహారం. ఇందులో తక్కువ కార్బోహైడ్రేట్లు, ఎక్కువ ఒమేగా-3 ఫ్యాటీ యాసిడ్స్, ఐరన్, ప్రోటీన్ ఉంటాయి. రక్తం గడ్డకట్టకుండా చేసి, జ్ఞాపకశక్తిని పెంచుతుంది. నాన్ వెజ్ ప్రియులు మటన్ (మేక మాంసం) ను ఎంతో ఇష్టంగా తింటారు.. అయితే.. మేకలోని పలు భాగాలు.. ఎన్నో ప్రత్యేకతలను కలిగి ఉంటాయి.. ఒక్కో పార్ట్.. ఒక్కో ప్రయోజనాన్ని కలిగి ఉంటుంది.. మటన్ తిల్లి, తలకాయ, లివర్, పాయా అన్ని స్పెషలే.. అయితే.. మేక మెదడు కూడా ఆరోగ్యానికి ఎన్నో ప్రయోజనాలను చేకూరుస్తుంది.. మేక మెదడులో ప్రోటీన్, ఒమేగా-3 ఫ్యాటీ యాసిడ్స్, విటమిన్ ః12, ఐరన్, భాస్వరం వంటి పోషకాలు అధికంగా ఉంటాయి.. ఇవి మెదడు ఆరోగ్యం, జ్ఞాపకశక్తి, రక్త ఉత్పత్తి, కండరాల బలానికి మేలు చేస్తాయి. కణాల మరమ్మత్తుకు సహాయపడటమే కాకుండా.. రోగనిరోధక శక్తిని పెంచుతుంది. నాన్-వెజ్ ఆహారాన్ని ఇష్టపడేవారికి, ప్రత్యేకించి ఆరోగ్య ప్రయోజనాలను కోరుకునేవారికి మేక మెదడు కూర ఒక అద్భుతమైన ఎంపిక అని డైటీషియన్లు చెబుతున్నారు. ఈ వంటకం కేవలం రుచిని మాత్రమే కాకుండా, అనేక పోషక విలువలను కూడా అందిస్తుంది. ముఖ్యంగా, ఎదుగుతున్న పిల్లలకు, శారీరకంగా బలహీనంగా ఉన్నవారికి, ఇటీవల ఆపరేషన్ల నుండి లేదా గాయాల నుండి కోలుకుంటున్న వారికి, అలాగే కండరాల నిర్మాణాన్ని లక్ష్యంగా చేసుకుని వ్యాయామం చేసేవారికి ఈ కూర చాలా ప్రయోజనకరంగా ఉంటుంది. మేక మెదడులో కార్బోహైడ్రేట్లు తక్కువగా ఉంటాయి. అయితే ఒమేగా-3 ఫ్యాటీ యాసిడ్స్, ఐరన్, ప్రోటీన్ వంటి ముఖ్యమైన పోషకాలు అధికంగా ఉంటాయి. ఈ పదార్థాలు శరీరానికి శక్తిని అందించి, రోగనిరోధక శక్తిని పెంచుతాయి. ఒమేగా-3 ఫ్యాటీ యాసిడ్స్ మెదడు ఆరోగ్యానికి, హృదయ ఆరోగ్యానికి ఎంతో అవసరం. ఐరన్ శరీరంలో హిమోగ్లోబిన్ ఉత్పత్తికి తోడ్పడుతుంది. తద్వారా రక్తహీనతను నివారిస్తుంది. ప్రోటీన్ కండరాల మరమ్మత్తుకు, పెరుగుదలకు కీలకం. అంతేకాకుండా, మేక మెదడు రక్తం గడ్డకట్టకుండా చేసి, శరీరంలో రక్త ప్రవాహాన్ని సక్రమంగా నిర్వహించడానికి సహాయపడుతుంది. ఇది ఎర్ర రక్త కణాల ఉత్పత్తిని కూడా పెంచుతుంది. తద్వారా ఆక్సిజన్ రవాణాను మెరుగుపరుస్తుంది. జ్ఞాపకశక్తిని పెంచే గుణాలు కూడా దీనిలో ఉన్నాయని పరిశోధనలు సూచిస్తున్నాయి. అయితే కొలెస్ట్రాల్, కొవ్వు ఎక్కువగా ఉండటం వల్ల గుండె జబ్బులు ఉన్నవారు మితంగా తీసుకోవాలి. ఈ రుచికరమైన కూరను తయారుచేయడానికి, ముందుగా తాజా మేక మెదళ్లను పసుపు, ఉప్పు వేసిన నీటిలో 2-3 నిమిషాలు ఉడికించి, శుభ్రం చేసుకోవాలి. ఆ తర్వాత, నూనెలో ఉల్లిపాయలు, పచ్చిమిర్చి, కరివేపాకు, అల్లం వెల్లుల్లి పేస్ట్ వేసి వేయించాలి. శుభ్రం చేసిన మెదళ్లను వేసి, పసుపు, ఉప్పు, కారం కలిపి నిదానంగా వేయించుకోవాలి. లవంగాలు, దాల్చినచెక్క, యాలకులు, మరాఠీ మొగ్గ, అనాస పువ్వు, జీలకర్ర, ధనియాలు, గసగసాలతో తయారుచేసిన మసాలా పేస్ట్‌ను వేసి, తగినంత నీళ్లు పోసి ఉడికించాలి. మెదళ్లు మెత్తబడిన తర్వాత ముక్కలుగా కట్ చేసి, మూతపెట్టి పది నిమిషాలు ఉడికించి, చివరగా కొత్తిమీరతో గార్నిష్ చేస్తే సరిపోతుంది..

## డ్రాగన్ కంట్రీలో జనాభా సంక్షోభం గణనీయంగా తగ్గిన సంతానోత్పత్తి



డ్రాగన్ కంట్రీ చైనాలో వరుసగా నాలుగో సంవత్సరం జననాల రేటు గణనీయంగా తగ్గింది. ఫలితంగా ఇది అక్కడ జనాభా సంక్షోభానికి దారితీస్తుందన్న ఆందోళన మొదలైంది. ఒకప్పుడు జనాభాలో ప్రపంచంలో అన్ని దేశాలకంటే చైనా టాప్ లో ఉండేది. కానీ గతేడాది జులై1 జనాభా లెక్కల ప్రకారం.. ప్రపంచంలో అత్యధిక జనాభా ఉన్న దేశాల లిస్టులో భారత్ ఫస్ట్ ప్లేస్ లో నిలిచింది. చైనా రెండోస్థానానికి పడిపోయింది. 2022లో చైనా మొదటి స్థానంలో ఉండగా.. మూడేళ్లుగా రెండోస్థానంలోనే కొనసాగుతోంది. 2024లో నమోదైన జనాభా సంఖ్యతో పోలిస్తే 2025లో జననాల సంఖ్య 17 శాతం తక్కువగా నమోదైందని అక్కడి గణాంకాలు చెబుతున్నాయి. గతేడాది అక్కడ జననాల సంఖ్య 79.2 లక్షలుగా నమోదయింది. ఆసియా ఖండంలో ఉన్న ఇతర దేశాలతో పోలిస్తే.. చైనాలో సంతానోత్పత్తి రేటు రోజురోజుకూ తగ్గుతోందని, ఇది దేశంపై ప్రతికూల ప్రభావం చూపుతుందని చైనా ఆర్థిక రంగ నిపుణులు చెప్తున్నారు. చైనాలో పిల్లల్ని కనేందుకు జంటలు వెనుకాడుతున్నాయి. ఇందుకు ప్రధాన కారణం.. అక్కడి ప్రజల జీవన ఖర్చులు పెరగడమే. పిల్లల పెంపకం చాలా ఎక్స్పెన్సివ్ కావడంతో కనకపోవడమే మంచిదని భావిస్తున్నారు. పిల్లలు పుట్టినప్పటి నుంచి 18 ఏళ్ల వరకూ చదువుకి, ఇతర సౌకర్యాలు కల్పించేందుకు సరాసరి 76 వేల డాలర్లు అంటే మన కరెన్సీలో రూ.69 లక్షలు ఖర్చవుతున్నట్లు ఒక అంచనా ఉంది. అందుకే పెళ్లిళ్లు చేసుకునేందుకు వెనుకాడుతున్నారు. పెళ్లయిన వాళ్లు పిల్లల్ని కనాలంటే ఖర్చు గురించి ఆలోచిస్తున్నారు. ఈ ఆలోచన ధోరణిని తగ్గించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా ఇప్పటికే కండ్రోమ్స్, గర్భనిరోధక మాత్రలపై 13 శాతం పన్ను విధించింది. నర్సరీ నుంచి కిండర్ గార్టెన్స్ వరకూ, వృద్ధుల సంరక్షణ, వికలాంగుల సేవలు, వివాహ సంబంధిత సేవలు.. వంటివాటిపై ఈ ఏడాది జనవరి 1 నుంచి పన్నును మినహాయించింది.

## ప్రజల్లో పెరుగుతున్న పొట్టతో దేశానికి తీవ్ర నష్టం తప్పదట?

మీరు ఆఫీసులో గంటల తరబడి కూర్చుంటున్నారా..? మీ బరువు పెరుగుతోందా..? చిన్న వయసులోనే షుగర్ వచ్చిందా..? అయితే అలర్ట్..! ఇది కేవలం మీ ఇంట్లో సమస్య కాదు.. దేశ ఆర్థిక వ్యవస్థకే ఒక పెద్ద ముప్పు! అదేంటని ఆశ్చర్యపోతున్నారా..? అసలు లావు వల్ల దేశానికి ఇంత నష్టమా? మనం తినే తిండికి, దేశం డెవలప్‌మెంట్‌కి లింక్ ఏంటి? ప్రపంచాన్ని ఇప్పుడు రెండు దెయ్యాలు పట్టి పీడిస్తున్నాయి. ఒకటి ఊబకాయం.. రెండు డయాబెటిస్! ఈ జబ్బుల వల్ల ప్రపంచవ్యాప్తంగా ప్రతి ఏడాదీ ఏకంగా 5 కోట్ల 40 లక్షల మంది పనికి దూరమవుతున్నారు. అంటే ఒక రకంగా ఒక చిన్న దేశ జనాభా మాయమైపోతున్నట్టే! ఇదే స్పీడ్‌లో వెళ్తే.. 2035 నాటికి ప్రపంచంలో సగం మంది జనాభా.. అవును సగం మంది.. ఓవర్ వెయిట్‌తో బాధపడతారట. దీనివల్ల ప్రపంచానికి ఏటా 4 ట్రిలియన్ డాలర్ల నష్టం వస్తుందని హెచ్చరిస్తున్నారు నిపుణులు. ?ఇక మన భారతదేశ పరిస్థితి చూస్తే భయమేస్తుంది. డయాబెటిస్ వల్ల ఎక్కువ నష్టపోతున్న దేశాల్లో మనది రెండో స్థానం. మన దేశం మీద పడుతున్న భారం ఎంతో తెలుసా? 1.6 ట్రిలియన్ డాలర్లు! మన దగ్గర చాలామందికి చిన్న వయసులోనే షుగర్ రావడం, ఆఫీసులకు సెలవులు పెట్టడం, లేదా త్వరగా రిటైర్ అయిపోవడం వల్ల.. కంపెనీలకు, దేశానికి కోట్లలో నష్టం వస్తోంది. ?కానీ.. ఇప్పుడే మేల్కొంటే లాభం కూడా గట్టిగానే ఉంటుంది! ప్రజల ఆరోగ్యం మీద రూపాయి ఖర్చు పెడితే.. భవిష్యత్తులో అది వంద రెట్లు తిరిగి ఇస్తుంది. అందరూ ఫిట్‌గా ఉంటే 2050 నాటికి ప్రపంచ ఎకానమీకి 11 ట్రిలియన్ డాలర్లు అదనంగా వచ్చి చేరతాయట. ఇప్పటికే అమెరికాలో కొత్త రకం మందులు (ఉఒఖ-1) వాడి ఒబేసిటీని 2శాతం తగ్గించారు. మనం కూడా ఆ దిశగా వెళ్లాల్సిన టైం వచ్చింది. ఫైనల్‌గా చెప్పేది ఒక్కటే.. కంపెనీలు, గవర్నమెంట్లు.. జబ్బు వచ్చాక మందులకు డబ్బులు ఇవ్వడం కాదు.. అసలు జబ్బు రాకుండా ముందే జాగ్రత్త పడాలి. పోషకాహారం, రెగ్యులర్ చెకప్స్ ముఖ్యం. ఎందుకంటే.. వర్కర్ ఫిట్‌గా ఉంటేనే.. దేశం హిట్ అవుతుంది! ఇది మన ఆర్థిక నిపుణులు చెబుతున్న అంచనాలు.

## 30 ఏళ్ల తర్వాత అకస్మాత్తుగా బరువు ఎందుకు పెరుగుతారు

30 సంవత్సరాల వయస్సు తర్వాత.. చాలా మందికి అకస్మాత్తుగా బరువు పెరగడం.. అలాగే అలసట, నీరసం లాంటివి పెరుగుతాయి. దీనికి ప్రధాన కారణం అవసరమైన విటమిన్లు లేకపోవడం కావచ్చంటున్నారు ఆరోగ్య నిపుణులు. 30 ఏళ్ల తర్వాత చాలా మంది పురుషులు, మహిళలు అకస్మాత్తుగా బరువు పెరగడం.. నిరంతరం అలసటను అనుభవిస్తారు. గతంలో సులభంగా ఉండే పనులు ఇప్పుడు శ్రమతో కూడుకున్నవిగా.. అలసిపోయేలా చేసేవిగా అనిపిస్తాయి. ప్రజలు తరచుగా వృద్ధాప్యం, పని ఒత్తిడి లేదా మారుతున్న దినచర్యలు దీనికి కారణమని చెబుతారు. అయితే, చాలా సందర్భాలలో, ముఖ్యమైన విటమిన్లు లేకపోవడం ప్రధాన కారణం కావచ్చు.. దీనిని తరచుగా నిర్లక్ష్యం చేస్తారని వైద్య నిపుణులు పేర్కొంటున్నారు. శరీరానికి తగినంత విటమిన్లు అందనప్పుడు.. దాని ప్రభావాలు క్రమంగా కనిపిస్తాయి. బరువు పెరగడం, శక్తి లేకపోవడం, బద్ధకం దీనికి సంకేతాలు కావచ్చు. ఈ లక్షణాలు రోజువారీ జీవితాన్ని ప్రభావితం చేయడం ప్రారంభిస్తాయి. కాబట్టి, ఈ మార్పులను తేలికగా తీసుకోవడం తెలివైనది కాదు. శరీరంలో ఏ విటమిన్ లోపాలు బరువు పెరగడానికి, అలసటకు దారితీస్తాయి..? ఇంతలో, విటమిన్ ః12 శరీరానికి శక్తిని అందించడంలో, ఆరోగ్యకరమైన నాడీ వ్యవస్థను నిర్వహించడంలో కీలక పాత్ర పోషిస్తుంది. ః12 లోపం శక్తి ఉత్పత్తి తగ్గడానికి దారితీస్తుంది.. అలసట, బలహీనత, కార్యాచరణ తగ్గడానికి దారితీస్తుంది. ఈ రెండు విటమిన్లలో దీర్ఘకాలిక లోపాలు బరువు నియంత్రణను కష్టతరం చేస్తాయి.. ఇంకా తీవ్ర అలసటకు దారితీస్తాయి. విటమిన్ డి లోపాన్ని అధిగమించడానికి, ప్రతిరోజూ కొంత సమయం ఎండలో గడపడం ప్రయోజనకరంగా ఉంటుంది. అదనంగా, మీ ఆహారంలో పాలు, పెరుగు, బలవర్ధకమైన ఆహారాలను చేర్చుకోండి. విటమిన్ బి 12 కోసం, పాలు, పెరుగు, జున్ను, పప్పుధాన్యాలు, ఆకుపచ్చ కూరగాయలు, చేపలు, చికెన్, గుడ్లు, బలవర్ధకమైన ఆహారాలను మీ ఆహారంలో చేర్చుకోండి. అవసరమైతే, వైద్యుడి సలహాతో సప్లిమెంట్లను తీసుకోవచ్చు.

# లార్డ్స్‌లో ఉమెన్స్ టీమిండియా నయా హిస్టరీ:

## ఇంగ్లాండ్‌పై 270 పరుగుల తేడాతో హర్మన్ సేన ఘన విజయం






**హైదరాబాద్ పెన్ పవర్:** బ్రిటన్: క్రికెట్ మక్కాగా పేరొందిన ప్రతిష్టాత్మక లార్డ్స్ మైదానంలో టీమిండియా ఉమెన్స్ టీమ్ నయా చరిత్ర సృష్టించింది. యస్తికా భాటియా సెంచరీతో కదం తొక్కగా.. క్రాంతి గౌడ్ 7 వికెట్లతో చెలరేగడంతో ఇంగ్లాండ్ మహిళా జట్టుతో జరిగిన ఏకైక టెస్ట్‌లో భారత అమ్మాయిలు 270 పరుగుల భారీ తేడాతో చారిత్రాత్మక విజయాన్ని అందుకున్నారు. 457 పరుగుల లక్ష్యంతో సెకండ్ ఇన్నింగ్స్ ప్రారంభించిన ఇంగ్లాండ్ 186 పరుగులకే ఔట్ అయ్యింది. 130/6తో నాలుగో రోజు ఆట ఆరంభించిన ఇంగ్లీష్ అమ్మాయిలు భారత బౌలర్ల ధాటికి మరో 56 పరుగులే చేసి చివరి నాలుగు వికెట్లు కోల్పోయిరు. దీంతో ఇండియా 270 పరుగుల భారీ తేడాతో విజయాన్ని నమోదు చేసి చరిత్ర సృష్టించింది. ఈ ఏకైక టెస్ట్‌లో టీమిండియా అమ్మాయిలు ఫస్ట్ ఇన్నింగ్స్‌లో 285 పరుగులు చేసి ఆలౌట్ అయ్యారు. ఓపెనర్ స్మృతి మందనా (83), కెప్టెన్ హర్మన్ ప్రీత్ కౌర్ (58), స్టార్ ఆల్ రౌండర్ దీప్తి శర్మ (57) హాఫ్ సెంచరీలతో రాణించారు. అతిథ్య ఇంగ్లాండ్ అమ్మాయిలు ఫస్ట్ ఇన్నింగ్స్?లో కేవలం 170 రన్స్ మాత్రమే చేసి ఆలౌట్ అయ్యారు. వికెట్ కీపర్ జోన్స్ (52) హాఫ్ సెంచరీతో ఆకట్టుకోగా.. నాట్ స్కీవర్ బ్రంట్ (44) రాణించింది. భారత బౌలర్లలో క్రాంతి గౌడ్ 5 వికెట్లతో ఇంగ్లాండ్ పతనాన్ని శాసించింది. దీంతో ఫస్ట్ ఇన్నింగ్స్‌లో ఇండియాకు 115 పరుగుల ఆధిక్యం లభించింది.

సెకండ్ ఇన్నింగ్స్‌లో ఇండియా అమ్మాయిలు దుమ్మురేపారు. వికెట్ కీపర్ యస్తికా భాటియా (113) చారిత్రాత్మక సెంచరీతో కదం తొక్కగా.. స్మృతి మందనా (70), రిచా ఘోష్ (50) అర్థ సెంచరీలతో ఆకట్టుకున్నారు. ఈ క్రమంలో 341 పరుగుల వద్ద టీమిండియా ఇన్నింగ్స్ డిక్లేర్ చేసింది. దీంతో ఫస్ట్ ఇన్నింగ్స్ ఆధిక్యం కలుపుకుని ఇంగ్లాండ్ 457 పరుగుల లక్ష్యంతో సెకండ్ ఇన్నింగ్స్ ఆరంభించింది. రెండో ఇన్నింగ్స్‌లోనూ ఇంగ్లాండ్ అమ్మాయిలు సత్తా చాటలేకపోయారు. భారత బౌలర్ల ధాటికి 186 పరుగులకే చాప చుట్టేశారు. దీంతో ఇండియా ఉమెన్స్ టీమ్ 270 పరుగుల భారీ తేడాతో విజయాన్ని అందుకుని లార్డ్స్ మైదానంలో సరికొత్త చరిత్ర సృష్టించింది.

# 18 ఏళ్ల బంధానికి బ్రేక్: చెన్నై సూపర్ కింగ్స్ హెడ్ కోచ్ పదవికి స్టీఫెన్ ఫ్లెమింగ్ గుడ్ బై







**హైదరాబాద్ పెన్ పవర్:** ఐపీఎల్‌లో మోస్ట్ పాపులర్ టీమ్ చెన్నై సూపర్ కింగ్స్ హెడ్ కోచ్ పదవికి స్టీఫెన్ ఫ్లెమింగ్ గుడ్ బై చెప్పాడు. సీఎస్కే యాజమాన్యం సోమవారం (జులై 13) ఈ విషయాన్ని అధికారికంగా ధృవీకరించింది. పరస్పర అంగీకారంతో సీఎస్కే హెడ్ కోచ్ పదవి నుంచి స్టీఫెన్ ఫ్లెమింగ్ తప్పుకున్నట్లు ఫ్రాంచైజీ తెలిపింది. దీంతో సీఎస్కే, ఫ్లెమింగ్ మధ్య 18 ఏళ్ల సుధీర్ఘ బంధానికి ఎండ్ కార్డ్ పడింది. 2008లో ఆటగాడిగా చెన్నైలో చేరిన ఫ్లెమింగ్.. 2009 నుంచి ఆ జట్టు హెడ్ కోచ్‌గా వ్యవహరిస్తున్నాడు. ఫ్లెమింగ్ సారథ్యంలో చెన్నై జట్టుకు ఐపీఎల్‌లో తిరుగే లేకుండా పోయింది. ఫ్లెమింగ్, ధోనీ కాంబినేషన్‌లో సీఎస్కే 5 ఐపీఎల్ టైటిల్స్, 2 చాంపియన్స్ ట్రోఫీలు గెలిచింది. రికార్డు స్థాయిలో 12 సార్లు ఐపీఎల్ ప్లేఆఫ్స్‌లోకి ప్రవేశించగా.. 10 ఫైనల్స్‌లో భాగమైంది.అయితే, గత మూడేళ్లుగా ఐపీఎల్‌లో చెన్నై సూపర్ కింగ్స్ అట్టర్ ఫ్లాఫ్ షో కనబర్చింది. భారీ అంచనాలతో బరిలోకి దిగి కనీసం ప్లే ఆఫ్స్ కూడా చేరకుండా లీగ్ దశలోనే ఇంటి దారి పట్టింది. వరుస వైఫల్యాల నేపథ్యంలో జట్టును ప్రక్షాళన చేయాలని సీఎస్కే యాజమాన్యం భావిస్తోంది. ఈ నేపథ్యంలోనే ఫ్లెమింగ్ తన పదవికి రాజీనామా చేసినట్లు తెలుస్తోంది.

**సీఎస్‌కే ఎల్లప్పుడూ నా గుండెల్లో ఉంటది: ఫ్లెమింగ్**

18 ఏళ్ల సుదీర్ఘ బంధానికి ముగింపు పలుకుతూ సీఎస్కేను వీడటంపై స్టీఫెన్ ఫ్లెమింగ్ భావోద్వేగానికి గురయ్యాడు. సీఎస్‌కే ఎల్లప్పుడూ నా గుండెల్లోనే ఉంటదని పేర్కొన్నాడు. "క్రీడా ప్రపంచంలో పద్దెనిమిదేళ్లు అంటే ఒక జీవితకాలం లాంటిది. కృతజ్ఞత తప్ప ఎలాంటి బాధ లేకుండా జట్టును వీడుతున్నా. చెన్నై సూపర్ కింగ్స్‌తో గడిపిన సమయం నా కోచింగ్ కెరీర్‌లో లభించిన ఒక గొప్ప అవకాశం. మేము సాధించిన ప్రతిదానికీ నేను గర్వపడుతున్నాను. మనందరం కలిసి ఎన్నో మరపురాని విజయాలను జరుపుకున్నాం. కష్ట సమయాలను కూడా చవిచూశాం. నా జీవితాంతం గుర్తుండిపోయే జ్ఞాపకాలను నిర్మించుకున్నాం. సీఎస్‌కే ఎల్లప్పుడూ నా హృదయానికి దగ్గరగా ఉంటుంది. భవిష్యత్‌లో కూడా నేను ఆ జట్టుకు మద్దతు ఇస్తూనే ఉంటాను" అని ఫ్లెమింగ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

# రూ.91 వేల కోట్ల స్పోర్ట్స్ డీల్.. సియాటిల్ సీహాక్స్‌ను సొంతం చేసుకున్న భారతీయుడు!





**హైదరాబాద్ పెన్ పవర్:** అమెరికన్ ప్రొఫెషనల్ స్పోర్ట్స్ చరిత్రలోనే అత్యంత భారీ ఒప్పందాల్లో ఒకటి నమోదైంది. భారతీయ మూలాలు కలిగిన సిలికాన్ వ్యాలీ దిగ్గజ పెట్టుబడిదారు వినోద్ ఖోస్లా సూపర్ బౌల్ విజేత సియాటిల్ సీహాక్స్‌ను 9.6 బిలియన్ డాలర్లకు కొనుగోలు చేసేందుకు ఒప్పందం కుదుర్చుకుంది. భారత కరెన్సీ లెక్కల ప్రకారం దీని విలువ రూ.91వేల 200 కోట్లుగా ఉంది. ఈ డీల్‌తో ఇప్పటివరకు ఏ ఎన్‌ఎఫ్‌ఎల్ జట్టుకూ లేని అత్యధిక ధర పలికింది. ఇది కేవలం ఒక జట్టు ఓనర్షిప్ మారడం మాత్రమే కాదు.. గ్లోబల్ స్పోర్ట్స్ రంగంలో టెక్నాలజీ బిలియనీర్ల ప్రభావం ఎంత వేగంగా పెరుగుతోందో చెప్పే మరో కీలక మైలురాయి.ఇప్పటి వరకు ఎన్‌ఎఫ్‌ఎల్ చరిత్రలో అత్యంత ఖరీదైన ఫ్రాంచైజీ కొనుగోలు రికార్డు 2023లో వాషింగ్టన్ కమాండర్స్ కోసం చెల్లించిన 6.05 బిలియన్ డాలర్లదే. కానీ ఇప్పుడు సీహాక్స్ 9.6 బిలియన్ డాలర్ల విలువతో ఆ రికార్డును భారీ తేడాతో అధిగమించింది. ఇటీవల సూపర్ బౌల్ విజయంతో జట్టు బ్రాండ్ విలువ మరింత పెరగడం, వాణిజ్యపరంగా బలమైన స్థాయిలో ఉండటం ఈ భారీ ధరకు ప్రధాన కారణాలుగా భావిస్తున్నారు.వినోద్ ఖోస్లా ప్రయాణం భారతదేశంలో ప్రారంభమై సిలికాన్ వ్యాలీలో సక్సెస్ స్టోరీగా మారింది. ఐఐటీ ఢిల్లీ నుంచి డిగ్రీ పొందాక ఆయన అమెరికాకు వెళ్లి సన్ మైక్రోసిస్టమ్స్‌ను కో ఫౌండర్ అయ్యారు. అనంతరం ఖోస్లా వెంచర్స్‌ను ప్రారంభించి ఏఐ, హెల్త్ కేర్, క్లీన్ ఎనర్జీ, సాఫ్ట్‌వేర్ వంటి రంగాల్లో పెట్టుబడులు పెట్టి ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందారు. టెక్ ప్రపంచంలోని విజయాన్ని ఇప్పుడు ప్రపంచ క్రీడారంగంలోనూ రిపీట్ చేయాలని చూస్తున్నారు.

సీహాక్స్‌ను 1997లో మైక్రోసాఫ్ట్ సహవ్యవస్థాపకుడు పాల్ అలెన్ 194 మిలియన్ డాలర్లకు కొనుగోలు చేశారు. ఆయన మరణం తర్వాత సోదరి జోడి అలెన్ ఆధ్వర్యంలో జట్టు కొనసాగింది. పాల్ అలెన్ ఇచ్చిన ఆదేశాల మేరకు జట్టును విక్రయించి వచ్చిన నిధులను సేవా కార్యక్రమాలకు వినియోగించనున్నారు. ఎన్‌ఎఫ్‌ఎల్ అనుమతి లభించిన తర్వాత నీరూ ఖోస్లా జట్టు నియంత్రణ బాధ్యతలు చేపట్టనుండగా, వినోద్ ఖోస్లా కూడా కుటుంబ సభ్యులతో కలిసి కీలక పాత్ర పోషించనున్నారు. మట్నుత్తానికి మెగా స్పోర్ట్స్ డీల్ ప్రపంచ వ్యాప్తంగా పెద్ద చర్చకు దారితీయటంతో పాటు కొత్త శకానికి నాంది పలికిందని నిపుణులు అంటున్నారు.

# ఆ విషయంలో అనుష్క ఎన్నడు చింతించలేదా?







మాలీవుడ్ లో -కథనార్- వంటి వైవిధ్యభరితమైన ప్రాజెక్టులను ఎంచుకోవడం చూస్తుంటే? ఆమెకు గ్లామర్ హంగుల కంటే అభినయానికి ప్రాధాన్యత ఇచ్చే కథలే ముఖ్యమని అర్థమవుతోంది. పాత అవకాశాల గురించి ఆలోచించి వర్తమానాన్ని వదులుకునే రకం కాదని నిరూపిస్తుంది.

నిజానికి బాలీవుడ్ అవకాశాలు రాకపోవడం అనేది అనుష్క కెరీర్ పరంగా వైఫల్యం కాదు. అది అనుష్క ఎంచు కున్న మార్గం. దక్షిణాదిలో ఆమెకు దక్కిన ఆదరణ, అభిమానుల ప్రేమ ఏ బాలీవుడ్ స్టార్‌కు తీసిపోని విధంగా ఉంటాయి. తాను తిరస్కరించిన ఆ బాలీవుడ్ ప్రాజెక్టుల గురించి తానెప్పుడు పశ్చాత్తాపం చెందలేదు. పైగా తనకంటూ ఓ ప్రత్యేకతను నిలబెట్టుకుని ఐకానిక్ నటిగానే నేటికి కొనసాగుతున్నారు.

అనుష్క స్పష్టమైన విజన్‌తో ముందుకు వెళ్తున్నారనిపిస్తుంది. సినిమా అంటే మార్కెట్ విస్తరణ మాత్రమే కాదు. అది ఒక నటిగా తన ఆత్మ సంతృప్తి అని బలంగా నమ్ముతున్నారు. గతాన్ని తలుచుకుని బాధపడటం కంటే ముందున్న కథల గురించి ఆలోచించడంపైనే దృష్టి పెడతానంటోంది. ఈ పక్వత అనుష్కను మిగతా నటీమ ణులకు భిన్నంగా నిలబెడుతోంది. కెరీర్ అంటే అవకాశాల వేట కాదు. అదొక ప్రయాణం. అనుష్క ఆ ప్రయాణంలో తాను కోరుకున్నట్లుగానే ముందుకెళ్తున్నారు.

కెరీర్ పీక్ స్టేజ్‌లో ఉన్నప్పుడు బాలీవుడ్ నుండి వచ్చిన భారీ అవకాశాలను తిరస్కరించడం అంటే సాధారణ విషయం కాదు. -బాహుబలి-, -రుద్రమదేవి- వంటి చిత్రాలతో పాన్-ఇండియా స్టార్‌డమ్ అనుభవిస్తున్న సమయంలో అనుష్క శెట్టికి హిందీ పరిశ్రమ నుంచి వరుస ఆఫర్లు వచ్చాయి. అయితే అప్పటికే తెలుగులో బిజీగా ఉండటం.. ఇతర కమిట్‌మెంట్ల వల్ల ఆ అవకాశాలను పక్కన పెట్టారు. కాలక్రమేణా పరిస్థితులు మారాయి. ఇప్పుడు అదే టాలీవుడ్ అనుష్కను పక్కనబెట్టింది. ప్రస్తుతం బాలీవుడ్ ఆఫర్లు కూడా రాలేదు. ఇలాంటి పరిస్థితుల్లో ఏ నటి అయినా? అయ్యో బాలీవుడ్ అవకాశాలు అనవసరంగా వదులుకున్నానే అని వాపోతుంటారు. కానీ అనుష్క మాత్రం అలాంటి వాళ్లందరికీ భిన్నమని తెలుస్తోంది. అనుష్క వ్యక్తిత్వం చాలా ప్రత్యేకమైనది. ఆమె కెరీర్‌ను అవకాశాల సంఖ్యతో కొలవలేదు. నచ్చిన కథ, పాత్రకు ఉండే లోతు మాత్రమే ముఖ్యం. బాలీవుడ్‌లో గ్లామర్ పాత్రలు చేయడం కంటే దక్షిణాదిలో తనకంటూ బలమైన ముద్ర వేసే పాత్రలు చేయడం ఎంతో సంతృప్తినిచ్చిందన్నారు. ఈ నేపథ్యంలోనే అప్పట్లో బాలీవుడ్ వెళ్లలేదే అని తానెప్పుడు బాధపడలేదన్నారు.

పరిశ్రమలో నటిగా అనుష్క స్థానం ఎంతో గౌరవప్రదమైనది. బాలీవుడ్ ఆఫర్లు రాలేదని ఆమె ఖాళీగా కూర్చోలేదు. తన స్థాయికి తగ్గట్లుగా కథా ప్రాధాన్యత ఉన్న సినిమాలపైనే దృష్టి సారించారు.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001 and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965